
ఆంధ్ర సచిత్ర వారపత్రిక



క్రొత్త

పాలతో కూడిన ఫారెక్స్ ఘన ఆహారం



అధిక రుచికరం అధిక సంపూర్ణం



ప్రేమతో మీరు పెట్టే ప్రతి చెంచాడు పాపాయి పెరుగుదలకు మంచిది.

పాలతో కూడిన ఫారెక్స్ ఘన ఆహారం.

కలపడం సులభం. పాపాయికి తినిపించడం సులభం.

పాలతో కూడిన ఫారెక్స్ ఘన ఆహారం.

పాపాయి పెరుగుదలకు అత్యావశ్యకమైన ప్రోటీన్‌తో సమృద్ధం. ఆరోగ్యవంతమైన రక్తంకోసం అదనంగా ఐరన్ కలిగినది. గట్టి పళ్లు, ఎముకలకోసం సరియైన నిష్పత్తిలో కాల్షియం మరియు ఫాస్ఫరస్ కలిగినది. పాపాయి సున్నిత జీర్ణశక్తికి అనువుగా ముందుగానే పచనం చేయబడినది.

పాలతో కూడిన ఫారెక్స్ ఘన ఆహారం.

పతి చెంచాలో అధిక సంపూర్ణ ఘన ఆహారం.


విజయ అండ్ కో,
మీ గృహజీవితాన్ని ఆనందమయం చేస్తుంది
TV'S
Dyanora
UPTRON
CROWN TV
Weston
Telerama
VCR's & VCPs
Weston
PHILIPS
Radios
hmt
ALLWYN
Watches
AHUJA
P. A. Systems,
Sumeet
MECO
Meenu
Mixies
Gramephone Records & Cassets
అన్నిటికి నమ్మకమైన విక్రయానంతర సర్వీసు
విజయ అండ్ కో,
మెయిన్ రోడ్, గుంటూరు-522003 ఫోన్: 21956
విజయ అండ్ కో,
ఏలూరు రోడ్, విజయవాడ-520 002 ఫోన్: 75153

TARA-344/84

ఆంధ్రసచిత్రవారపత్రిక

వ్యవస్థాపకులు :

దేశోద్ధారక కాశీనాథుని

నాగేశ్వరరావు పంతులుగారు

స్థాపితం : 1908

శివలెంక శంభుప్రసాద్

సంపాదకుడు :

[1938–1972]

శుక్రవారం : 8–6–'84

శ్రీ రక్తాక్షినామ సం. జ్యేష్ఠ శు. దశమి

సంపుటము 76 : సంచిక 39

సంపాదకుడు :

శివలెంక రాధాకృష్ణ

విడి ప్రతి వెల రు. 1-80

ఆరు మాసాల చందా రు. 46-80

పోస్టులో ఏడాదిచందా రు. 101-40

ఆంధ్రపత్రిక కార్యాలయము,

గాంధీనగరం. విజయవాడ-520 003.


విషయానుక్రమణిక

ముఖచిత్రం :

నటి ''మేనక''

(ఫొటో : కాజాస్)

లోకం పోకడ....ఊమెన్



అశోకా హొటల్ లోంచి చూస్తే ఏమి కనపడుతుంది?

ఈ పవిత్ర భారతదేశంలో జనం ఈగలలాగ చస్తున్నారు. పశ్చిమ బెంగాలు ఒక రోగాల రాష్ట్రం. అక్కడ వెయ్యిమందికి పయిగా "గాస్ట్రో—ఎంటరయిటిస్" వచ్చి పోయారుట. ఒకప్పుడు ఈ జబ్బుకి ఇంకొకపేరు ఉండేది. దానిని "కలరా" అనేవాళ్లు. ఇక గుజరాత్‌లో కాలేయవ్యాధి ఒకటి (హెపటయిటిస్) వచ్చి చాలామంది మరణించారు. ఒక ఆసుపత్రిలో మాత్రమే 600 మంది రోగులు (వీరిలో 20 మంది డాక్టరులు) చచ్చిపోయారు. తమిళనాడులో "కోతుల జబ్బు" ఏదో వచ్చి వందలమంది మరణించారు. మహారాష్ట్ర, ఒరిస్సాలలో సయితం ఇలాంటి రోగాలు చెలరేగుతున్నాయి. ప్రభుత్వం వారు "మాకు ఇదంతా ఏమీ పట్టదు" అని చేతులు దులిపేసుకుంటారనుకోండి—శ్రీలంక, నేపాల్ లేదా బంగళాదేశ్ నుంచి వ్యాధులు దిగుమతి అయ్యాయి అన్నా వింతలేదు. శ్రీమతి గాంధీ ఇది కూడా ఒక భౌగోళిక సమస్య అంటారేమో...

భౌగోళికమూ కాదు, ఇంకేమీ కాదు. యూరోపులో గత ఒక శతాబ్దంగా ఇలాంటి రోగాలు వచ్చాయా ? లేదే ! మరి భారత దేశంలో మాత్రం ఎందుకు రావాలి ? భారత దేశమే కాదు, బంగళాదేశ్‌లో మాత్రమే ఎందుకు రావాలి ? ఈ మధ్యనే ఢిల్లీ పత్రికలలో ఒక ప్రకటన పడింది. అది "సులభశవ్‌చాల"యాన్ని గురించి. ఇది గ్రామ ప్రాంతాలు మొదలయిన వాటికి అనుగుణగా ఉండే పాయిఖానా. ఇంగ్లీషులో "ఫ్లష్ టాయిలెట్" అనబడేది. గ్రామ ప్రాంతాలకోసం నిర్దేశించబడిన ఇవి ఢిల్లీకి బాగా పనికివస్తాయి. ఎందుకంటారా ? ఈ మహానగరంలో, దేశం మొత్తంమీద అన్ని గ్రామాలకీ నీటి వసతి కోసం కర్చు చేసిన మొత్తం కన్నా ఎక్కువ మొత్తం 'అలంకరణ' మీద కర్చు అయిన ఈ ఢిల్లీ మహా నగరంలో 2 లక్షల గృహాలకి బొంబాయి లెట్రిన్‌లు లేవు. (అని సులభశవ్‌చాలయ ప్రకటన చదివి తెలుసుకున్నాను) ఈ ఇళ్లకి పల్లెటూళ్లలో కనిపించే "పొడి పాయఖానా"లే ఉన్నాయట. అంటే వీటిలోని మలాన్ని ఎత్తివేస్తారన్న మాట. వీటికి డ్రెయినేజి సదుపాయాలు లేవన్నమాట. ఇవి ఇలాగ ఉండగా అసలే పాయిఖానాలు లేని ఇళ్లు 5 లక్షలు ఉన్నాయిట. వీటిలో ఉండేవారు బయలుప్రదేశాలకి వెళ్లి మలవిసర్జన చెయ్యవలసిందే.

అంటే, ఈ దేశం రాజధానిలో సుమారుగా 7 లక్షల ఇళ్లకి – అంటే సుమారు 28 లక్షల మంది జనానికి – ఆధునిక పాయిఖానా సదుపాయాలు లేవన్నమాట ఇది 1984లో. స్వాతంత్ర్యం వచ్చిన 37 సంవత్సరాల తర్వాత ఢిల్లీలోని జనంలో మూడవ వంతు వాళ్లకి తగిన ఆధునిక మలమూత్ర విసర్జనశాలలు లేవన్నమాట.

ఇదంతా ఏదో ఒక మారుమూల ప్రదేశంలో కాదు. ఉపగ్రహాలూ, రాకేష్‌శర్మ మొదలయిన వార్తాంశాలని గురించి తెలియనివాళ్ల ఊళ్లలో కాదు – అశోకా హొటల్‌కి 3 కిలోమీటరుల దూరంలోనే, ఒక మహానగరంలోనే. ఈ అశోకా హొటల్‌లోనే విదేశాంగ శాఖకి చెందిన నట్వార్‌సింగ్ ఇటీవలే తటస్థ దేశాల సమావేశానికి వచ్చిన కొందరు అరబ్బుల కోసం లక్షలు కర్చు చేసి బాత్‌రూమ్‌లు కట్టించారు. ఈ హొటల్ గదులలో నుంచి బయటికి చూస్తే, పొగమంచు లేని రోజున ఎందరినయినా బయలు ప్రదేశాలలో మలవిసర్జన చేసేవారిని చూడవచ్చు. వీళ్లలో కొందరు మలవిసర్జన చేసేది "ఆఫ్రికా ఎవెన్యూ" లోనే ! ఈ వీధి [రాజవీధి] అశోకా హొటల్‌నీ, నెహ్రూ విశ్వవిద్యాలయాన్నీ కలుపుతుంది. సఫ్దర్‌జంగ్ రోడ్ [ప్రధాన మంత్రి నివాసం] అశోకా హొటల్‌కి అరకిలోమీటరు లోపలే ఉంటుంది.

జగ్‌మోహన్ అదృష్టవశాత్తు ఈయన "భికాజీ కామా ప్లేస్" అనే చోట గొప్ప "షాపింగ్ సెంటర్" ఒకటి నిర్మింప చేస్తున్నారు. [ఇంతలో వీరు కాశ్మీరుకి మారారు.] ఇక్కడ బయలు ప్రదేశంలో మలవిసర్జన కొనసాగుతూ ఉంటుంది. ఈ పేటలో స్థలాలు ఎకరానికి రు. 4 కోట్లు చేస్తాయి. ఇక్కడ భవనాలకి పాలరాయి, ఎర్రరాయి వాడుతూ ఉంటారు. (భికాజీ కామా ఎవరు? యూరోపులో భారత జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన పార్శీ వనిత.)




సులభ శవ్‌చాలయాన్ని రు. 1400 కి నిర్మించవచ్చుట. ఇలాంటివి 700000 నిర్మిస్తే రు. 100 కోట్లు కూడా కాదు. ఇది ప్రభుత్వం వ్యయంలో ఎంత ? పాలరాతి స్నానాల గదులూ, కారులు ప్రయాణాలు చేసే ఫ్లయిఓవర్‌లూ, స్టేడియమ్‌లూ – వీటి వ్యయంతో పోలిస్తే ఈ కర్చు ఏమాత్రం ? ఇలాగ బయలు ప్రదేశాలలో మలమూత్ర విసర్జనలు జరుగుతూ ఉంటే రోగాలు ఎలాగ పోతాయి ?

దేశ రాజధాని సంగతి ఇలాగ ఉంది. చిన్న ఊళ్ల సంగతి చెప్పాలా ? శ్రీమతి గాంధీ, ఆమె తోటివారూ ఇదిలేదు, అదిలేదు అంటూ ప్రపంచ బాంకు సహాయం కోసం పరుగులెత్తుతారు. ఈ ప్రపంచ బాంకువాళ్లు కూడా "మీకు 5 – చుక్కల హొటళ్లకి డబ్బు ఉంది, మంచినీటి సరఫరాకి ఎందుకు లేదూ ?" అని అడగరేమీ ?

మనకి డబ్బుకి తక్కువలేదు. మనకి ఏది ముఖ్యమో ఏది ముఖ్యంకాదో తెలీదు. ఏది ఒప్పో, ఏది తప్పో కూడా తెలీదు. అందుకనే నేను తటస్థదేశాల సమావేశాన్నీ, కామన్వెల్తు దేశాల ప్రభుత్వాల సమావేశాన్నీ తలుచుకుని అసహ్యించుకుంటాను. కొందరి అలంకరణలు ఎందరో అవసరాలకన్నా ఎక్కువా ? కొందరు ధనవంతుల విలాసాలు కోట్లబీదల అవసరాలకన్నా ముఖ్యమా? టి. వి. మీద బూటాసింగ్, జగ్‌మోహన్‌లు ఢిల్లీ ఎంత అందమయిన నగరమో వివరిస్తారు. నిజానికి ఇది చాలా వికారమయిన ఊరు. ఇది హిట్లర్ బెర్లిన్ కన్నా, ముసోలినీ రోమ్ కన్నా అందవికారమయిన ఊరు. ఒక నగరంలో కొన్ని పెద్ద రాచబాటలు ఉన్నంత మాత్రాన చాలదు. వాటి వెంబడే పెద్ద కారులు వెళ్లినంత మాత్రాన చాలదు. అందం అన్నది కేవలం బాహ్యమయినది కాదు. లోపలి సౌందర్యం కూడా ఉంటుంది. ఎందరికి ఎంత మంచి జరిగితే అంత అందం.

నవలా రచయిత డికెన్స్ రోజులలో లండన్ వికారమయిన నగరమే. ఇప్పటికీ లండన్‌లో కొన్ని చెడ్డచోట్లు ఉన్నాయి. కాని ప్రధానమంత్రి నివాసానికి కిలోమీటరు దూరంలో ఎవరయినా మలవిసర్జన చెయ్యటం చూస్తామా? ఇది బొంబాయి, ఢిల్లీలలో నిత్యమూ కనిపించేదే కదా ? పాలకవర్గంవారి అవినీతి అంతా వాళ్ల ఔదాస్యంలోనే బయట పడిపోతుంది. అంతూలే, ఆదిక్, గుండురావుల వర్గం ఇది. పెంటకుప్పలో పురుగులు పుట్టినట్లే ఈ వర్గంలో అవినీతి పుట్టి పెరుగుతుంది. తప్పు, ఒప్పుల విచక్షణ

కన్నులున్న నెమలి సాక్షి
వంద కథల పోటీ



'కథ' తెలుగు సాహితీ చరిత్రకే పెద్ద మలుపు. ఆ మలుపులో మా సంస్థ నిర్వహిస్తున్న పత్రిక పయనించి ఉన్నత శిఖరాలనధిరోహించాలని ఆశిస్తున్నాం. పాఠకులకు చక్కని కథలు అందించే ప్రయత్నంలో —

రూ. 15,000 బహుమతి
మొత్తంగా ప్రకటిస్తున్నాం.

కథకి రు.150 లను పారితోషికంగా అందజేస్తూ తొలి విడతగా వంద కథలను ఎన్నుకొనే ఈ పోటీలో —

రచయిత(త్రు)లూ
పాల్గొనండి!

* కథలోని ఇతివృత్తం తెలుగు వారి జీవన విధానానికి సంబంధించి ఉండాలి.
* అనువాదాలు, అనుసరణలూ స్వీకరించం.
* కథ అరఠావు సైజులో పన్నెండు పేజీలకు మించరాదు.
* రచన స్వంతమని హామీ పత్రాన్ని జత చేయాలి.
* పోటీలో గెలుపొందని కథలను సాధారణ ప్రచురణకు స్వీకరించే వీలుంది.
* విషయాలన్నిటా తుది నిర్ణయం మాదే! ఉత్తర ప్రత్యుత్తరాలకు తావులేదు.
* కథలను త్రిప్పి పంపగోరేవారు తగినంత పోస్టేజీగల స్టాంపులున్న కవరును జత చేయాలి.

గడువు తేదీ:
జూలై 15, 1984

Prisma Process Pvt. Ltd.
Publications Division
Plot 6/A, Phase 1, I.D.A.
Jeedimetla, Hyderabad - 500 856

వారఫలం

8-6-1984 శుక్రవారం మొదలు 14-6-1984 గురువారం వరకు

♈ మేషం: వ్యాపారమందు అధిక లాభాలు గడించుటకు, పదిమందినీ సంతోష పరచుటకు రాక నిలచియున్న ధనం వసూలు చేసికొనుటకు, వ్యక్తిగతంగా గౌరవ ప్రతిష్ఠలకు ఈవారం అనుకూలం. స్త్రీలకు విలువగల వస్తు సేకరణకు అవకాశము గలవారం.

♉ వృషభం: చాలకాలంగా ఎంత యత్నించినా కాని పనులు ఈవారం సులభంగా నెరవేర గలవు. అధికారుల మూలంగా ఏదో మేలు జరుగనున్నదని గ్రహించాలి. వస్తు సేకరణకు అనుకూలమైన వారం. స్త్రీలకు: ఉన్నత విద్యాభ్యాసానికి, ఉద్యోగ మందు అభివృద్ధికి అనుకూలం.

♊ మిథునం: వ్యవహారం ఏదయినా అపరిష్కృతంగా ఉంటే సానుకూలం కాగలదు. కార్ఖానా మూలంగా లాభం గడించుటకు అవకాశమున్నది. క్రమంగా పనులు సాధింపబడ గలవని గ్రహింప గలుగుదురు. ప్రయాణ మూలాన కార్యసిద్ధికి అవకాశ మున్నది. స్త్రీలకు: ధన లబ్ధి, వస్తు సేకరణ, శుభ కార్య ప్రస్తావనలకు అవకాశం గల వారం.

♋ కర్కాటకం: అపవాదులు తప్పవనీ, క్రయ విక్రయములందు యిబ్బందులుండ గలవనీ, కాని వారి సంఖ్య అధికం కాగలదనీ వేరే చెప్పనవసరం లేదు. గ్రహానుకూలత బహు తక్కువయిన వారం. రాజకీయంగా ఒత్తిడులు, యిబ్బందులు ఉండ గలవు. స్త్రీలకు: ఆదాయం, కార్యములందు అనుకూలత సంభవం.

♌ సింహం: అన్ని విధాలా యోగ ప్రదమైన వారం. అవసరాలకు కావలసినంత ద్రవ్యం అంది తీరుతుంది. అప్పులు కూడా వసూలగుట గమనింతురు. లావాదేవీలలో జాగరూకత వహించటం చెప్పదగిన అంశం. క్రితం చాల కాలం రావలసిన డబ్బు అందక యిబ్బంది పడిన మాట వాస్తవం. ఇక అట్టి యిబ్బందులకు అవకాశం లేదు. స్త్రీలకు: ఉద్యోగమందు అభివృద్ధి, నూతన గృహానుకూల్యత గలవారం.

♍ కన్య: సుఖ శాంతులున్నవి. అన్ని రంగాలలో అనుకూలత గలదు. విలువగల వస్తు సేకరణకు అవకాశమున్నది. 'శని' గ్రహానుకూలత వలన అన్ని విధాలా మేలు జరుగనున్నది. స్త్రీలకు: సుఖ సంపదలు, ధనలబ్ధి, చేసే ఉద్యోగ మందు అభివృద్ధి చేకూరుటకు సర్వ విధాలా అవకాశం గల వారం, గ్రహించాలి.

♎ తుల: ఏపని చేపట్టినా చిత్త శుద్ధితో చేయాలని గ్రహించాలి. మంచి పట్టుదల అవసరం. మీకు గల వ్యవహార జ్ఞానం రాణింపునకు రా గలదు. ఏమయినా స్తోత్ర ప్రియులను దాపునకు రానీయకండి. స్త్రీలకు: ధనాదాయం, ఆస్తి పెంపకానికి అవకాశం.

♏ వృశ్చికం: ధనాదాయమున్నది. పెద్దల వలన ధనవంతుల వలన పేరు ప్రతిష్ఠలు, సాహాయ్యము పొంద మన్నారు. చిరకాలంగా మిగిలియున్న మీ ఆశలు పూర్తిగావింపబడును, గ్రహించి మెలగాలి. విద్యా విధాన మందు పెంపు కనిపించుటయు గమనింపదగిన అంశములు. స్త్రీలకు: ధన లబ్ధికి గౌరవాభివృద్ధికి అవకాశమున్నది.

♐ ధనుస్సు: ఒకానొక విషయం, ఆశించినంత కన్న అధికంగా మీకు అనుకూలం కాగలదు. విరోధి వర్గం తల వంచటం గమనింప గలుగుతారు. ఉన్నత విద్యకు వలసిన సదుపాయములు ఏర్పడ గలవు. మిత్ర వర్గీయుల సహాయం చేకూరుటయు గమనింపదగిన అంశం. స్త్రీలకు: గౌరవార్హమైన పదవులు లభ్యం కాగలవు.

♑ మకరం: నూతనాంశాలు గ్రహిస్తారు. విలువైన వస్తువులు సేకరించుకో గలుగుతారు. సభా గౌరవం చేకూరే అవకాశమున్నది. దూర ప్రాంతాలకు కూడా ప్రయాణించు అవకాశములున్నవి. వ్యాపార మందు ఈవారం మెరుగు కనిపిస్తుంది. స్త్రీలకు: విదేశ పర్యటనకు కొందరకు అవకాశం గల వారం.

♒ కుంభం: ఆరోగ్య మందు అభివృద్ధి చేకూరుతుంది. అవసరాలకు తగినంత ద్రవ్యం చేతికి అందటం గమనించ గలరు. ఒకానొక వ్యవహారం సులభంగా పరిష్కరింప బడ గలదు. దైవ కార్య నిర్వహణమునకు అవకాశం గలవారం. స్త్రీలకు: వస్తు సేకరణకు గ్రామమున, రాజకీయ రంగాన అభివృద్ధి గలదు.

♓ మీనం: అధికారుల వలన గాని, ప్రభుత్వ వలన గాని, ధనికుల వలన గాని జరుగ వలసిన పనులు సుకరంగా నెరవేరగలవు. ధనాదాయమున్నది. వ్యాపార మందు మేలు కనిపించుటయు గమనించ గలుగుతారు. స్త్రీలకు: శుభ కార్యాచరణముతో, విలువ గల వస్తు సేకరణతో, గృహ కార్యాచరణముతో వారం గడచి పోవటం గమనించ గలుగుతారు.

— విద్వాన్ కోట సత్యరంగయ్య శాస్త్రి

వ్యక్తిగతం



తండ్రి జగత్ నారాయణ్ లాగే రమేష్‌చంద్రచోప్రా కూడా అకాలీ తీవ్రవాదుల తుపాకి గుళ్లకి బలి అయిన హింద్ సమాచార్ పత్రిక సంపాదకుడు. ఈయన హత్య అయిన తరువాత పోలీసువారు శవాన్ని స్మశానానికి ఊరేగించి తీసుకుపోవటానికి కూడా అనుమతి ఇవ్వక పోవటంతో రమేష్‌చంద్రని హింద్ సమాచార్ కార్యాలయం ఆవరణలోనే దహనం చేశారు. రమేష్ చంద్ర ఎప్పుడూ తెల్లని ఖద్దరు లాల్చీ, పయిజామా ధరించేవారు. నిరాడంబరులు, నిర్భయులు...



ఆల్బర్టో సాలజార్ క్యూబాలో పుట్టాడు. తరువాత అమెరికా సంయుక్త రాష్ట్రాలకి మారిపోయాడు. ఆ దేశంలో అతను మంచి వేగంగా పరిగెత్తే క్రీడాకారుడుగా పేరు పొందాడు. ఒకసారి అతనికి పరిగెత్తుతూ ఉంటే 108 డిగ్రీల జ్వరం వచ్చిందిట. ఇంకొకసారి దేహం వేడి 88 డిగ్రీలకి పడిపోయిందిట. క్రమంగా ఆరోగ్యం చెడిపోయి సాలజార్ క్రయిస్తవ మతంమీద విశ్వాసం పెంచుకున్నాడు. ఇప్పుడు అతను ఇనుము ఎక్కువగా ఉండే మందులు కూడా తిని చూస్తున్నాడుట. ఏప్రిల్ నెలలో సాలజార్ 10,000 మీటరుల రేసు 27 నిముషాల 56 సెకండులలో పూర్తి చెయ్యగలిగాడు. మూడవ స్థానం లభించింది అతనికి...



కర్నాటక రాష్ట్రంలో పోలీసులకి ఆచూకి దొరకని 6 హత్యలు, 5 కారు దొంగతనాలు, రెండు దోపిడీలు చేసిన ఐదుగురు వ్యక్తుల ముఠా నాయకుడు రవీంద్రప్రసాద్ (25) స్కూల్ ఫైనల్‌లో ప్రథముడిగా వచ్చాడు. ఆటో మొబైల్ ఇంజనీరింగ్ డిప్లొమా చదివాడు. ఇతని ప్రతిభ, తెలివి పెడదార్లు తొక్కాయి. తేలిగ్గా, త్వరగా డబ్బు సంపాదనకి మార్గాలని అన్వేషించాడు. తనని ప్రేమించి వెంట వచ్చిన యువతిని దారుణంగా చంపి ఆమె నగలని అపహరించాడు. కార్లని అద్దెకి తీసుకుని వాటి డ్రైవర్లని మధ్యదార్లో హత్యచేసి లోయల్లో పారేసి టాక్సీలని నెంబరు ప్లేట్లని మార్చి మరోచోట అమ్మేవాడు. అతని స్నేహితురాలొకామె అందించిన సమాచారాన్నిబట్టి పోలీసులు మొత్తం ముఠాని మైసూరులో అరెస్టు చేశారు. అసలు తన ధ్యేయం బాంక్ దోపిడీ అనీ అది నెరవేరితే స్విట్జర్‌లాండ్ వెళ్లి నెంబరు మాత్రమే ఉండే ఖాతాని తెరిచి యూరోప్‌లో స్థిర పడదామనుకున్నానని అతను పోలీసులకి చెప్పాడు!...

నీరు వేడిచెయ్యవలసిన అవసరం లేదు, సీసాని మరగబెట్టవలసిన శ్రమ లేదు, వేడిగా చల్లగా ఉందేమోననే బాదరబందీ లేదు!



ప్రకృతి యుగయుగాల నుంచి సహజమైన స్వాభావికమైన తీరులో అప్పుడే పుట్టిన పాప యొక్క పోషణ నెలా చేస్తూ పోతోందో మరి!

ప్రకృతి, వేలకి వేల లక్షల ఏళ్ళబట్టీ ప్రయోగాల వెంట ప్రయోగాలు చేస్తూ చేస్తూ చివరికి శరీర నిర్మాణంకోసం ప్రోటీన్లు, శక్తినిచ్చే కార్బోహైడ్రేట్లూ, క్రొవ్వు పదార్థాలూ, ఆరోగ్యాన్ని కాపాడే విటమిన్లూ వీటి యొక్క సరియైన సంతులితమైన దాన్ని తయారుచేసింది. అందుకే తల్లిపాలు పాపకొక ఆదర్శ ఆహారం అయింది.

కలుషితం అయ్యే ప్రమాదం లేదు

మీ పాప స్తన్యపానం చేసినప్పుడు, అవి ఏ రకంగానూ కలుషితం అయ్యే ప్రమాదమిక ఉండదు, ఎందుకంటే దాన్లో కలుషితమవడం గాని, సీసాని శుభ్రం చేయవలసి రావడంగాని, ఉష్ణోగ్రతని చూడవలసి రావడం గాని చేసే ప్రశ్నే లేదు గనక. తల్లి పాలంటారా అవి అమృత తుల్యమైనవి!

అంతేగాకుండా ప్రకృతి దాన్లో "రోగ నిరోధక ద్రవ్యాలను" గూడా ప్రసాదించింది. దాంతో మీ పాప ఆమ్లాశయం, పేగుల్లోని వ్యాధులు, యితర వ్యాధుల నుంచి రక్షణ కలుగుతుంది. మరి తల్లి పాలలో యింకా ఎన్నెన్నో ఉన్నాయి—స్కర్వీ వ్యాధిని నిరోధించే విటమిన్ సీ ఉంది.

ప్రపంచమంతా ప్రచలితం

ఇప్పుడు రోజుకి రోజూ, ప్రపంచమంతటా ఎక్కువ మంది తల్లులు, అంటే పశ్చిమ దేశాల్లో సహితం, తల్లులు తమ పాలే యివ్వడం మొదలెట్టారు. ఎందుకంటే, తల్లి పాలలోని పోషణ తత్వాల మహత్తర లక్షణాల్ని మళ్ళా వాళ్ళు అవగాహన చేసుకోవడం మొదలెట్టారు.

తప్పకపోతే

మరి మీరేగనక యిక ఏ కారణం వల్లనైనా తప్పకపోతే, మీ పాపకు మీ పాలు యివ్వలేకపోతే—అంటే మీ ఆరోగ్యం సరిగా లేకనో, లేదా మీలో, సరిపడినన్ని పాలు పడకో, అలా జరిగినప్పుడేం చెయ్యాలి మీరు? అటువంటి సందర్భంలో మీరు ఎంతో ఆలోచించిన మీదట. ఎటువంటి ఎటువంటి ఆహారం యివ్వాలంటే, ఆ యిచ్చేది తల్లి పాల తర్వాత అన్నింటికన్న ఉత్తమమైనదిగా ఎంచుకునేదాన్ని.

స్ప్రే డ్రయిడ్ అమూల్ స్ప్రే

అమూల్‌స్ప్రే, పుష్టినిచ్చే దృష్టితో చూస్తే మహత్తరంగా సంతులితమైన ఆహారం. ఎందుకంటే వీన్లో చాలా ఎక్కువైన తీరులో ప్రోటీన్లు, దాంతోబాటే, తేలికగా అరగగలిగే కార్బోహైడ్రేట్లు, సరియైన సంతులిత రూపంలో అత్యావశ్యమైన విటమిన్లూ, ఖనిజ పదార్థాలు ఉన్నాయి. ఇది అంతకు ముందే మరగబెట్టిన నీటిలో టక్కున కరిగిపోతుంది. మొదటిగానే పేస్ట్‌లా తయారు చేయవలసిన అవసరం ఉండదు.

పొదుపు

అమూల్‌స్ప్రే. డబ్బాలలో దొరికే శిశుఆహారాన్నిటికన్న పొదుపైనది. ఎందుకంటే యిది ఆధునికమైన పాల సంఘం యొక్క ఉత్పాదన—"శ్వేత విప్లవం" తీసుకురావడంలో అందరికన్న ముందడుగు వేసారు.

జాగ్రత్త పడటం

పాప ఆహారానికి ఉపయోగించే అన్ని వస్తువుల్నీ, సీసానీ, ఎప్పుడూ ఆరోగ్యకరీత్యా బాగా శుభ్రంగా కడిగి నీటిలో మరగబెట్టాలి. పాప ఆహారాన్ని తయారు చేయడానికి కూడా మరిగిన నీటినే వాడండి. పాప సరియైన పోషణకోసం, డబ్బాపైన యివ్వబడిన అమూల్‌స్ప్రే మోతాదుల ప్రకారమే ఖచ్చితంగా పాప ఆహారాన్ని తయారు చెయ్యండి.

ఉచితం! అమూల్ బేబీ పుస్తకంలో

ఉపయోగకరమైన విషయాలు యీ అధ్యాయాల్లో ఉన్నాయి. అవి గర్భధారణ, ప్రసవానికి ముందర జాగ్రత్త, ప్రసవము, తల్లిపాలు, ఇతర ఆహారములు, మిశ్రమ ఆహారమును అలవాటు చేయుట, పిల్లవాని దినచర్య, పిల్లవాని అభివృద్ధి, పళ్ళను అరికట్టుట, ప్రథమ చికిత్స, సాధారణ రోగములు, జబ్బుతోనున్న పిల్లవాని సంరక్షణ, జ్ఞాపకముంచుకోవలసిన విషయములు. ఈ పుస్తకం తెలుగు, ఇంగ్లీషు, హిందీ, తమిళం, మలయాళం, మరాఠీ, గుజరాతీ, బెంగాలీ భాషల్లో దొరుకుతుంది. దానికోసం పోస్ట్ బాక్స్ 10124, బొంబాయి 400 001 అడ్రసుకు మీ పేరూ, పూర్తి అడ్రసు యిస్తూ రూ. 1.25 స్టాంపుల్ని పంపండి.



అమూల్‌స్ప్రే


తల్లిపాల తరవాతనే ఇది

అమ్మకం చేయించువారు:
గుజరాత్ కో-ఆపరేటివ్ మిల్క్ మార్కెటింగ్ ఫెడరేషన్ లిమిటెడ్, పోస్ట్ బాక్స్ 10, ఆనంద్ 388 001, గుజరాత్.

ASP/AS-TEL6/83

అచ్చిరాని చదువులు

శ్రీరంగం నారాయణబాబు



మా తండ్రి చిన్నప్పుడే చనిపోయాడు. ఆయన బాగా ఆస్తి ఆర్జించిపెట్టాడు. కాని లాభం ఏముంది? బ్రతికిఉన్న రోజుల్లో ఉన్నదంతా కానివాళ్లకు అప్పు సప్పుల క్రింద ఇచ్చివేశాడు. కొన్ని భూములేవో తగాదాలున్న భూములు కొన్నాడు. ఆయన అంత్యకాలానికే మా ఆస్తికి చెందిన వ్యవహారాలన్నీ ఒక ముళ్ల డొంకలా తయారయింది. నేను చిన్న వయస్సులో ఉన్నానని, నాకు వ్యవహారజ్ఞానం తక్కువ అనీ, మాకు దూరవు బంధువు వకాల్తీలో మంచి పేరు సంపాదించుకున్న రఘునాథరావుగారికి, వ్యవహారాలన్నీ వప్పచెప్పి, నాకు గార్డియనుగా నియమించి, తాను దిగవంతుడయ్యాడు. ఆ రోజుల్లో నాకు గార్డియన్ అయిన రఘునాథ రావుగారు ఈనాడు నాకు పిల్లనిచ్చిన మామగారు.

నేను పెద్దవాణ్ణయినా, నా వ్యవహారాలు నేను చూడకుండా మా మామగారి చేతుల్లోనే ఉంచేశా! అందుకు కారణం, నాకు వయస్సు వచ్చేసరికి, దేశంలో స్వతంత్రోద్యమం ప్రారంభ మయింది. గాంధీమహాత్ముని సారధిత్వమున ఆపహాయోద్యమం ప్రారంభించమని, భారత



జనసభ పాంచజన్యాన్ని పూరించింది. ఆ రోజుల్లో చదువుకు స్వస్తి చెప్పి, అసహాయోద్యమ వాహినీ జలంలో నేను కూడా ఒక నీటి బిందువునై పయనించి ప్రవహించాను. మా మామగారైన రఘునాధరావుగారికి ఇద్దరు కుమార్తెలు. అందులో చిన్నామెను నాకిచ్చి వివాహం చేశాడు. ఆ రోజుల్లో వారి పెద్దమ్మాయి గురించి అపయశస్సు ఆపాదించే కట్టుకథలూ, పుక్కిటి పురాణాలు కొన్ని ఉన్నాయి. ఏది ఎలా ఉన్నా ఆ రోజుల్లో పెద్ద చదువు చదివి, ఎం. బి. బి. ఎస్. పాసయ్యి, మదరాసు మెడికల్ కాలేజీలో బోధించే ఉపాధ్యాయినిగా నియమించబడి, ఉద్యోగంలో చేరిన రోజునే అకారణంగా మరణించిందని, మా మామగారు అందరితో చెప్పే పాఠాంతరం. అందుకే నాకు కూతురు పుట్టినప్పుడు చిన్న వయస్సులోనే నోట మన్నుకొట్టుకు పోయిందని, గొప్ప విద్యావంతురాలు విదుషీమణి అని, అంతే కాకుండా నాకు కలిగిన పిల్ల మూడు మూర్తులా వాళ్ల అక్కగారినే పోలిందని, నా భార్య పట్టు పట్టి నా కూతురికి పేరు వాళ్ల అక్కగారి పేరే పెట్టాలని, సత్యవతి అని పేరు పెట్టించిరి. వాళ్ల అక్కగారు అన్య ప్రదేశంలో చదువుకొని ఉండిపోవడం నుంచి, నాకు ఆమెతో అట్టే పరిచయం లేదు. ఆవిడ శలవులకు వచ్చినప్పుడు ఒకటి, రెండుమార్లు చూడ్డం, మాట్లాడ్డం సంభవించింది. ఆవిడ చాలా అందమైనది. ఆమె కళ్లు అసాధారణ ప్రతిభతో వెలిగేవి. ఆ కళ్లల్లో అందరికంటే ఇతరుల ప్రక్క చూచినప్పుడు, వారి వారి హృదయాల్లో ఉండే భావాలను అవలీలగా గ్రహించ గలిగే ఎక్స్‌రే కెమెరా, అద్దాల నల్లదనంతో తళతళ లాడేవి.

"చచ్చినవాళ్ల కళ్లు చారెడేసి" అని అనే అతిశయోక్తి మా వదినగార్కి, స్వభావోక్తిగా వర్తిస్తుంది. మా మామగారు కూడా మాకు పిల్ల పుట్టిన ఆ రోజుల్లో మీ అమ్మాయి, మా పెద్దమ్మాయినే పోలింది, అని రోషపూరితమైన ముఖంతో అనేవాడు కాని, ఆర్ద్రంగా, కన్నీటితో గానీ, గాద్గదికతోగానీ, అనలేక పోయేవాడు. నా భార్య ఎప్పుడైనా వాళ్ల అక్కను తలచుకొని, కన్నీరు మున్నీరుగా ఏడ్చినప్పుడు అనునయించే టప్పుడు కూడా "మనం ఏడ్చేందుకు అది అర్హురాలు కాదు. అందుచేత విలపించకు" అని అనేవాడు. చిన్నప్పుడే తల్లి చనిపోయి ఇద్దరాడ పిల్లలకు తల్లి, తండ్రి తానే అయి, సాకిన తండ్రి, శిలాహృదయంతో కాఠిన్యం వహించేందుకు కారణం ఏమై ఉంటుందా అని నేను తికమక పడేవాణ్ణి. ఏది ఎలాఉన్నా నా భార్య శీలవతి, అనురాగవతి, సుమతి.

నా కూతురుకిప్పుడు పదహారేళ్ల వయస్సు. ఇంటర్మీడియేట్ ప్యాసయింది. విశ్వవిద్యాలయాని కంతటికి కూడా ఉత్తమంగా ఉత్తీర్ణురాలయింది.

మా అమ్మాయికి వచ్చినన్ని మార్కులు

అచ్చిరాని చదువులు

విశ్వ విద్యాలయ చరిత్రలోనే ఒక నూతన పుటను తెరిచిందని అన్నారు. నేటికి కూడా నా సేవ చేశాకే నా బిడ్డకైనా నా భార్య సేవ చేస్తుంది. నా గృహస్థ జీవితం ధన్యమైంది. మా అభిమానం చెరుకున పండు పండినట్లయింది. దేశం కోసం నేనెంతో త్యాగాన్ని చేశాను. స్వతంత్రం వచ్చాక నాకే సహాయం చేస్తానన్నా ప్రభుత్వం నాకు నేను నిరాకరించాను. కన్నతల్లికే సేవ చేసిన, పుట్టిన దేశానికి సేవ చేసినా పుణ్యంగా పరిగణిస్తాము. కన్నందుకు మన ఋణం మనం తీర్చుకునేందుకు చేస్తాం.

ఆ సేవకు మూల్యం కట్టి పరిగ్రహించిన వారంతా పాపాత్ములే ననిపిస్తుంది. ప్రజాసేవ చేసేందుకు దరిద్రంచేసి అనేక రోగాలతో అలమటిస్తున్న నా దేశప్రజలకు, వైద్యంచేసి వన్నె కెక్కాలి అనే తలంపుతో మా అమ్మాయిని కూడా ఎం. బి. బి. ఎస్. చదివిద్దామని సంకల్పం కలిగింది. మా మామగారి పేర కూడా నా సంకల్పాన్ని తెలియచేస్తూ ఒక ఉత్తరం వ్రాశాను. మా మామగారు వయోవృద్ధులయినా దారుఢ్యాని కేమీ లోటులేదు. కొంతకాలం నుంచి కొద్దిగా ఆయన ఆరోగ్యం పాడవడంవల్ల తానున్న వూరువదిలి పరాయి ఊళ్ళు వెళ్ళడం మానేశాడు. అయినా ఉత్తరం అందేక తాను వెంటనే బయలుదేరి వస్తున్నాననీ, తాను వచ్చే లోపల అమ్మాయి చదువు విషయంలో తొందర పడి ఏ నిర్ణయానికీ రావద్దనీ వ్రాశాడు.

ఈఉత్తరం నాకు కొంత ఆశ్చర్యాన్ని కలిగించింది. ఏదైనా ఆయన వచ్చాక, సంప్రతించాకే, అమ్మాయి చదువువిషయంలో కావలసినఏర్పాట్లు


డిగ్రీలపై మోజు !

పారిశ్రామికంగా ప్రగతి పథంలో పయనిస్తున్న పశ్చిమ జర్మనీలో పాత తరహా విద్యా డిగ్రీల పట్ల మరల మోజు పెరుగుతున్నది. జర్మను విశ్వవిద్యాలయాల విద్యా విధానంలో డాక్టర్ డిగ్రీలు, 'మాస్టర్ ఆఫ్ ఆర్ట్సు' డిగ్రీలు అతి ప్రాచీనమైనవి. గత 20 సంవత్సరాలలో ఎం. ఎ. పట్టభద్రుల సంఖ్య 20 రెట్లు పెరిగింది. 1964లో మ్యూనిచ్ విశ్వవిద్యాలయం నుండి ఎం. ఎ. డిగ్రీలు పుచ్చుకున్నవారు 548 మంది కాగా, 1983లో 3489 మంది ఎం.ఎ. డిగ్రీలు పుచ్చుకున్నారు. అయితే ఎం. ఎ. డిగ్రీ పుచ్చుకున్నవారికి భవిష్యత్తు ఆశాజనకంగా లేదని పత్రికేయులు, ఉపాధ్యాయులు అంటున్నారు.

చేద్దామనుకొన్నాను. అన్నరీతిని ఆయన విశ్రాంతి తీసుకొంటున్న వూరునుండి బయలుదేరి మా యింటికి వచ్చారు. రాకరాక వచ్చిన తండ్రిని చూచి మా ఆవిడ మిస్సందుకొంది. తండ్రిని చూచి కంట తడి పెట్టుకొంది. మేమంతా భోజనాలు చేశాము. మా అమ్మాయి ఆరోజు తనతో చదువుకొన్న కొంతమంది విద్యార్థినులతో కూడి, వనభోజనం చేసికొనేందుకు వెళ్ళిపోయింది. నా భార్యకూడా ఇంట్లో ఉండడం ఇష్టంలేక, వాళ్ల తండ్రి బజారుకు వెళ్ళి మంచి చీరలు ఎంచుకో మన్నాడు తనకీ. మనుమరాలికీ. రాకరాక వచ్చాను కాబట్టి మంచి బట్టలు నీకు, మనుమరాలికి కొని యిద్దామని వచ్చాను అన్నాడు. అమ్మాయి ఇంట్లో లేదని, అమ్మాయి వచ్చాక వెళతామని నా భార్య అంది. అమ్మాయి లేకపోయినా, నా భార్యను వెళ్ళి మంచి చీరలు ఎంచమని అన్నాడు. ఆడువారికి చీరలన్నా, నగలన్నా అంబుధిలా పొంగిపోతారు సంతోషంతో. అందుచేత మా ఆవిడ వాయువేగ మనోవేగాలతో పరుగెత్తింది, కాఫీలవేళకు వచ్చేస్తానని కేక వేస్తూ రిక్షా ఎక్కింది.

ఇంట్లో మా మామగారు నేనే ఉన్నాము. హాలులో మే మిద్దరం రెండు కుర్చీలలో ఒకరి కెదురుగా ఒకరు కూర్చున్నాము. మా మామగారు మవునంగా కొంతసేపు ఆలోచించి నా ముఖం వంక దీనంగా చూస్తూ జాలిగా బిక్క ముఖం వేసి కన్నీటి చుక్కలు కారుస్తూ "మన ఇంటి ఆడపిల్లలకు డాక్టరు చదువు అచ్చిరాదు బాబూ!" అన్నాడు; నాకు నలభై ఐదు ఏళ్ళు వచ్చాయి వంటిమీదకు. నాకు వివాహమై పాతిక ఏళ్ళయింది. మా తండ్రి చనిపోయాక నన్ను ఆదుకొని నా వ్యవహారపుచిక్కులు తీర్చి పిల్లనిచ్చి పెద్దవాణ్ణి చేశాడు. ఈ నా వయస్సంతటిలో కొంపలు మునిగే వ్యవహారపు చిక్కులు వచ్చినా, సంసారంలో హృదయవిదారకమైన సంఘటనలు సంభవించి నప్పుడైనా, మామామయ్య కంటతడి పెట్టడం నే చూడలేదు. అందుచేత ఆయనకంటి నీరు నా హృదయంమీద అశనిపాతంలా పడింది. కొంతసేపు అయితేనే గాని నేతెప్పరిల్లి తేరుకోలేక పోయాను. కొంతసేపయ్యాక కాస్త ధైర్యం చిక్కపట్టుకొని మెల్లగా 'ఇల్లూ, పశువూ, నగా నాణెం, నామం, అచ్చిరావడంలో అర్థంవుందిగాని చదువు అచ్చిరాదనడంలో ఎంత ఆలోచించినా నాకు అర్థంకావడం లేదు' ఎంతో వినయ విధేయతలతో అన్నాను.

అందు కాయన 'నిజమే తండ్రీ! నీకు అర్థం కాదు. నేనూ ఒకప్పుడు అర్థంలేని మాటలని, అభ్యుదయ మార్గంలో నడుద్దామనీ ప్రయత్నం చేసినవాడినే. కాని అనుభవాన్ని బట్టి కొన్ని విషయాలు నీతో చెప్పదలుచుకొన్నాను. ఇప్పటి వరకూ ఈ విషయం నేను ఎవరితోనూ అన లేదు. నా ప్రాణంకంటె ఎక్కువ. ఒకే ఒక కూతురు మిగిలింది. దానితో కూడా ఈ విషయం నే నెప్పుడూ అనలేదు. అందుకు కారణం కుల



శీలాలకూ, వంశమర్యాదల కోసం ఏ అబద్ధాన్ని సృష్టించి లోకంలో ప్రచారం చేశానో, అదే అబద్ధాన్ని నీ భార్యకు కూడా చెప్పాను. అధర్మము అని నాకు తెలుసు. ఎందుచేతనంటే ఒక్కే కడుపు చీల్చుకు వచ్చిన ఇద్దరిలో పెద్దదైన తన అక్క విషయం తనకు చెప్పకుండా ఉండడం పాపమే. ఆ పాపాన్నికూడా ఒడికట్టుకొన్నాను కాని యదార్థాన్ని ఆమెకు తెలియనివ్వలేదు. ఆ విషయాన్ని నాహృదయంలో ఇనుపపెట్టెలో పెట్టిన వస్తువులా దుర్భేద్యంగా దాచాను. ఇప్పుడు తాళాలు నీ చేతికి ఇస్తున్నాను. శిక్షించినా, రక్షించినా, నాకన్నా చిన్నవాడవే అయిన నిన్నే నమ్ముతున్నాను అని ఇక చెబుతాను విను. నేనీ విషయం చెప్పేనంతసేపూ అడ్డు రాకూడదు. ప్రశ్నలు వేయకూడదు. ఒక అనుభూతి సంభవించినప్పుడు, అది కూడా ఒక ఉత్తుంగ భంగం లాంటి అనుభూతి అయితే మానవ హృదయం ఎలా ప్రవర్తిస్తుంది? అనే ప్రశ్న ఎంత హృదయ తత్వవేత్త అయినా చెప్పలేడు. కాస్త సావధానంగా విని సానుభూతిని చూపించి, మౌనాన్ని వహించి గాలిలో పొగ కలిసిపోయినట్లుగా నీ మనస్సులోనే మరపు మసకలతో చెదిరిపోనీ. ఈ విషయం విను.

నేను చాలా బీద కుటుంబానికి చెందిన వాడను. నాకు తల్లిదండ్రులు చాల చిన్నతనం లోనే పోయారు. నేను ఇంటింటా వారాలు చేసుకొని వీధిలో వెలిగే దీపాలవద్ద చదువుకొని భగవంతుడు బుద్ధి ప్రసాదించాడు కాబట్టి, ప్రతి పరీక్షలో ఉత్తమంగా ఉత్తీర్ణుడనై ఆ రోజుల్లో కూడా ఉచిత వేతనా లిచ్చేవారు గాబట్టి, దమ్మిడీ ఖర్చు పెట్టకుండా చాలాకాలం చదివాను. పెద్ద చదువులు చదివేందుకు కొంతైనా ధనం ఉంటేనే కాని వీలులేక పోవడంవల్ల కాస్త కలిగినకుటుంబం లోంచి అమ్మాయిని పెండ్లి చేసుకున్నాను. వారు చేసిన ధనసహాయంతో పెద్ద పెద్ద పరీక్షలు ప్యాసవడమే కాకుండా చెన్నపట్నం వెళ్లి ప్లీడరు పరీక్ష ప్యాసయి వకాల్తా చేసి రెండు చేతులా ఆర్జించాను న్యాయవాద వృత్తిలో.

సంపాదించిన పేరు విని ప్రభుత్వంవారు మునసబు పని యిస్తానంటే గర్వంగా వద్దన్నాను. నా భార్య కాపురానికి వచ్చిన కొంతకాలం వరకు నాకు సంతానం కలుగలేదు. నా భార్య ఎన్నో నోములూ, వ్రతాలూ చేయగా ఆమె కడుపు ఫలించింది. మగవాడు పుట్టాలని నా భార్య ఎందరి దేవుళ్లకో మ్రొక్కుకొని ఎత్తు కట్టింది. నాకు మొదటి సంతానం వరప్రసాదితయై పుట్టింది. నా సంకల్పం ఏమిటంటే ? మా సత్యవతిని మగవాని లాగే పెంచి పెద్దదాన్ని చేసి విద్యాబుద్ధులుకూడా నేర్పుదామని సంకల్పించుకొన్నాను. అందుకు నా అవ్వకూడా సాయపడి దోహదం చేసింది. మా అమ్మాయిని బడికి పంపినా, నేను శ్రద్ధగా ఇంటి వద్ద ఆమెకు చదువుచెప్పి, పరీక్షలలో అధికమైన మార్కులు సంపాదించి మగవారికంటే మిన్నగా ఉండేటట్లు చేశాను. ఆ రోజుల్లో ఆడవాళ్లకు చదువులే ఉండేవికావు. ఆడువారిచేత పెద్ద చదువులు చదివిద్దామనుకున్నవారిని కులభ్రష్టులనీ, మతభ్రష్టులనీ చూచేటట్లు చూచేవారు. ఆడువారికి ఆ రోజుల్లో పెద్ద చదువులు చదువుదామంటే ప్రత్యేకమైన కళాశాలలు ఉండేవి కావు. మగవాళ్లతో కలసే ఆడువారు చదవవలసి వచ్చేది. అందుచేత అనేకమంది ఆడువారిని పెద్ద చదువులు చదివించేందుకు భయపడేవారు. అనేకమందిచేత మాటలు తిన్నా లక్ష్యపెట్టకుండా సత్యవతిని చదివించాను. నా బిడ్డకూడా దైవభక్తి, పూజా, పునస్కారం కలదు. కాబట్టి శీలాన్ని కాపాడుకొంటూ ఇతరులు అనే అవమానకరమైన మాటలు సహిస్తూ,దించిన తల ఎత్తకుండా కళాశాలకు వెళ్లి, ప్రతి పరీక్షలోను అధికమైన మార్కులు సంపాదిస్తూ ఉపాధ్యాయుల యొక్క గౌరవాభిమానాలు పొందింది.

స్కూలుఫైనలు ప్యాసయిన తరువాత లోకం ఏమనుకున్నా సాహసించి ఇంటరు చదివించాను. ఇప్పుడు మీ అమ్మాయికి వచ్చినట్లే అప్పుడు మా అమ్మాయికి కూడా వల్లమాలిన మార్కులు వచ్చాయి. మా అమ్మాయి డాక్టరుపరీక్ష చదువుతానని పట్టుపట్టింది. అమ్మాయిని చెన్నపట్నం పంపాలి. ఎం. బి. బి. ఎస్. చదివించాలని సంకల్పించుకున్నా నాకు కొంతకాలం క్రితమే భార్య పోవడం రెండో పిల్లను నీకిచ్చి పెండ్లి చేయడం జరిగింది. అప్పుడు మన వూళ్ళో చెంద్రశేఖరయ్య గారని ఒక మునసబుగారుండేవారు. వారి అమ్మాయి కూడా చెన్నపట్నంలో ఉందనీ ఆమె కూడా ఎం.బి.బి.ఎస్. లో చేరుతుందనీ, ఆమెతో కలిసి మన అమ్మాయి కూడా ఉండవచ్చుననీ మునసబుగారు హామీ యిస్తూ పిల్ల విషయంలో భయపడ నక్కర్లేదన్నారు. వారి అమ్మాయి పేర ఉత్తరం వ్రాశారు మా అమ్మాయి గురించి.

మా అమ్మాయి చెన్నపట్నం బయలుదేరుతున్నప్పుడు, "నీవు భయపడకమ్మా. అక్కడ మాకు స్వంత ఇల్లు ఉన్నది. మా ఇంట్లో ఉండి మా అమ్మాయితో కలిసి చదువుకొందువుగాని, నేను కూడా నీ తండ్రిలాంటి వాడనే సంకోచపడ నక్కర్లేదు.' అని అమ్మాయికి ధైర్యం చెప్పారు. పంపలేక పంపలేక మనస్సు రాయిలాంటిది అయినా తల్లిలేని పిల్లను. చదువుకి ఇలా పరాయి వూరు పంపుతున్నప్పుడు తండ్రి అయిన వాడికి ప్రాణం కొట్లాడకుండా ఉంటుందా ? అమ్మాయి చెన్నపట్నం వెళ్లిపోయింది ఎం. బి. బి. ఎస్. చదువుకని. అమ్మాయి ఎం. బి. బి. ఎస్. లో జాయిన్ అయినట్లుగా ఉత్తరం వచ్చింది. ఆ రోజుల్లో డాక్టరు పరీక్షకు చదివేవాళ్ళు పోషణ క్రింద విపరీతమైన ధనాన్ని వ్యయం చేయవలసి వచ్చేది. సామాన్యసంసారులు చితికిపోవలసివచ్చేది. తొందరపడి ఆను మాచుకోకుండా డాక్టరు పరీక్షకు పంపించిన కొద్దిమంది సంసారులు కొంతకాలం చదివించి, బట్టలకయ్యే విపరీతపు ఖర్చు భరించలేక పిల్లల్ని చదువు మాన్పించినవారు కూడా కలరు. రోగి దగ్గరకు వెళ్లినప్పుడు సరియైన దుస్తులతో వెళ్లాలి. డాక్టర్ నచ్చితేకాని మందు పనిచేయదట. మందుకంటే మనిషికే ఎక్కువ ప్రాధాన్యత. ఆసుపత్రిలో ఉండే దుర్వాసన అనుభవించేందుకు అలవాటుపడని విద్యార్థులు, అత్తరువులు కూడా వాడవలసి ఉండేది.

శవపరీక్ష చేసిన చేతులతో అన్నంనోటపెట్ట బుద్ధిపుట్టదు. కాబట్టి పండ్లు, పాలు మొదలైనవి స్పూన్, ఫోర్కులతో తినడం కొందరు ఆంగ్లేయుల్లా అలవాటు చేసుకొనేవారు. పుస్తకాల పరి

రోదసివీరా రాకేష్!

ఓ వ్యోమ విజేతా !
అశోకచక్ర గ్రహీతా !

చవిచూసావు గగనపు అంచులను
ఛేదించావు అంతరిక్ష రహస్యాలను
స్పృశించావు వింత వింత లోహాలను
కలిగించావు అద్భుత అనుభూతులను

ఎగరేశావు రోదసిలో భారత జండా
నింపావు గర్వాన్ని మా గుండెలనిండా

విశ్వమానవ సౌభ్రాతృత్వం మన మతం
ప్రపంచ దేశ మైత్రి మనకు సమ్మతం

నీ మార్గం, కావాలిక మాకు ఆదర్శం
రకేష్ ! నా కృతజ్ఞతలివి అందుకో

నీ వెంట విజయాన్ని తెచ్చినందుకు
గత అనుభవాల్ని పాఠాలుగా సాగాలి ముందుకు.

— జి. వెంకటేశ్వర్లు

మాణం ఖరీదు తలుచుకుంటే ఎంతటివానికైనా తల తిరిగిపోక తప్పదు. చదువుతున్న ప్రతి ఒక్కరికి కోసి, అవయవాలు తెలుసుకునేందుకు, ఒక్కొక్క మృతశరీరం ఇయ్యగలిగే సమర్థత యుద్ధపు రోజుల్లో తప్ప, సామాన్య రోజుల్లో సాధ్యంకాని పని. అందుచేత చదువుకొనే విద్యార్థులు, జట్లు జట్లుగా కూడి ఒకే మృత శరీరాన్ని పరీక్ష చేయవలసి వచ్చేది. మానవ శరీరానికి ఒక రకమైన గోప్యత, రహస్యత, పవిత్రత ఆపాదించారు. కొంచెం వెగటుగాతోస్తాయి ఇటువంటి చదువులు. నేనిలా అంటున్నానని స్త్రీలు, వైద్య విద్య నేర్చుకునేందుకుగాని వ్యతిరేకినని అనుకోకు. అభ్యుదయాన్నే ఆశిస్తారు. స్త్రీలకు స్వాతంత్ర్యం ఇవ్వాలి ! అనే నినాదం నేనూ చేస్తాను. పంజరంలో చిల ల్లా అనాదినుంచి, ఆడుదాన్ని అస్వతంత్రురాలుగా చేసి, బానిసగా వాడి, పంజరం తలుపులు విప్పాం, స్వేచ్ఛగా తిరగండి! మీకిచ్చిన స్వతంత్రాన్ని, వాడుకోండి. అనిమగువలను మనం హెచ్చరిస్తున్నా, ఇచ్చిన స్వతంత్రాన్ని ఎలా వాడుకోవాలో తెలియక దుర్వినియోగం చేస్తున్నారు ఎక్కువమంది స్త్రీలు. స్వతంత్ర మిచ్చాక మగువలు, స్వతంత్రం వచ్చాక దేశం కూడా ఇచ్చిన దాన్ని దుర్వినియోగం చేస్తున్నారు.దుర్వినియోగం చేసే స్వతంత్రం కంటే బానిసత్వమే మేలన్నారు: ఆనాటి పరిస్థితులు నీకు తెలిసేందుకని వయస్సు మళ్లినవాణ్ణి కాబట్టి, అనుభవించే మానవస్వభావాన్ని తెలుసుకొన్నవాణ్ణి కాబట్టి నీకు హితోపదేశం చేయడానికి చెబుతున్నానుగాని వాగాడంబరం

అచ్చిరాని చదువులు

కోసం కాదు. ప్రస్తుతానికి వస్తున్నాం. అందుచేత నీకు చెప్పవచ్చేదేమంటే ? మా అమ్మాయి చదువుకొన్నంతకాలం అధికమైన డబ్బు పంపవలసి వచ్చేది. కలిగినవాణ్ణి అయినా డబ్బుపంపేందుకు కించపడేవాడిని. అమ్మాయి ప్రతిపరీక్షలో కూడా శ్లాఘింపబడే మార్కులు తెచ్చుకొని బంగారు పతకాలు పొంది భవిష్యత్తు మహోత్కృష్టంగా ఉంటుందనే ప్రబలమైన ఆశ నాలోనూ, ఆమెనుతెలిసినవారి హృదయాల్లోనూ కలుగజేసింది. జీవితం ఒకలా ఉంటే ఫలం మరోలా ఉండవచ్చు. జీవితానికీ, జీవిత పరిణామానికి సమన్వయం నికరంగా చెప్పగలగిడ మనేది హాస్యాస్పదం అవుతుంది. లోకాన్ని, సంఘానితో పాటు బంధువులనూ లెక్కచేయకుండా ఉన్నతాశయంతో నేను చేసిన ఈ పనికి నాకు భగవంతుడు శిక్ష విధించి ఆజన్మాంతం అనుభవించమన్నాడు. నేనే కర్తనని అనుకోవడం నుంచి నాకీ హృదయ వేదన. కర్తను నేను కాను, వాక్తను నేను కాను అని అనుకోగలిగితే, కష్టము ఉండదు. కష్టం ఎప్పుడు లేదో సుఖం అప్పుడే లేదు. తటస్థుడై ఉండడం జ్ఞాని చేయగలిగిన పని. నా కసాధ్యం.

అమ్మాయి మదరాసులో చదువుతున్న రోజుల్లో వారానికో ఉత్తరం వ్రాసేది. తన చదువు గురించి, తనను ఉపాధ్యాయుడు ఎంతో మెచ్చుకొన్నారని ప్రతి పరీక్షలోనూ తనకు మార్కులు అత్యధికంగా వస్తున్నాయనీ, రాత్రింబవళ్లు, విరామం లేకుండా చదువుచున్నాననీ, నన్ను ఆరోగ్యం కాపాడుకోమని, అభిమానం ఉట్టిపడేట్టుగా, ప్రేమ వెల్లి విరిసేట్టుగా, కంటనీరు ఒలికేట్లుగా వ్రాసేది. అమ్మాయి వ్రాసిన ఉత్తరాన్ని పదేపదే చదువుకొని ఉవ్విళ్లూరేవాడిని. అమ్మాయి అఖండ ప్రతిభతో చదువుతున్నదనీ సంతోషపడ్డానుగాని, వెలుతురు వెనుక గాఢమైన చీకట్లు ముసురుకొంటున్నాయి అని తెలుసుకోలేకపోయాను. మనుష్యుని మృత్యువు వెంటాడినట్లు దీపానికి మీద చీకటి ఎల్లప్పుడూ ఆశ్రయించే ఉంటుంది. కాంతి హెచ్చుగుచున్నదని సంతోషిస్తాము. కాని వెలుగు తరువాత వచ్చే చీకటి అంతకు ద్విగుణీకృతంగా ఉంటుందనీ తెలుసుకోలేము. సంవత్సరాలు గడుస్తున్నాయి. అమ్మాయి వద్దనుండి ఉత్తరాలు రావడం తగ్గిపోతున్నది. వచ్చినా తాను కులాసాగా ఉన్నానని, తాను క్షేమంగా ఉన్నాననీ, నా క్షేమం వ్రాయమనీ రెండు ముక్కలు వ్రాసి ఉత్తరం ముగించేది.

హృదయానికి కష్టం కలిగేది. నాలో అమ్మాయి విషయం, ఒక వింత అనుమానాన్ని కలిగించింది. ప్రతి శలవులకు వచ్చేది. శలవలు అన్నీ అయ్యేవరకు ఉండి చివర మమ్మల్ని వదలలేక తాను వెళ్లలేక కంటతడి పెట్టుకుంటూ వెళ్లేది. రానురాను శలవల్లో ఆసుపత్రిలో పని చెయ్యాలని సాకుచెప్పి శలవలకు కూడా రావడం మానివేసింది. నాకు బాధా, అనుమానం కూడా వేధించడం మొదలుపెట్టాయి. ఒక యేడు శలవల్లో మునసబుగారి అమ్మాయి వచ్చింది. మా అమ్మాయి రాలేదు. మునసబుగారింటికి వెళ్లి వారి అమ్మాయిని, మా అమ్మాయి గురించి అడిగాను. ఆ అమ్మాయి ''ఏమి చెప్పమన్నారండీ ! మీ అమ్మాయి వ్యవహారం ఏమి బాగోలేదు. మీరు ఏమీ అనుకోను అంటే చెబుతాను'' అని అంది. నా హృదయంమీద పిడుగుపడ్డట్లుగా అయింది. చెప్పమ్మా నేనేమీ అనుకోను అని వణుకుతూన్న గొంతుకతో అన్నాను. మునసబుగారి కూతురు ఇలా చెప్పడం ప్రారంభించింది.

— నేను మీ అమ్మాయి ఒకే క్లాసులో కలసి అక్కచెల్లెండ్రకన్న ఎక్కువగా మెలుగుతూ చదువు సంధ్యలు సాగించాము. మీ అమ్మాయికి ఉండే తెలివితేటలు, మేధస్సు, ధారణ అతీతమైనవి. ఆమెకుండే సూక్ష్మబుద్ధితో అసమానమైనటు వంటి మార్కులు సంపాదిస్తూ ఆడవారి మీదనే కాకుండా, మగవారితో కూడా ఇంతటి ప్రతిభావంతులుండడం అసాధ్యం అని రుజువు చేసింది. మా కాలేజిలో అందరి దృష్టి ఈమెమీద పడింది. ఉపాధ్యాయులు కూడా ఆ అమ్మాయినెంతో గౌరవించేవారు.

మా క్లాసులో జాన్ అని ఓ కుర్రవాడుండేవాడు. ఆ కుర్రవాడు గొప్ప తెలివితేటలు కలవాడు. ఒకమారు పరీక్షలో మీ అమ్మాయికి ఫస్టుమార్కు వస్తే మరొకమారు పరీక్షలో ఫస్టుమార్కు అతను సంపాదించేవాడు. మీ అమ్మాయి అతనూ ఒకర్ని మించినవారు మరొక

సంపూర్ణ పోషకాహారంలో అన్ని పోషక పదార్థాలు సరియైన పాళ్లలో వుండాలి...



ప్రొటీనులు
పెరుగుదలకి ముఖ్యం
పిండి పదార్థాలు మరియు క్రొవ్వు పదార్థాలు
శక్తికి
విటమిన్ ఎ
కళ్ళలో కాంతులకి
విటమిన్‌లు బి గ్రూప్
అన్ని ఇతర పోషక పదార్థాలని జీర్ణించుకోడానికి
విటమిన్ సి
రోగ నిరోధక శక్తి పెంపొందించడానికి
విటమిన్ డి
కాల్షియం మరియు ఫాస్ఫరస్‌లని గ్రహించేటట్లు చేయడానికి
ఐరన్
ఆరోగ్యవంతమైన రక్తానికి
కాల్షియమ్ మరియు ఫాస్ఫరస్
దృఢమైన ఎముకలు మరియు పండ్ల కోసం

సిరిలాక్ సంపూర్ణ పోషకాహారాన్ని రుచికరమైన విధంగా అందజేస్తుంది

సిరిలాక్‌లో అయిదు రకాల పోషకాలు అన్నీ వున్నాయి—ప్రొటీన్లు, క్రొవ్వు పదార్థాలు, పిండి పదార్థాలు, ఖనిజాలు మరియు విటమిన్లు. మీ పాపకి ప్రతి పర్యాయమూ సిరిలాక్‌తో తయారు చేసిన ఆహారం మీరు యిచ్చినప్పుడు ఈ పోషకాలన్నీ సరియైన పాళ్ళలో చేరి వుంటాయి.



కలసికట్టుగా పని చేయడం వలన ఈ పోషకాలన్నీ హెచ్చు తగ్గులు లేకుండా ముఖ్యమైనవే. అందుకే అన్ని పోషకాలు 'సంపూర్ణం'గా వున్న సిరియల్ ఆహారం మీ పాప ఆరోగ్యానికి అత్యవసరం. ప్రతి సిరిలాక్ ఆహారం మీ పాపకి ఒక రోజుకి కావలసిన పోషక పదార్థాలలో నాల్గవ వంతుని అందచేస్తుంది. ఈ ఆహారం యిస్తున్నప్పుడు పోషక పదార్థాల కోసం మరొకటి మీరు యివ్వవలసిన అవసరం లేదు.

మీ పాపకి చనుపాలే తగినవి. అయితే పాపకి నాలుగు నెలలు వచ్చి ఘన పదార్థాలు తీసుకోడానికి సిద్ధంగా వున్నప్పుడు, మీ డాక్టర్‌ని సంప్రదించి సిరిలాక్ యివ్వడం ప్రారంభించండి.

సిరిలాక్®
పాలు వుండనే వున్నాయి



సిరిలాక్ తయారు చేయడం ఎంతో సులభం దీనిని ముందుగా మరగ బెట్టిన, గోరు వెచ్చటి నీటికి చేర్చండి. కలపండి. వడ్డించండి

ఉచితం! సిరిలాక్ పిల్లల పెరుగుదల చార్ట్
ఇందులో బరువు చార్టు, రోగనిరోధక మందుల రికార్డు, గట్టిగా ఉండే ఆహారం అలవాటు చేసేందుకు సూచనలు, యింకా ఎన్నో విషయాలు ఉంటాయి.
మీ కాపీ కోసం ఈ చిరునామాకు వ్రాయండి.
సిరిలాక్
పోస్ట్ బాక్స్ నం. 3 న్యూ ఢిల్లీ-110 008.

SAA/FSL/C/3151 TEL

NESTLÉ.

అచ్చిరాని చదువులు

రుగా ఉండేవారు. అతని తల్లిదండ్రు లెవరో తెలియదు. కాకినాడ అనాథ శరణాలయం నుండి వచ్చాడు. అందమైనవాడు కాడు. పొడుగ్గా ఉంటాడు. ముఖం మాత్రం అతని తెలివితేటల్ని రుజువుచేసేట్టుగా ఏో వింత చైతన్యంతో కల కులాడుతూ ఉంటుంది. ఆ ఏడు మేమంతా పరీక్షకు వెళ్లాం. అది ఏనాటమీ పరీక్ష. ఆ పరీక్షలో థియెరీ, ప్రాక్టికల్ అని రెండు ఉంటాయి. ఈ రెండూ కూడా ఎవరు ఉత్తమంగా ఉత్తీర్ణులైతే వాళ్లకు ఒడిక బంగారు పతకం ఇస్తారు. పరీక్షలై శలవులు గడిచాక, కాలేజీ ప్రారంభించిన మొదటి రోజున అధికంగా మార్కులు వచ్చినవారిని కొంత శ్లాఘించి, కొత్తగా మార్కులు తక్కువ వచ్చిన వారిని నిందించి ఈ పతక బహూకరణ జరుగుతుంది. ఈ తంతు ప్రిన్సిపాలుచేత జరుపబడుతుంది. అందరం క్లాసులో కూర్చున్నాం. అంత మంది మీఅమ్మాయికి బంగారం పతకం వచ్చి తీరుతుందని అనుకున్నారు. విద్యార్థులలో కొంతమంది జాన్‌కు వస్తుందని దృఢవిశ్వాసంతో ఉన్నారు. ప్రిన్సిపాల్ మా క్లాసులోకి వచ్చాడు. అందరం లేచి నిలబడ్డాం. కూర్చోండి అని సౌంజ్ఞ చేస్తూ ఈ విధంగా మాట్లాడడం మొదలుపెట్టాడు: 'రెండు గుర్రాలు సమానవేగం కలిగినవి పరుగిడుతూన్నప్పుడు ఒకే ముహూర్తంలో రెండూ గమ్యస్థానాన్ని చేరుతాయని చెప్పలేము. అందులో ఏదో ఒక గుర్రం ముందు చేరుతుంది. అది వేళా విశేషాన్నిబట్టి ఉంటుంది కాని, గెలిచిన గుర్రంలో ఉండదు. ఓడిపోయిన గుర్రం న్యూనతపడవలసిన అవసరం లేదు. అలాగే పరీక్ష విషయంలో, మార్కుల విషయంలోకూడా అంతే. మార్కులు ఎవరికి ఎక్కువ వచ్చినా సమాన స్థాయి గలవాడయితే అతి తక్కువ వ్యత్యాసంతో ఓడిపోతాడు. అలాగే జాన్ గెలిచాడు. సత్యవతి ఓడిపోయింది. థియెరీలో సత్యవతి తెచ్చుకొన్నన్ని మార్కులు జాన్ తెచ్చుకోలేక పోయాడు. ప్రాక్టికల్లో జాన్ తెచ్చుకొన్నన్ని మార్కులు సత్యవతి తెచ్చుకోలేక పోయింది. ఈ విషయంలో సత్యవతికి కొద్దిగా అన్యాయం జరిగింది. ఈ ప్రాక్టికల్ పరీక్ష అందరికి కలిసి ఒకేసారి చేయలేము. జట్లు జట్లుగా విడదీసి పరీక్ష చేస్తాము. మృతకళేబరాన్ని కోసి మేము అడిగిన అవయవాలు చూపించాలి. దీనికి కాలపరిమితికూడా ఉంటుంది. మే మడిగిన అవయవాలను ఎవరు మేము విధించిన పరిమితి కాలంలో తీసి చూపించగలుగుతారో! వారు అవలంభించే విధానం చూపించే విషయాలు మీద ఆధారపడి ఉంటాయి మార్కులు. ఇది వారివారి అదృష్టాన్నిబట్టి ఉంటుంది. దురదృష్టవశాత్తు సత్యవతికి కొద్ది మార్కులు తక్కువ వచ్చాయి. అధికమైన మార్కులు తెచ్చుకున్నందుకు జాన్‌కు సంతోషంగా పతాకాన్ని బహూకరిస్తూ సత్యవతి కోసం జాలిపడుతున్నాను' అని ఉపన్యాసమిచ్చేసరికి మా హృదయాలమీద విద్యుల్లతలతో తయారుచేసిన కొరడాతో కొట్టినట్లనిపించింది. మేమంతా మవునంగా కూర్చున్నాం. జాన్ నిలబడి మెల్లగా చప్పుడు చేయకుండా ప్రిన్సిపాల్‌గారి వద్దకువెళ్లాడు. ప్రిన్సిపాల్‌గారు జాన్ వేసుకొన్న కోటుకు పతకాన్ని తగిలించె సమయంలో నిరాకరిస్తూ ఆ పతకాన్ని తనచేతికిమ్మనమని అన్నాడు. ఇది సాంప్రదాయం కాదని ప్రిన్సిపాల్‌గారు అన్నారు. జాన్ అందుకు 'నేనొక నూతన సాంప్రదాయాన్ని సృష్టిస్తున్నాను' అని చెప్పిఖారి చేతనున్న పతాకాన్ని పుణికి పుచ్చుకొని జేబులో నుండి ఒక కాగితం తీసుకొని చదవడం ప్రారంభించాడు. ఈలా చదివాడు. "వైద్యవృత్తిని అవలంబింప దలచిన వైద్య విద్యార్థుల సౌకర్యం కోసం నేను చనిపోయిన 24గంటలలో నే నెక్కడ ఉంటే అక్కడకు దగ్గరగా ఉన్న వైద్య కళాశాలకు నా మృతకళేబరాన్ని చేర్చాలనీ కోరుతున్నాను. ఇది నా మరణ శాసనం అని చదివి ప్రిన్సిపాల్‌గారి చేతి కిచ్చాడు. ఇక బంగారు పతకం విషయంలో నా నిశ్చయం ఇది. మార్కులు ఎక్కువ రావడం నుంచి అధికారులు నాకీ పతకాన్నిచ్చారు. ఇది నా కష్టార్జితం. దీనిని నేను నాకు తోచినట్లు వినియోగించే అర్హత నాకుంది. మీ అందరి ముందు విన్నవించేదేమంటే సత్యవతిగారు నాకంటే అన్నివిధాల తెలివి అయినవారని మీ అందరకు మనవిచేస్తూ నా మార్కుల విషయాన్ని మరచిపోయి, నేను బహూకరిస్తున్న ఈపతకాన్ని స్వీకరించమని కోరుకుంటున్నాను.' అని అనేసరికి మా శరీరాలు పులకించాయి. ఆనందాశ్రువులు జడివానగా కురిశాయి. విద్యామందిరమంతా ఒక దివ్యమైన దేవాలయంగా మారిపోయింది. సత్యవతి లేచి గంభీరంగా జాన్ వద్దకు నడిచి వెళ్లింది. జాన్‌కు నమస్కరించింది. జాన్ పతకాన్ని ఆమెకు ఇచ్చి నమస్కరించాడు. ఆమె పతాకం చేత పుచ్చుకొని మా అందరినీ ఉద్దేశించి ఈరీతిని మాట్లాడడం ప్రారంభించింది. 'తోటి విద్యార్థులైన మీ అందరికి నమస్కరించి విన్నవించడమేమిటంటే?! ఉత్కృష్టమైన స్త్రీ అయితే ఒకరి వస్తువును తానుఆశించదు తనకున్నదానితోనే తాను సంతోషపడుతుంది. సరే తనకు వచ్చిన బహూమతిని తాను వినియోగించుకొనేందుకు తనకు హక్కు ఎలా ఉందో నా కిచ్చిన బహుమానాన్ని వినియోగించుకొనేందుకు నాకూ అంత హక్కే ఉంది. వారి ఔదార్యాన్ని మెచ్చుకొంటూ, వారి మాటను నేనెట్లా తిరస్కరించలేదో వారుకూడా నేచెప్పే మాటను తిరస్కరించేందుకు వీలులేదు. పురుషులు, పురుషులకు చేసే బహూకృతిని తిరస్కరించవచ్చునుకాని స్త్రీలు పురుషులకు చేసే బహూకృతిని పురుషులు నిరాకరించకూడదు. అలా నిరాకరిస్తే స్త్రీజాతినే అవమానించినట్లు.అందుచేత, నే చేసే చేతనాన్ని శిక్షనూ కూడా జాన్ గారు అనుభవించి తీరాలి!' అని అంటూ తనచేతనున్న పతకాన్ని జాన్‌గారి కోటుకు తగిలించింది. జాన్, జాన్‌తోపాటు మేమంతా ఈ ఉదంతాన్ని ఆశ్చర్యంతో తిలకించాం. అనాటినుండి కళాశాలలో ఉండే విద్యార్థులంతా దేవతలను గౌరవించినట్లుగా సత్యవతిని, జాన్‌ను గౌరవిస్తారు. ఇది ప్రథమాశ్లేషం.

ఆఖరి సంవత్సరం పరీక్ష క్రిందటి యేడాది ప్యాసయి పోయింది. మీకు తెలియనివ్వలేదాసంగతి. పరీక్ష ప్యాసయ్యాక, అక్కడే ఆసుపత్రిలో హవుస్ సర్జన్‌గా పనిచేసింది. జాన్ అనారోగ్యం వల్ల పరీక్ష తప్పాడు. కొంత కాలం నుండి జాన్ సత్యవతి కలిసి కాపురం చేస్తున్నారు. బ్రహ్మమత రీత్యా వారు వివాహం చేసుకున్నారట. ఈ మధ్య మా కాలేజీలోనే ఎనాటమి ప్రొఫెసర్ పని ఖాళీ వచ్చింది. మీ అమ్మాయికి ఆ పని యిచ్చారు. ఈ శలవలు ఆఖరుని మీ అమ్మాయి ఏకాలేజీలో చదువుకొందో ఆ కాలేజీలోనే పెద్ద జీతంమీద ఉద్యోగాన్నిచ్చారు ఇంక పది రోజులలో కాలేజితెరుస్తారు. మీ అమ్మాయి ఉద్యోగంలో చేరుతుంది. ఈ విషయాలు నాకు తప్ప మరెవ్వరికి తెలియవు. మీరు మా తండ్రిగారి ద్వారా, మీ అమ్మాయి మాకు అప్పజెప్పారు కాబట్టి మీ అమ్మాయి మా ఇంట్లో ఎంతోకాలం ఉండి చదువుకొంటూ, మా

కుటుంబంలో ఒకర్తై కలిసి మెలిసి ఉంది కాబట్టి, ఇంతకూ పెండ్లిఅయిపోయాక ఎవ్వరూ ఏమీ చేయలేరు కాబట్టి చెప్పినా తప్పులేదని మీతో చెప్పాను. ఇది ఎవ్వరితోనూ అనకండి. మీ కడుపులో పెట్టుకోండి. ఆడది ఎంత ఉత్తము రాలైనా ప్రేమా, పెండ్లి విషయం వచ్చేసరికి, తల్లితండ్రులను ఎదిరించేందుకు జంకదు. ప్రేమ విషయంలో, స్త్రీల పెండ్లి విషయంలో తల్లితండ్రులు కూడ కాస్త ఉదారంగా సంచ రించాలి. పాతకాలపు భావాలు, మూఢనమ్మకాలు సడలించాలి. స్త్రీ భవిష్యత్తు జీవితంలో ఒక నూతన శకం ప్రారంభమవుతున్నది. అందుకు పురుషుడు కూడ తోడ్పడితేగాని సహృదయముతో వీక్షించి పాటుపడితేగాని శాసనాలు, చట్టాలు, చట్టుబండలు ఎన్నిజేసిన లాభంలేదు. అటు వంటి నూతన శకమునకు మీ అమ్మాయివంటి వారు పునాదులు వేసి నాంది పాడుతున్నారు. అందుచేత యిందులో మీరు అవమానపడవలసింది గాని, శాపనార్థాలు పెట్టేందుకుగాని ఏ మాత్రం అవసరము లేదు'' — మునసబుగారి అమ్మాయి తన కధ పూర్తిచేసింది. నేను నిలువునా నీరయి పోయాను. గుండె దడదడలాడుతుంది. ఒంటిమీద ముచ్చెమటలు పోసాయి. కొంతసేపటివరకు నోట మాట వచ్చింది కాదు. తెప్పరిల్లి తెలివితెచ్చుకుని, పాపిష్టిదాని, ఎంతపని చేసింది. సద్వంశమును సముద్రములో గలిపింది బ్రాహ్మణ జాతికే మచ్చ తెచ్చింది. పోని ఆ చేసుకున్నది ఒక బ్రాహ్మణునే జేసుకుంటే ఎంతో సంతోషించి ఉండేవాడిని. తల్లి తండ్రి తెలియని, దిక్కు మొక్కులేని కిరస్తానీ మతం వాడిని జేసుకుంది. తన పూజ పునస్కారం ఏ మంటలో గలిపిందో? ఎప్పుడా పెళ్లి చేసుకుందో, అప్పుడే దానికి, మాకు తెగతెంపులయిపోయాయి. అది చనిపోయిన క్రిందలెక్క. ఇక దాని వూసు నేను తలచను. బ్రతికుండగానే ఘటాశ్రాద్ధము జేసి నాకు ఒక్కతే కూతురని నిర్ణయించుకుంటాను. నిర్ణయించుకోవడమే కాదు, లోకంలో ప్రచారం కూడా అలాగుననే చేస్తాను. నీవు ఒక్క ఉపకారం చేసిపెట్టు. కాస్త నీవు మద్రాసు వెళ్లాక అక్కడ అది ఆసుపత్రిలో మరణించినట్లు ఒక ఉత్తరముక్క వ్రాసివేస్తే నన్ను రక్షించినదాని వవుతావు. ఈ మాత్రం ఉపకారం చేసిపెట్టు తల్లీ! నీ మేలు మరువను. ఈ ఉన్న ఒక్కపిల్ల సంసారమైనా నిలబడాలిగదా! దాని కడుపున బుట్టిన పిల్లలకు పెళ్లి పేరంటాలయేందుకు నాకీ ఉపకారముజేసిపెట్టు తల్లీ. నిన్ను ఆజన్మాం తము మరచిపోనన్నాను. నేనిలాగున అన్నందుకు మునసబుగారి అమ్మాయి కొంచెం నివ్వెరపడి వెల వెలబోయి నేనుజెప్పినపని తప్పకజేస్తానని వాగ్దానం చేసింది. నన్ను నీవు కలుసుకున్నట్లు గాని, నాకి విషయము తెలియజేసినట్లుగాని మా రెండవ దానితో ఎప్పుడూ అనకు.

మర్నాడు మునసబుగారి అమ్మాయి తిరిగి మద్రాసు వెళ్లిపోయింది. నాకు వ్రాస్తానని ఖరారు జేసిన ఉత్తరం వారం రోజుల వరకు వ్రాయలేదు. కారణం తెలుసుకోలేక ఖంగారు పడ్డాను. ఒకనాడు సాయంత్రము పోస్టు బంట్రోతు ఉత్తరం తెచ్చి యిచ్చాడు. ఆత్రంలో కవరుచించి చదివాను.

'పితృ సమానులైన రఘునాథరావుగార్కి మీ మునసబుగారి అమ్మాయి అనేక నమస్కార ములు జేసి వ్రాయడమేమనగా నేను చెన్నపట్నము వెళ్లేసరికి మీ అమ్మాయి వూళ్లో లేదు. కోయం బత్తూరులో ప్లేగువ్యాధి రావడం నుంచి అనేక మంది మరణిస్తున్నారని గవర్నమెంటువారు పంపారు. నెల రోజులు అక్కడే ఉండి పని జేస్తున్నదట. మీ అమ్మాయి భర్త జాన్ ఆసుపత్రిలోనే యున్నాడు. ఆయనకు జబ్బు తగ్గింది. అనారోగ్యమేమీ లేదు కాస్త నీరసంగా ఉండటం జేసి ఒక వారం రోజుల వరకూ ఆసుపత్రిలోనే యుండి, టానిక్ పుచ్చుకో నున్నారట. ఏది ఎలాగున్నా శలవులైపోవచ్చాయి. శలవులాఖరున మీ అమ్మాయి వచ్చి కాలేజీలో ''యనాటమీ'' ప్రొఫెసరుగా జేరటం తప్పదు గదా! ఇక రేపు కాలేజీలు తెరుస్తారనగా తాను చెన్నపట్నము వస్తున్నానని తంతివార్త పంపింది మే మందరమూ ఆమెకొరకు ఎదురు చూస్తు న్నాము. ఆ రాత్రి ఒంటి గంటకు అనుకోకుండా హృదయరోగము వచ్చి జాన్ మరణించాడు మర్నాడుదయము మీ అమ్మాయి జేరుకుంది. నేను ఈ వార్త ఆమె చెవిని వెయ్యదలచుకోలేదు ఆమెకు వెంటనే తెలియజేస్తే హటాత్తుగా హృదయమాగి మరణించవచ్చు లేదా మనో చాంచల్యము సంభవించి, ఉన్మత్త అయిపో తుందేమోనన్న భయంచేత మేమంతా జాన్ మరణ విషయములో మౌనము వహించాము. ఆరోజు ఉదయము ఆమె కొరకు స్టేషనుకు పోయాను.

రైలు రావడం ఆలస్యమైంది రైలు తొమ్మిదిన్నరకు వచ్చింది పది గంటలకల్లా ఆవిడ కాలేజీలో జేరాలి. ట్రైను దిగడంతోనే నను కౌగలించుకొని 'జాన్ బాగా ఆరోగ్యంగా ఉన్నాడు కదూ!' అని నన్ను ప్రశ్నించింది. నేను కొండంత ధైర్యమును తెచ్చుకుని నా గుండె విచారంతో కృంగిపోతున్నా, వివర్ణమై వెలవెల బోతూ నా ముఖంలో ఉన్న భావాలు ఆమె గ్రహించకుండా ఉండేందులకు ముఖమును ప్రక్కకు త్రిప్పుకుని 'చాలా కులాసాగా ఉన్నాడని' అన్నాను. నా మాట నూతిలో నుంచి వేసిన కేక లాగున నాకే వినపడింది. ఇద్దరం బయలుదేరి కాలేజీకి వెళ్లాము మీ అమ్మాయి తాను కాలేజీకి వచ్చినట్లు సంతకం పెట్టింది క్లాసుకి వెళ్లి పాఠం చెప్పమన్నారు. క్లాసులో పాఠం వీణ వాయించినట్లుగా విద్యార్థులంతా మెచ్చుకునేటట్లు చెప్పింది. పాఠానంతరము, మృతశరీరం కోసి అవయవాలు విద్యార్థు లకు చూపించాలి విద్యార్థులను వెంటబెట్టుకుని మృతశరీరము లుంచబడే హాలు జేరుకుని బల్లమీద పడుకోబెట్టిన మృతశరీరం దగ్గిరకు వెళ్లి కప్పి ఉన్న గుడ్డ తొలగించింది. ఆ బల్లమీద జాన్ మృతకళేబరం సాక్షాత్కరించింది తుఫానుగాలికి వూగిపోయే మాధవీలతలాగ కంపించిపోయింది. కనులనుండి కన్నీరు జడివానలాగున కురిసింది. కొంతసేపు స్పృహతప్పి కొయ్యబారి నిర్జీవప్రతిమ లాగున నిలుపబడి, చైతన్యము తెచ్చుకుని కన్నీరు కొంగుతో తుడుచుకుని తనకు స్వస్థత తొలగిం దని మరునాడు వచ్చి విద్యార్థులందరకు పాఠం చెపుతాను, ఆ మృతకళేబరం అలాగునే ఉంచమని



ఇటీవల హైదరాబాదు రవీంద్రభారతిలో 'సృజన ఆర్ట్స్ థియేటర్స్' వారు నిర్వహించిన ''హిప్నోమేజిక్'' ప్రదర్శనలో హిప్నాటిజం ప్రదర్శిస్తున్న ప్రొఫెసర్ బి. వి. పట్టాభిరామ్.

శ్రీ నారాయణస్వామి ఆలయం



(ఫొటో : హరి)

ప్రకాశం జిల్లా, కనిగిరి తాలూకా మిట్ట పాలెములోని "శ్రీ నారాయణ స్వామి" దేవాలయం ప్రతి ఆదివారం వేలాది భక్తులతో నిండి ఉంటుంది.

కొమ్మినేని మహాలక్ష్మమ్మ – వెంకయ్య దంపతుల కుమారుడు కొండయ్య.

కొండయ్య బాల్యంనుండి రాళ్ళు, రప్పల్ని కూడా పూజంచడం వల్ల ఊరి పిల్లలు అతన్ని "పిచ్చి కొండయ్య" అనేవారు. కొండయ్య పెద్ద వాడవుతున్నా చదువు సంధ్యలు లేకుండా ఉన్నాడనే మనో వ్యాధితో అతని తండ్రి మరణించాడు.

తండ్రి మరణానంతరం కొండయ్య తల్లి, తమ్మునితో అనేక పుణ్యక్షేత్రాలు దర్శిస్తూ చీకటిపడే వేళకు ఏదో ఒక గ్రామంచేరి అక్కడ పురాణ కాలక్షేపము చేస్తూ ఉండేవాడు. ప్రజలు ఆయన్ని సాములు వారని పిలిచేవారు. ఆ సమయంలోనే తల్లిని కూడా కోల్పోయి, తమ్ముడు పాపయ్యతో కొండయ్య స్వగ్రామము చేరాడు.

స్వామిగా పేరుపొందిన కొండయ్య మిట్ట పాలెమునకు సుమారు మూడు మైళ్ళ దూరములో ఉన్న నారకొండ ప్రాంతాన్ని ఎంచుకొని అక్కడ బొమ్మ జెముడు చెట్టు పాలు త్రాగుతూ, కష్టములలో ఉన్న ప్రజలకు సేవ చేస్తూ ఉండేవారని ప్రతీతి. ఒకనాడు ఒక మహానుభావుడు "పిచ్చి కొండడవు నీవేనా, నీపిచ్చి కుదుర్చుటకే నేను వచ్చితి" నని ఆయనకు ఒక మంత్రము ఉపదేశించాడు. తరువాత అక్కడికి వచ్చిన తన తమ్మునితో, భగవంతుని ఆదేశానుసారం ఇకనుండి ప్రజలు నన్ను "నారాయణ స్వామిగా" పిలుస్తూ ఉంటారని చెప్పాడు.

ఈ కొండ ప్రాంతంలో నారాయణ స్వామి ఉండడంవల్ల దీనికి "నారకొండ" అని పేరు వొచ్చినదని చెప్పవచ్చు. ఇక్కడ దోనె ఒకటి నీళ్ళతో నిండిఉండి ఎన్ని తీస్తేమో మరల అన్ని దోనె మట్టం వరకు వస్తూ ఉండడం ఒక విశేషముగా పేర్కొనవచ్చు. అంతేకాక కొండ క్రింద "నగారా బండ" అనేది ఒకటి ఉంది. దీనిని తాకితే నగారా ధ్వని వస్తూ ఉంటుంది.

ఒక శుభ ముహూర్తమున ఆదివారం, అమావాస్య అందులోనూ మహా శివరాత్రి పర్వ దినమున స్వామివారు జీవ సమాధి పొందారు. ఆ సమాధిమీద పాలరాతిలో మలచబడిన స్వామి వారి విగ్రహము ప్రతిష్ఠింపబడి విశేషముగా భక్తులచే పూజింపబడుతున్నది.

ఆదివారం భక్తులు స్వామివారికి ఇష్టమైన పొంగలి నైవేద్యముగా పెట్టుదురు.

సంతానం లేనివారికి సంతానం కలగటం, చర్మవ్యాధులు తగ్గటం జరుగుతూ ఉంటాయని, అలాంటి వారిని ప్రత్యక్షంగా చూశామని ఆ ఊరి వారన్నారు.

అనారోగ్యంతో బాధపడుతున్న తాను స్వగ్రామమైన కావలినుండి ఇక్కడికి వచ్చి స్వామి వారిని సేవించి ఆరోగ్యాన్ని పొందానని, ఆ తరువాత ఇక్కడి ప్రజల కోరికపై "ఆలయ పూజారిగా" ఉన్నానని, ప్రతి ఏటా మహా శివరాత్రికి సుమారు రెండు లక్షలమంది వచ్చి స్వామివారిని పూజిస్తూ ఉంటారని శ్రీ పాతకోట కృష్ణమూర్తి తెలియచేశారు.

భక్తులు ఆలయాభివృద్ధికి పాటుపడినప్పటికీ, ప్రభుత్వం పూనుకొని, కోవిలం పాడు నుండి ఫర్లాంగు దూరములో నున్న మిట్టపాలెమునకు రోడ్డు సౌకర్యం, తదితర సౌకర్యాలు ఏర్పాటు చేయవలసిన అవసరం ఎంతైనా ఉంది.

— యేలేశ్వరపు నారాయణమూర్తి

అచ్చిరాని చదువులు

జెప్పి వెళ్లిపోయింది. విద్యార్థులంతా ఆశ్చర్య పడ్డారు. సముద్రమంత కష్టము వచ్చినప్పుడు హిమనగమంత ధైర్యమును జూపిన, వనితయని కొందరు శ్లాఘించారు. నన్ను ప్రిన్సిపాల్ గారు పిలిపించి ఆ రోజంతా మీ అమ్మాయిదగ్గరే ఉండమని, ధైర్యం జెప్పమని, ఆమె ఎట్టిసాహసమైన పని జేయకుండా ఉండేటందుకని ఆ రాత్రి కూడాఆమెతోనే గడపమనిశలవిచ్చారు. ఆరోజంతా తన గదిలో కూర్చుని రోదించి, రోధించి నీరసము రాగా, మాంద్యంలో మీ అమ్మాయి గడిపింది. మీ అమ్మాయి నిదురలేకుండా ఏడుస్తూనే యుంది. రాత్రి రెండు గంటల వరకూ నేనూ ఆమెకు ధైర్యం చెబుతూ, ఆమెతోనే గడిపాను. రెండు గంటలు దాటాక నాకు చిన్న కునుకు వచ్చి నిద్దుర పట్టినది. ఆ పట్టిన నిదుర సూర్యోదయ మయేవరకు నాకు తెలివి రాలేదు. నాకు తెలివివచ్చి పక్కను చూచుసరికల్లా మీ అమ్మాయి నా పక్కనులేదు. నేను హుటాహుటిని ఏదో ప్రమాదం సంభవించి యుంటుందని అందరిని రమ్మని కేకలు వేశాను. కొంతమంది జేరారు. పక్క గది తలుపులు లోపల గడియవేసి ఉండుట వల్ల పిలిచి విసిగి ఏదో అఘాయిత్యము సంభవించిందని తలుపులు పగులగొట్టి లోపల ప్రవేశించాను. గదిలో ప్రవేశించేసరికల్లా దూలానికి తాడుతో ఉరి వేసుకున్న మీ అమ్మాయి గోచరించింది. అంతమంది కెవ్వున కేకవేశాము. ప్రిన్సిపాలుగారికి కబురు పంపాము. మీ అమ్మాయి చీరకొంగున ముడివేయబడి ఉంది. ఆ కొంగు విప్పేసరికల్లా అందులోనుంచి తాను వ్రాసిన ఉత్తరం ఒకటి క్రిందబడింది. ఆ ఉత్తరంలో ఈ రీతిన వ్రాయబడి యుంది :

'నా భర్త మరణించాక, నాకీ లోకంతో పని లేదని నాకు తెలుసును. నా భర్తలాగే, నా శరీరమునకు గూడ జీవితానంతరము ఒక పవిత్రమైనటువంటి పని గలదని నాకు ,తెలుసును. అందుకనే నాకు వైద్యము తెలిసి, సునాయాసముగా మరణము సంభవించు టెట్లగునో తెలిసికూడా నేను ఉరిపోసుకుని మరణించటానికి కారణం ఉన్నది. రేపు ఉదయం నా భర్త శరీరముతోపాటు,నా శరీరమును కూడ విద్యార్థుల వ్యాసంగము కోసం శాస్త్రాభ్యాసము కోసం వాడుకొనివచ్చునని నేను మరణశాసనము చేస్తున్నాను. ఇంతకన్నా వేరే వ్రాసేందుకు ఏమీ లేదు.

మీ మునసబుగారి అమ్మాయి.' ★

ఆంధ్రపత్రిక—సచిత్ర వారపత్రిక
1961 జూలై 5
సంచిక నుంచి



క్రొత్త ఎక్కువ శక్తివంతమైన సూపర్ 777 డిటర్జెంట్ బార్

నాణ్యతను గురించిన పొగడ్తలు కేవలం పొగడ్తలే కావనీ, నిజమని నిరూపించే హామీ కూడా ఇస్తుంది.

ఇప్పుడు క్రొత్త సూపర్ 777 డిటర్జెంట్ బార్‌తో నాకు లభిస్తుంది అన్నిటికంటే ఎక్కువ తెలుపు. దీని డిటర్జెంట్ ఫార్ములా మునుపు కంటే ఎక్కువ మేలైనది. అందుకే ఇది మునుపు కంటే ఎక్కువ నురుగ ఇస్తుంది, ఎక్కువ బట్టలు ఉతుకుతుంది, ఎక్కువ మన్నిక వస్తుంది. అంచేతే ఇది ఇతర అన్ని డిటర్జెంట్ బారులు మరియు సబ్బుల కంటే ఉత్తమమైనది!


వాడి చూడండి...మీరూ విస్తుపోయి చూస్తారు, మరి-మరి దీన్నే కొంటారు.

Shilpi DM 2/83 Tel.

వసంతంలో ప్రకృతి వళ్లు విరుచుకొన్నట్లు నవ్వింది

ఆరతి.

ఆ నవ్వుల జల్లులో తడిసిన రాజా విరబూసిన 'పొన్న'లా పులకించాడు.



"ఎందుకమ్మా నవ్వు ?" బుంగమూతి పెడుతూ అన్నాడు.

"అబ్బ! అపుడే అలకా ? ఆడపిల్లలా అస్తమానం నువ్వు అలగడం మగపిల్లాడిలా నేను అలక తీరుస్తుండడం బాగుంది.... నేను వేగలేను బాబూ నీతో...." అంటూ తనూ అలిగేసింది ఆరతి.

''మీ రిద్దరూ నోరుమూసుకోండి'' అన్నట్లు కళ్లు మాట్లాడుకొన్నాయి. కిలకిలమన్న రెండు హృదయాలు పన్నీరు చిలికాయి. రాజా అందించిన చేయి అందుకొని లేచింది ఆరతి. జంటగ బస్‌స్టాప్‌కి నడిచారిద్దరూ. దూరమైపోతున్న ఆ జంటను చూసి సంతోషంతో ఉరకలు వేస్తూ చేర రాబోయాడు సముద్రుడు. కానీ ఆ జంట ఉరకలను ఆపే 'సంస్కారం'లా చెలియలికట్ట అడ్డుపడింది సముద్రునికి. బస్సెక్కిపోయిన వాళ్లనిచూసి ఉస్సురని నిట్టూరుస్తూ వెనక్కు మరలాడు మరో క్రొత్త జంటను వెతుక్కొంటూ.

* * *

మధ్యాహ్నం తీరిగ్గా కూర్చొని కిటికీదగ్గర అడవి బాపిరాజు ''నారాయణరావు'' చదువుకుంటోంది ఆరతి. అప్పటి భాషను,

జి.హేమంత

జీవన సరళిలో తీయని రవళి

యిప్పటి భాషతో పోల్చుకుంటూ సమన్వయం కుదరక, ఆ భాషలోని తీయదనాన్నాస్వాదిస్తూ "యిప్పటి కవితా –ధోరణే లేదు రచయితల్లో. నువ్వు, నేను, వచ్చె, తెచ్చే... అన్నట్లుంటున్నాయ్. భొత్తిగా వాడుక భాషే రాసేస్తుంటే, యింక చదివేవాళ్ళకి విజ్ఞానం, భాషా జ్ఞానం ఎలా పెరుగుతుంది? పైగా సమర్థింపు లొకటి! రచయిత పాఠకుని స్థాయికి దిగి వ్రాయాలా? పాఠకుణ్ణి తనతోపాటు పైకి తీసుకు వెళ్ళాలా? ఏమిటో రసజ్ఞులు కరువైపోతున్నారు."

ఆలోచిస్తూ మధ్య మధ్య పేజీలు తిరగేస్తుంది. ఆలోచనలాపి ఒక్క క్షణం కిటికీ గూండా చూస్తూ హాయిగ, స్వేచ్ఛగా గాలివీలుస్తే, ఆ గాలిలో మిళితమైన గులాబి లేత పరిమళం, మొగ్గ సంపెంగ ఘాటు వాసన, విరజాజుల గుబాళింపు గుండెలను చేరి ఊపిరితిత్తుల పరిమాణాన్ని పెంచుతోంది. మరల రెండు పేజీలు చదివి ఆర్ద్రతలో మునిగిపోతే, నారాయణరావు హృదయ సామ్రాజ్ఞి 'శారద' కనులముందు కదులుతూ తోటలో తిరుగాడుతున్నట్లే భ్రాంతి కలుగుతోంది. అరమోడ్పులయిన ఆరతి కనులు ఏ లోకంలోనో కలలు కంటున్నాయి. అలా దీనమయిన ఆరతి వాతావరణంలోని మార్పు గమనించనేలేదు. చల్లని చిరుగాలి మెల మెల్లగా ఈదురుగాలిగా మారి సన్నని వాన తుంపర మొదలయ్యింది. గాలి విసురు ఒక్కసారిగ మొహాన్ని తాకిన జల్లుకి ఉలిక్కిపడి ఈ లోకంలోకి వచ్చింది ఆరతి. హాయిగా నవ్వుకొంది. జల్లు కొడుతుంటే కిటికీ మూయాలనే ధ్యాసన్నా లేకుండా, అలా చూస్తూ పూలవాసనతో బాటు తడిసిన కమ్మని మట్టి వాసన నాస్వాదిస్తూ, అపుడపుడు మోహం మీద పడుతున్న జల్లుకి జలదరిస్తున్న మేనితో, తడిసిన కమలంలాంటి మొహంతో, సరోవరంలో కిలకిల్లాడే మీనాల్లాంటి కళ్ళు రెప రెపలాడిస్తూ తన్మయంగా ప్రకృతి చేసే నాట్యహేలలో మునిగిన ఆరతి తననే గమనిస్తున్న రాజాని చూడనేలేదు. గాలి తగ్గిందనడానికి నిదర్శనంగా వర్షం స్థిరంగా ధారగా కురవసాగింది. కిటికీ దగ్గరున్న రాధామాధవం పూలు





జీవన సరళిలో తియని రవళి

సిగ్గు బరువుతో ఒదిగి కూర్చున్న పెళ్ళికూతుర్లా వంగి ఉన్నాయి నీటి బిందువులతో. ఆ వాన ధారలో వింత అందంతో మెరిసి పడుతున్న తోటనే తమకంగా చూస్తున్న ఆరతి, నుదుటిమీద వెచ్చని స్పర్శకు ఉలిక్కిపడింది. వర్షం పడి వెలిసినప్పటి ఆకాశంలో నిర్మలంగా, విశాలంగా ఉన్న నుదుటిపై మెత్తని పెదవుల స్పర్శ ఆమె అణువణువును పులకింపచేసింది.

"రాజా !" అస్పష్టంగా అంటూ హరివిల్లులా వెనక్కి వంగి అతని కళ్ళల్లోకి చూసింది.

"రతీ !" బదులు పలికిన అతని పిలుపులో, ఏదో కాంక్ష ప్రస్ఫుటమౌతోంది.

"రతి ! వెదర్ బాగుంది కదూ." రిలాక్సింగ్‌గా అవుతూ ప్రక్కకి వచ్చి ఎదురుగా ఉన్న కుర్చీలో కూర్చుంటూ అన్నాడు.

"ఊఁ" అంది మత్తుగా ఆరతి. ఆ కళ్ళల్లోని తమకాన్ని భరించలేనట్లు కళ్ళు దించుకొన్నాడు రాజా. ఆ రెండు గుండెలు పాడే మౌన రాగానికి తాళం వేస్తున్నట్లుంది, వర్షం చేసే చప్పుడు.

"నువ్విక్కడున్నావా రాజా ! అన్నయ్య నీ కోసం చూస్తున్నాడు" అంటూ వచ్చింది నందిని. ఉలిక్కిపడి సర్దుకున్నారిద్దరూ. ఆ మాట వినగానే లేచి వెళ్ళిపోయాడు రాజా, ఆరతివైపు చూడనన్నా చూడకుండా.

"కిటికీ మూసెయ్యకపోయావా, జల్లు కొడుతుంటే చూస్తూ కూర్చున్నావా ? బాగుంది !" రుసరుసలాడుతూ కిటికీ తలుపులు ధన్‌మని వేసేసి తన పనయిపోయినట్లు వెళ్ళిపోయింది నందిని.

కళ్ళముందున్న అందమైన దృశ్యంలో లీనమైపోయినపుడు, ఆ దృశ్యాన్ని బలవంతంగా చెరిపివేసినట్లయి ఆరతి మనసు మూగబోయింది. నందిని వెళ్ళినవైపు, రాజా ఖాళీచేసిన కుర్చీవైపు మార్చి మార్చి చూసి నిర్లిప్తంగా లేచి మంచంమీద వాలిపోయి రగ్గు ముసుగుపెట్టుకొంది. ఆకుపచ్చని గాజు తలుపుల్లోనుండి వింతగా కనిపిస్తున్న నీళ్ల ధారను చూస్తూ పడుకొంది బద్ధకంగా. హాల్లోనుండి రేడియో సిలోన్ బర్‌బర్‌మంటూనే 'కురిసింది వాన' పాట వినిపిస్తోంది. ఆరు నూరయినా నందిని యింటి దగ్గర ఉన్నంతసేపు రేడియో ఏదో స్టేషన్ మ్రోగుతుండవలసిందే. అది కాకపోతే స్టీరియో రికార్డు ప్లేయర్, అంతేగాని స్తబ్దుగా ఉండడానికి వీల్లేదు. అలా వెదర్ బాగులేనపుడు రేడియో పెట్టడమంటే మహా చికాకు ఆరతికి. సంగీతం అనేది ఏ భాషలోనన్నా, ఏ రూపంలోనన్నా మనసుని ఆహ్లాదపరుస్తూ ఉండాలేగాని యితరుల మనసుని చికాకు కలిగించేదిగా ఉండకూడదని ఆరతి భావన. కానీ ఆ యింట్లో ఒకరి ఆలోచనలతోగాని భావాలతోగాని మరొకరికి పని లేదు. అందుకే ఆ మోత. అంతలో పెద్ద శబ్దంతో బుల్లెట్ స్టార్టు అయ్యింది.

"హుఁ ! వెళ్ళిపోతున్నాడు. యింతసేపు ఈ వర్షం ఆపింది. లేకుంటే అసలు యిల్లు అనే మాట భోజనం వేళకి వీలయితే, లేకుంటే ఏ అర్ధరాత్రో కాస్సేపు మేను వాల్చడానికి పనికొచ్చే ఓ స్థలం అంతే. యింటికి పెద్దవాడు, వంశోద్ధారకుడు, తరువాత వాళ్ల బాధ్యతలను నెత్తిన పెట్టుకోవలసినవాడు... కానీ ఏదీ వాడి బాధ్యతే వాడికి లేదు. రేపేమిటి? అన్న ప్రశ్న వీళ్లకెందుకుండదు ? అంత మాత్రం ఇంగిత జ్ఞానం లేని వాళ్ళా ? వయసు ఎందుకు వస్తుంది ? శరీరాన్ని పెంచడానికా ? ఎవరి లోపం , ఏది లోపం వీళ్లిట్లా తయారవడానికి ! నాన్నగారి మితిమీరిన సంపాదనా వ్యామోహమా ? అమ్మ అమాయకత్వమా ? మరి తన ఆలోచన లెందుకిలా భిన్నంగా ఉంటాయి. చిన్నప్పటి నుండి అంతే ! ఈ యింట్లో, ఈ పరిసరాల్లో, ఈ మనుషుల మధ్య ఏదో లోపం, ఏదో అసహజత తన మనసుని ముకిళింపచేసాయి. ఎపుడూ ఒంటరితనాన్ని కోరే తన మనసుకి ఆలోచనలే తోడు. అందుకేనేమో ఈ విచక్షణ. చీకటిగదిలో కూర్చున్న మనిషికి ఏ కంతలో నుండో

సన్నగ ప్రసరించే వెలుగురేఖ లాంటివాడు "రాజా" తనపాలిట. రాజా మాటలో, చూపులో, సమక్షంలో ఏదో ఆత్మీయత. మనసుని చుట్టేసి ఉక్కిరిబిక్కిరి చేసే ఆత్మీయత కొండంత ధైర్యానిస్తుంది, భవిష్యత్తును తలచుకొన్నపుడంతా...ఏడీ...రాజా...అన్నయ్యతో కలిసి వెళ్ళిపోయిఉంటాడు. చెప్పనేలేదు. అన్నయ్య ఏమనుకొంటాడోని భయం...రేపురానీ..." అనుకోగానే అంతవరకు వేదనతో అలసిన మనసు తృటిలో తృప్తితో మునిగి సన్నని హాసరేఖ ఉదయించిందా లేత పెదవులపై.

పదహారేళ్ల ఆరతి ఆలోచన లెపుడూ నలభై పైబడ్డవాళ్లను మించి పోతాయి. ఇంటరు ఫస్టియర్ చదువుతున్న ఆరతి, క్లాసు పుస్తకాలతో పాటు జీవితాన్ని చదవటం అలవాటు చేసుకొంది. బి. య్యేని గాలి కొదిలేసిన అన్న చంద్రకాంత్‌ని, బి. యస్సీ.తో కుస్తీలు పడుతున్న ఇరవయి రెండేళ్ల అక్క నందిని చేత... అది కంప్లీట్ చేయించి, ఉద్యోగాల్లో వేయించి బండచాకిరీ చేయించాలన్నంత కసిగ ఉంటుంది వాళ్ళ గురించి తల్లి పడుతున్న బాధ చూసినపుడు. చిన్నతనం రోజులు గుర్తు తెచ్చుకొంటే తల్లిమీద విసుగు కలుగుతుంది ఇప్పుడు ఏడుస్తున్నందుకు. ఇవన్ని చెప్పుకుందుకో వ్యక్తి కావాలి. ఆ వ్యక్తి "రాజా" కావడం అదృష్టం అనుకొంటుంది. స్వతహాగా తెలివైనది, ఎవరితో కలవని ఆరతి వంటరితనం రాజా మనస్తత్వానికి సరిగ్గా సరిపడ్డాయి. అందుకే ఆమెతో చెలిమిని పెంచుకొన్నాడు. వాళ్ల స్నేహానికి అడ్డులేదు.

"ఆర్తి అమ్మ పిలుస్తోంది" జడ అల్లుకొంటూ చెప్పి, తన పనిలో మునిగిపోయింది నందిని. మంచం దిగి వంటింటిలోకి అడుగు పెట్టింది.

"నాన్నగారేం చేస్తున్నారో చూసి కాస్త ఆ టిఫిన్, కాఫీ యిచ్చి రామ్మా. దాన్ని కాస్త యిచ్చి రమ్మన్నాను, విననట్లే వెళ్ళిపోయి నిన్ను పంపిందన్నమాట..." టిఫెన్ ప్లేటు అందిస్తూనే పెద్ద కూతురి మీద కోపం వెళ్ళగక్కింది భైరవి.

"అది చెయ్యదని తెలిసి దానికెందుకమ్మా చెప్తావు! నన్ను పిలుస్తే వస్తానుగా." అంటూ అవి తీసుకొని హాల్లోకి నడిచింది.

పేకముక్కలు, పుస్తకాలు...పేపర్లు...అన్ని ముందు వేసుకొని తనలో తను మాట్లాడుకొంటూ గాల్లో చేతులు త్రిప్పుతూ అస్తవ్యస్తంగా ఉన్న తండ్రి మాధవరావుని చూసి ఆరతి మనసు ఆర్ద్రమయ్యింది. ఒక్క క్షణం ఐయిదేళ్ల క్రిందట తండ్రి రూపం కనబడి కళ్లనీటితో నిండాయి. హుందాగా టక్ చేసుకొని వెంట ఫ్యాన్స్‌తో హడావిడిగా కాంప్స్ తిరిగే వారు. ఆయన్ని ఆ మూడ్‌లోనుండి మార్చి టిఫెన్ పెట్టేసరికి ఆరతి సహనం కాస్త తరగిపోయింది. ప్లేటు తీసుకువెళ్తు గదిలోకి తొంగి చూసింది. చక్కగా ముస్తాబయి సోఫాలో కూర్చుని పత్రిక ఏదో తిరగేస్తుంది నందిని.

పుస్తకం తిరగేస్తుందన్న మాటేగాని నందిని ఆలోచనలు ఎక్కడో ఉన్నాయి...

"వెధవ్వాన ... ఎక్కడికి కదిలేందుకులేదు. లేకపోతే హాయిగా మోహిని యింటికి వెళ్తే కాలక్షేపం బోల్డంత. ఈ యింట్లో ఒకరి కొకరికి సంబంధం ఉండదు. మోహినివాళ్ల అన్నయ్య అయితే తన ఫ్రెండ్స్‌తో యింట్లోనే ఎంజాయ్ చేస్తాడు. వానయినా, వరదయినా వీడు మాత్రం ఆ రెయిన్ కోటు తొడుక్కొనిపోతాడు. మగాడు కదూ, అదృష్టవంతుడు" అన్నగార్ని తలచుకోగానే, ఆ వెనకే వెళ్లిపోయిన రాజా మీదకు మళ్లాయి ఆలోచనలు.

"రాజా ... అసలు తనకి ఎంతో సరిపోతాడు అన్నివిధాల కాని ... తనంటే లెక్కలేదే. అందం లేకపోయినా, అహం మాత్రం ఎక్కువే ఉంది. ఈ జిడ్డు మొహందానికి అతనికీ సరిపోతుంది. వచ్చిన దగ్గరనుండి దాంతోనే కబుర్లు. ఆ కబుర్లు చెప్పినంతసేపూ ఎంత ఆరాధనగా చూస్తాడు దానివైపు. అసలు దాన్లో ఏముందని? కావలసినవాడు మోహన్‌బావ రానేరాడు. ఫ్రెండు రాజా మాత్రం ఠంచనుగా వచ్చేస్తాడు. వచ్చినదగ్గరనుండి ఏం కబుర్లు ... ఎంతసేపు పుస్తకాల గొడవ కవితల గొడవ ... యిది వ్రాసినవి అతను కరెక్టు చెయ్యడం అతను వ్రాసినవి దానికి వినిపించడం. అంతే. పోన్లే నాకెందుకు. ఈ సంవత్సరంతో బావ చదువు అయిపోతుంది. యింక వెళ్లిపోతాడు. ఈ లోగానే పెళ్ళిచేసుకునే టట్లు చూసుకోవాలి. అసలు మనిషే కనపడ్డు. యింకేమిటి? తనువెళ్లి కలుస్తే కోపం. అయినా ఇంజనీరింగ్ హాస్టల్‌కి వెళ్లాలంటే ... కాస్త భయంగా ఉంటుంది ... "

"నందూ... కాస్త ఆ రేడియో ఆపుతావా? తలనొప్పిగ ఉంది. వెధవ అరవగోల ఎందుకు?"

ఆరతి అన్న మాటలకు ఆలోచనాస్రవంతి నుండి బయటపడింది.

"ఏ గోలయితే నీకెందుకు? ఏం తోచి చావడంలేదు. ఏం చెయ్యమన్నావు? రేడియో వినే అధికారం లేదా? నిన్ను చదవడం మానెయ్యమంటే మానేస్తావా?" మొండిగా అంటున్న నందినిని విసుగ్గా చూసి అంతకు ముందు అక్కడ చదివి పెట్టుకొన్న 'నారాయణరావు' పుస్తకం తీసుకొని వంటింటి వెనుకనున్న వసారా వయిపు వెళ్లిపోయింది. వర్షపు జల్లుకి అదంతా తడిసిపోయింది. తుడుచుకొని ఓ మూలగ కూర్చుంది. చుట్టూ చూసింది. సన్న, సన్నగా చీకట్లు ముసురుకొంటున్నాయి. తోటంతా బురదగా ఉంది. నందివర్ధనం, తగరపూలు రాలిపోయి మట్టి కొట్టుకుపోయాయి. నీరు చిన్న పిల్లకాలువల్లా పారుతోంది. వర్షం తగ్గాక వీస్తున్న ఆ చల్లగాలిలో పూల వాసన మత్తెక్కిస్తుంటే... చీకటి ముసిరిన తోటను చూస్తూ యిక 'చదవడం పడదని' వెనక్కి వచ్చేసింది. గదిలో రేడియో యింకా ఎక్కువ సౌండ్‌తో ఎల్. ఆర్. ఈశ్వరి పాటను మ్రోగించేస్తోంది. ఏమీ తోచనిదాన్లా తల్లి దగ్గరకు నడిచింది ఏమన్నా సహాయం చేద్దామని. పరీక్షల ముందు తప్ప క్లాసు పుస్తకాలు చదవాలనిపించదు. చదవదు. అలాగని ఏ పరీక్ష సెకండు క్లాసుకి తక్కువ పాసు కాలేదు.

*   *   *   *

"సుగాత్రీ!" ఆ పిలుపుకి వెనక్కి తిరిగింది ఆరతి మట్టిచేతుల్ని వెనక్కి దాచుకొంటూ. గేటు తీసుకొని లోపలికి వస్తున్నాడు రాజా.

పైకి దోపిన చీరను, నడుంచుట్టు బిగించిన కొద్దిగ పక్కకు తొలగిన పైటను చూసుకొని చేతులు చూసుకొంటూ నిస్సహాయంగా చూసింది రాజావైపు. కొంటెగా నవ్వాడు దగ్గరగా వస్తూ. ఉడుక్కున్నట్లు వెంటనే ప్రక్కనున్న బకెట్‌లో చేతులు ముంచెయ్య బోయింది.


"ఆఁ...ఆఁ...ఆగు సుగాత్రీ, ఈ సహజ సౌందర్యరాసిని చూసి తరించే శాలీను డిక్కడుండగా, అదిఏమి బేలా?" అంటూ రంగంలోకొచ్చేసాడు.

"ఛీ...పో..." అంటూ మట్టిచేత్తోనే చీర దించేసింది.

ఆడది

అనురాగం కరువైపోయి అంతరాత్మ అలమటిస్తున్నా
అవయవాలకి విలువకట్టే పురుషుడి
అమానుషానికి దాసోహ మయిపోతున్నా
అన్యాయానికి తలవంచి
అయోమయం జగత్‌లో పయనిస్తున్నా
ఆశలు ఆకాశంలో తారల్లా మెరుస్తూంటే
ఆర్తిగా ముందుకు సాగిపోతూనే వుంది ఆడది!

— శ్రీమతి వ్యాయవతి కమలారాంజీ



జీవన సరళిలో తీయని రవళి

''అయిపోయింది. యింకేముంది ?'' 'హతోస్మి' అన్నట్లు అన్న రాజా చిలిపితనానికి ఒళ్ళంతా గగుర్పొడవగా వనకన్యలా నవ్వింది ఆరతి.

''ఈ చీరేమిటి పెద్ద ఆరిందాలా, అంత తొందరగా ఉందా అమ్మాయిగార్కి పెద్దరికం నెత్తిన వేసుకోవాలని !'' కళ్లల్లోకి చూస్తూ అడుగుతుంటే సిగ్గుపడి పోయింది. జవాబు చెప్పలేనట్లు మొక్కలకు పాదు చెయ్యడంలో దిగింది.

''రతీ...పచ్చని ఈ చెట్లమధ్య ఈ పసుపురంగు చీరలో చెదిరిన జుట్టుతో నీరెండలో మట్టిమరకలతో...ఎలా ఉన్నావో చెప్పనా ?'' మంద స్వరాన అంటూన్న రాజావైపు చూడలేనికళ్ళు భూమాత నాశ్రయించాయి కాని, వీనులవిందయిన ఆ తీయని పలుకుల కోసం వివశమైన మనసు, చెవులు ఆశగ నిరీక్షిస్తుండగా...

''హియర్...హియర్!'' అన్న నందిని చప్పట్లు ఈ లోకానికి లాక్కు వచ్చాయి. క్రిందకు దిగితే ఎక్కడ మట్టి అంటుకుంటుందో అన్నట్లు వరండాలో నిలబడింది నందిని. చక్కగ ముస్తాబయి ఉంది. ఆ నవ్వులోని హేళన ఆరతి మనసుని సూటిగ తాకింది. అదేం పట్టనట్లు రాజా తనపని తను చేస్తున్నాడు. ఒక్కసారి నందిని వంక చురచుర చూసి అతనికి సహాయం చెయ్యడంలో మునిగిపోయింది ఆరతి. అదిగో, ఆ లెఖ్ఖ లేని తనమంటేనే నందినికి ఒళ్లుమంట. ఉక్రోషంగా వంటింటి వైపు నడిచింది.

''అమ్మా ! ఇదేమన్నా అవుట్‌డోర్ షూటింగా, ఏమిటే? వాళ్లిద్దరూ చూడు తోటలో ఎవరన్నా చూస్తే ఏమన్నా అనుకొంటారని ఉండొద్దూ, గాడిదల్లా ఉన్నారు. యిలాంటి కొంపకి సంబంధాలేం వస్తాయి'' తల్లిమీద గయ్యిమని లేచింది.

తనకి కానట్లు సమాధానం చెప్పకుండా కూర తరుగుతూ ఉండి పోయిన తల్లిని చూసి గొణుక్కుంటూ ఆ కోపాన్నంతా నడకలో చూపిస్తూ ముందు గదిలోకొచ్చి గబగబ చెప్పులు వేసుకొని పైకి నడిచింది. మెట్లు దిగుతూ తోటలోకి చూసింది. రాజా పార పట్టుకొని కాలువ చేస్తుంటే ఆరతి బోదెలు కట్టి నీటిని మళ్లిస్తోంది. ఆ దృశ్యం అసూయను ఉసి గొల్పింది.

''ఆర్తి నేను మా ఫ్రెండింటికి వెళ్తున్నాను. అమ్మకి చెప్పు !'' అనేసి గేటు తీసుకొని వెళ్లిపోతున్న నందిని వంక చూసి ఆ చూపు రాజా వైపు త్రిప్పింది.

ఆ చూపుల్లోని వ్యధని అతను అర్థం చేసుకొన్నట్లు ఓదార్పుగా చూసాడు. ఆ ఓదార్పు కొంత స్వాంతనమివ్వగ తనను తాను సంభాళించు కొంటూ ...

''పరీక్ష లెప్పటినుండి ? సెలవులివ్వగానే వెళతావా ఊరు !'' అంది ఆరతి.

''ఆఁ వచ్చే నెలలో పరీక్షలయిపోతాయి. మరి సెలవుల్లో హాస్టలు మూసేస్తారుగా, అయినా యింటికి వెళ్లొద్దా ! నీకు ఈ నెలాఖరునుండే పరీక్షలు కాబోలు అమ్మాయిగారు చదవడం కనబడ్డంలేదు.''

''అబ్బాయిగారెప్పుడూ అమ్మాయిగారి చెంత ఉంటే చదువెలా అవుతుంది !'' అదే గొంతుతో వెక్కిరింతగా అంది ఆరతి.

''అది సరేగాని మా బావది ఈ ఏడాది ఫైనల్ యియర్ కదా ! అయిపోగానే వెళ్లిపోతాడేమో ! నీతో ఏమన్నా చెప్పాడా ?'' ఆశగా అంది.

''ఏం చెప్తాడు. అయినా తెలీనట్లు అడుగుతావేం ? మోహన్‌కే మాత్రం నందినిమీద సదభిప్రాయంలేదు. నువ్వొక్కర్తివే యింటి గురించి యింట్లో మనుష్యుల గురించి తపన పడిపోతావుగాని వాళ్లకేం పట్టదు. నందిని టూమచ్ ! ఐ డోంట్ లైక్ హర్ ! నేనేమిటి, పెళ్లిమీద గౌరవం ఉన్న ఏ మగాడు ఇష్టపడడు. ఐయామ్ సారీ ... సారీ ... రతి ... ఏదో అనేసాను. నీకు మీ అక్కకు అంత వైరుధ్యమైన భావాలు ఎలా వచ్చాయా, అని ఆశ్చర్యంగా ఉంటుంది !'' సర్దుకొంటూ అంటున్నది 'రాజా' కనుక మరేమి అనలేక అవమానంతో తల దించుకొంది.

''రాజా... నీకు తెలియనిది ఏముంది చెప్పు ? చిన్నపుడు ఎలా వుండేవాళ్లం... ప్చ్... నాన్నగారు అలా అయిపోవడం మరీ ఎవరిష్టం వాళ్లదయిపోయింది. ఇదంతా అమ్మ దురదృష్టం పాపం... పదలోపలికి'' అంటూ చేతులు కడుక్కొని లోపలికి నడిచింది.

ఆలోచిస్తూ ఆమె ననుసరించాడు. వీళ్లు లోపలికి రావడం చూసిన మాధవరావుగారు...

''రావోయ్! రా! కంపెనీ లేదని చూస్తున్నాను!'' అంటూ ఆహ్వానించారు. ఆయన్నలా చూస్తుంటే ఎవరు ఆయనకి 'మతి స్థిమితం లేదంటే' నమ్మరు. ఆయన చెప్పే మాటలు, చేసే చేష్టలు ఓపిగ్గా భరిస్తున్న రాజా, ఆరతి తెచ్చిన కాఫీ త్రాగి 'వస్తానండి' అంటూ మెల్లగా తప్పుకొన్నాడు. అంతలోనే ఎవరెవర్నో తిట్టడం ప్రారంభించారు ఆయన. హారతి వెనుక గదిలోకి వచ్చిన రాజా ''రతి! మరి నేను వెళ్తాను. రేపు, ఎల్లుండి రావడం పడదు. అందుకని యిపుడొచ్చాను. యివ్వన్నీ ఓ ప్రక్కకునెట్టి చదవకపోతే ఎలా? వాళ్లలా నువ్వు కాస్త స్వార్థం నేర్చుకోకపోతే మనపని గోవిందా?'' నవ్వుతూ అన్నాడు.

''ఏమిటో రాజా! ఈ యిల్లు, ఈ నుమష్యులు, ఈ వాతావరణం చూస్తుంటే అసలు దేనిమీద మనసుపోదు. నీ మీద ఆశ ఒక్కటే నాకు భవిష్యత్తును అందంగా చూపిస్తుంది. అందుకే నీ కోసమైనా చదువుతాను.'' తనలో తాను అనుకొంటున్నట్లు స్థిరంగా అంటున్న ఆరతి చెయ్యి నొక్కి వదిలేసాడు. ఆ స్పర్శలో ఎన్నో సందేశాలు, ఎంతో ధైర్యం ఆరతి నరనరాన ప్రవహించి ఉత్తేజితురాల్ని చేసినయ్.

''వస్తాను.'' మృదువుగా ఉన్న ఆ గొంతువిని నెమ్మదిగ కళ్లెత్తింది. ఆ కళ్లల్లో కోటి ఛాయలు చదువుకోగలిగిన రాజా కళ్లు ఎపుడు సమాధానాలు సిద్ధం చేసుకొనే ఉంటాయి. మరోసారి చెప్పి ''అత్తయ్యగారు! నేను వెళ్లొస్తానండి.'' అంటూ వంటింటి గుమ్మం దగ్గరకొచ్చి చెప్తున్న రాజాని చూసి.

''భోంచేసి వెళ్లిపోదువుగాని ఉండు బాబు వంటకూడా అయిపోవచ్చింది.'' అంది భైరవి.

''లేదండి మెస్‌లో భోజనం చేస్తాను. వస్తాను'' అంటూ వెనుదిరిగిన అతను భైరవి మాటలకు మళ్లీ యిటు తిరిగాడు.

''బాబూ, మామోహన్ ఏమంటున్నాడు? ఏమిటో 'ఆ మేనమామ యిలా అయిపోయి సంసారం యిలా అయిపోయింది కదా' అన్న బాధ ఏ కోశానాలేదు. అస్సలు కనబడనే కనబడడు. అసలింతకీ వాళ్లమ్మకొకటి ఉంటే కదూ 'అన్నయ్య' 'అన్నకూతురు' అని. ఇదంతా నా దురదృష్టం నాయనా! బాగున్నన్నాళ్లు అంతాదగ్గర వాళ్ళే! ఇపుడు కనీసం 'ఎలా ఉన్నారని?' ఓ కార్డుముక్క వ్రాసేవాళ్ళేలేరు. ఈయనేదో సంపాదించి దాచిపెట్టారని వాళ్ళ ఊహ...చూసావుగా ఎలా అయిపోయిందీ. యింకేముంది? ఏదో దానికి ''పెళ్ళి'' అంటూ చేసేస్తే వాడెలాపోయినా నాకు బాధలేదు. ఆర్తికి నీవున్నావని నమ్మకం ఉంది. పోనీ మరో కుర్రాడెవరన్నా ఉంటే చూడు బాబు, ఉన్నదేదో ఊడ్చి దానికి ఆ శుభకార్యం జరిపించేస్తే దాని గొడవ వదిలిపోతుంది. అస్సలు మాటంటే లక్ష్యంలేదు. చూస్తున్నావుగా ఆ తిరుగుళ్లు, ఎపుడు, ఏం కొంపమీదకి తెస్తుందోనని భయంతో నాకు ఆ కాస్త నిద్రకూడా దూరమైపోతుంది!'' కళ్లు వత్తుకొంటు అంటుంటే ... ఏమనాలో అర్థంకాని వాడిలా తలవంచుకొని వింటూ ఉండిపోయాడు. ప్రక్కనే స్తంభాన్నానుకొని ఆరతి నిలబడింది. తల్లి అతనితో యివ్వన్నీ వచ్చినపుడంతా ఏకరువు పెట్టడం నచ్చని దానిలా కాలి బొటనవ్రేలితో నేలమీద గీస్తూ పెదవి బిగబెట్టింది. ''కానీ తప్పదు. తనకు, అమ్మకు, మనసు విప్పి చెప్పుకొందుకీ ఒక్కమనిషే ఉన్నాడు. అతడేమన్నా అనుకోని ... తమ గుండెల బరువు కొద్దిగానన్నా తీర్చుకోకపోతే భరించలేరు'' అనుకొంటూ ... అతనివైపు క్షమించమన్నట్లు చూసింది.

''అలాగేనండి ... వస్తాను. మీరేం బాధపడకండి!'' అంటూ ఆరతికి సైగచేసి వెనుదిరిగాడు.

''పిల్లా! నీకు అందమైన కళ్లు యిచ్చింది, కళ్లల్లో అందమైన కవ్వింతలు, తీయని భావాలు వ్యక్తం చెయ్యమని...అంతేగాని, మూగదానిలా క్షమాపణలు వేడికోళ్లు, కళ్లతో చెప్పమనికాదు. అయినా నేనేం పరాయివాడినా క్షమాపణలు చెప్తున్నావు!'' నెత్తిమీద చిన్నగా కొడుతూ అన్నాడు.

''నేనా! అసలు నోరైనా మెదిపానా?'' ఆరతి కళ్లల్లో కొంటెతనం మెరిసింది.

స్వాగత సూక్తము

— అయ్యగారి వరపింహమూర్తి

రాగరంజిత నేత్రాల క్రాలుచుంట
పెద్దలిడి నారు రక్తాక్షి పేరు నీకు
ఏలుబడిసేయ నొకయేడు నేలకిపుడు
ఏగుదెంచిన నీకిదే స్వాగతంబు.

స్త్రీలు ధీరులు ధారుణి నేల జాలు
వారు చతురమతులు—శీలవతులు:— వారె
పెచ్చు పెరిగిర విచ్చిన చిచ్చుబుడ్లు
హరిహరాదులు నొకట్లైన నడ్డలేరు
వారి నంచును ప్రకటింపు గౌరవమున.

కనుల నైఅదనము గళమున పంచమ
స్వనము నుంచి యేల చాన మేలు
మాట—మంచి అనుము—మినుము చేత నవలీల నవనిని
కాచి ప్రోచుమమ్మ ఘనత కలుగు.

సంతసము నించెదు పికవసంతుల వలె
అవనిజనముల మనములు అలరునట్లు
ఆర్తిపోకార్చి జగతిని కీర్తి నించి
ఏలుమానేల నొకయేడు హేలతోడ.

ఏబదెనిమిది [58] యేడుల నెనఁగు నీవు
పదవి విరమణ చేసేడు ప్రాయమనుచు
ఉజ్జగింపక పాలన నొజ్జబంతి
వగుచు నేలగా వలెనేల సొగసు మీది.

చేత చిక్కిన పదవికి ఖ్యాతి వచ్చు
తెరువు నారసిజనముల కరవు వాపి
నేల నేలిన చాలదే? ఐకువముగ
బ్రతుకు చరితార్థమగు వేతె భాగ్యమేల!

''అదేనమ్మోయ్... నోరు మెదపవనేగా చెప్తుంది. ఈకళ్లెపుడూ యిలా కొంటెదనంతో మెరుస్తుంటేనే నా కిష్టం.'' అంటూ కళ్లల్లోకి తనివితీరనట్లు చూసాడు.

''యిక యిలా చూస్తూ కూర్చుంటే, నాకూ భోజనం ఉండదు. 'వెళ్తాను' 'వెళ్తా'ననడమేగాని వెళ్లడం కనబడదు!'' చిరుకోపంగా అంటూంటే...

''సరే వెంటనే వెళ్లిపోతున్నాను చూడు. రెండు రోజులు కనపడను మరి!'' బెదిరిస్తూనే మెట్లు దిగాడు. అతను రోడ్డు మలుపు తిరిగినంత వరకూ చూస్తూ నవ్వుకొంటూ వెనుదిరిగింది.


* * * *

ఆరతిని గురించిన ఆలోచనలు రూమ్‌కి వెళ్లేవరకు సాయం వచ్చాయి. భోజనం చేసి మంచం మీద వాలాడు. ఆ రోజు ఆదివారం. మర్నాడు వర్క్ బోర్డు చూసుకోవలసింది ఉంది. కానీ ఏ పనిమీదా మనసు పోవడంలేదు. భైరవి రూపం, మాటలు కళ్లముందు కదిలి అతనికి తెలిసిన 'వాళ్ల' గతం, చిన్నతనం సినిమా రీలులా తిరగసాగింది.

(ఇంకా వుంది)

అతీంద్రియ శక్తులు అధ్యయనం చేసిన అబ్రహాం లింకన్

అమెరికా అధ్యక్షుడిగానూ, నీగ్రోలను బానిసత్వం నుంచి విముక్తి పొందించడానికి కృషి చేసిన మహావ్యక్తిగానూ కీర్తిగాంచిన అబ్రహాం లింకన్‌కు అతీంద్రియ మనోవిజ్ఞాన శాస్త్రంపై ఎంతో ఆసక్తి కలదనీ, ఆయన ఎన్నో ప్రయోగాలు చేసే వారనీ చాలామందికి తెలిసి ఉండక పోవచ్చు. ప్రతీవ్యక్తిలోనూ పంచేంద్రియాలతో బాటు మరొక అదృశ్యమైన అతీంద్రియ శక్తి అంతర్లీనంగా ఉందనీ, దానిని పూర్తిగా వినియోగించుకున్న నాడు మనిషి ఎన్నో మహత్కార్యాలు చేయవచ్చునని ఆయన గాఢంగా విశ్వసించేవారు.



లింకన్‌కి చిన్నతనం నుంచీ చనిపోయే వరకు ''ప్రీకాగ్నిషన్'' శక్తి ఎక్కువగా ఉండేది. అంటే భవిష్యత్తులో జరగబోయే సంఘటనలు, ప్రమాదాలూ ముందుగానే స్వప్నం ద్వారా తెలుసుకోవటం. తన చిన్నతనంలో తమ బంధువుల రాకపోకల గురించి, మరణాల గురించి, ప్రమాదాల గురించి ముందుగానే స్వప్నంలో చూసి మర్నాటి ఉదయం అందరికీ చెప్పేవాడు. ఆ సమయంలో వారంతా సరదాకి చెప్తున్నాడు అని అనుకునేవారు, తీరా అది నిజమయ్యేసరికి ముక్కున వేలేసుకునే వారు. మొదట్లో ఒకటి రెండు సంఘటనలు యాదృచ్ఛికంగా జరిగి ఉండవచ్చు అని అనుకున్నా రాను రాను ప్రతీ విషయంలోను అతను చెప్పిందే ఖచ్చితంగా జరగడం గమనించిన స్నేహితులు, బంధువులు లింకన్‌కి ఏదో తెలియని శక్తి ఉందని అంగీకరించారు. లింకన్ తనకు రాత్రి వచ్చిన కలల గురించి ఉదయమే తన స్నేహితులందరికీ చెప్తూ ఉండటం ఒక దిన చర్యగా పెట్టుకున్నాడు.

ఎంతో మందికి, ఎన్నో విషయాలు ముందుగానే చెప్పి హెచ్చరించిన లింకన్, చివరకు తన మృత్యువును కూడా ముందే కనుగొన గలిగాడు. ఆయన అమెరికా అధ్యక్షుడు అయిన తరువాత కూడా తన కలలను అతని సెక్రటరీకి, ఇతర ముఖ్య స్నేహితులకు తెలిపేవాడు. మరికొన్ని రోజులలో లింకన్‌ని హత్య చేస్తారనగా అతను ఒక కలకన్నాడు. అందులో వైట్‌హౌస్ భవనంలో అతను తిరుగుతూ ఉన్నాడు. ఇంతలో తూర్పువైపుగా ఉన్న ఒకగదిలో ఒకశవంచుట్టూ జనం ఏడుస్తున్నట్లుగా కనపడింది. లింకన్ అక్కడికి వెళ్ళి ఆ శవం ఎవరిది అని అడిగాడు. అక్కడున్నవారు ఆ శవంపై గుడ్డను తొలగించి చూపగానే లింకన్ హుతాశుడయ్యాడు. ఆ శవం మరింకెవరిదోకాదు. తనదే. అదిచూసి ఉలిక్కిపడి లేచికూర్చున్నాడు. తరువాత సెక్రటరీని, ఇతర కాబినెట్ మినిష్టర్లను పిలిపించి తన కల గురించి వివరించాడు. వారంతా ఇది అంతగా పట్టించుకోవలసిన విషయంకాదనీ మర్చిపోయి హాయిగా నిద్రపొమ్మని సలహా ఇచ్చారు. కానీ లింకన్‌కు మాత్రం తన చావు దగ్గర పడిందని బాగా నమ్మకం కలిగింది. కొన్ని రోజులకే లింకన్ దారుణంగా హత్య చేయబడ్డాడు.

తాను అధ్యక్షుడిగా ఉన్న కాలంలో, అతీంద్రియశాస్త్ర విజ్ఞానమంటే ఆసక్తి ఉన్నవారితోనూ, ఆ విద్యను అధ్యయనం చేస్తున్న వారితోనూ ఎన్నో చర్చలు సలిపి ఎంతోమందికి ప్రత్యక్షంగానూ, పరోక్షంగాను తగిన సహాయం చేసేవారు. వారు నిర్వహించిన పరిశోధనలలో తనకు వీలుపడినపుడల్లా పాల్గొని, ఈ విద్య అభివృద్ధి చెందడానికి, ప్రచారం రావడానికి యథాశక్తిగా పాటుపడ్డారు.

అమెరికాలో లింకన్ సాధించిన ప్రతి

విజయాన్ని ముందుగా అతను స్వప్నంలో చూసాడు. అంతేకాదు తాను చవిచూసిన చేదు అనుభవాలు కూడా ముందుగానే కలలో చూడ గలిగాడు. చేదు అనుభవాలు, అపజయాలు గురించి కల వచ్చినపుడు, అవి తన భార్యకు మాత్రమే చెప్పి రహస్యంగా ఉంచమనేవాడు. తరువాత కొన్నాళ్ళకు ఖచ్చితంగా అతను చెప్పినట్లుగానే అన్నీ జరిగేవి.

అబ్రహాం లింకన్ అభిప్రాయం ప్రకారం కలలు కల్లలు కావు. ప్రతీ కలకూ ఒక అర్థం ఉండితీరుతుంది. వ్యక్తి యొక్క మానసిక, నైసర్గిక పరిస్థితులనుబట్టి కలలు వస్తాయి. ప్రతీకలను గుర్తుపెట్టుకుని విశ్లేషించి చూస్తే తప్పక దాని అంతరార్థం బయట పడుతుంది అని ఆయన విశ్వాసం. తన డైరీలో ప్రతీరోజు కలల గురించి కనీసం పావుపేజీ రాసేవారు.

అతీంద్రియ విజ్ఞానం అభివృద్ధికి పాటు పడిన అబ్రహాంలింకన్ గురించి ఈనాటి కొందరు ప్రముఖులు అధ్యయనం చేసారు. వారిలో బహుకొద్ది మంది లింకన్ మరణించినా అతని ఆత్మ వైట్ హౌస్ చుట్టూ తిరుగుతూందనీ, ఆ ఆత్మ ప్రెసిడెంటు కెన్నెడీని కూడా ఆవహించిందనీ దానికి తార్కాణాలు ఉన్నాయనీ ఈ క్రింది 10 విషయాలు తెలిపారు.

అద్భుత వ్యక్తులు

బి.వి. పట్టాభిరామ్
మెజీషియన్—హిప్నాటిస్ట్

1. లింకన్ 1860లో అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. కెన్నెడీ సరిగ్గా వంద సంవత్సరాల తరువాత అంటే 1960లో అధ్యక్షుడయ్యారు.
2. ఇద్దరు కూడా నీగ్రోల హక్కులకై కృషి చేసారు.
3. ఇద్దరూ కూడా శుక్రవారం నాడే హత్య చేయబడ్డారు.
4. ఇద్దరూ భార్యలు పక్కన ఉండగా హత్యగావింపబడ్డారు.
5. ఇద్దరికీ బులెట్ తల వెనుకనుంచే వచ్చి గాయపరిచింది.
6. ఇద్దరూ వైట్ హౌస్‌లో ఉండగానే ఒక్కొక్క కొడుకును పోగొట్టుకున్నారు.
7. ఇద్దర్నీ చంపిన హంతకులు కోర్టుకు వెళ్ళకుండానే హత్య చేయబడ్డారు. వాళ్ళలో ఒకరు 1839లోనూ మరొకరు 1939లో జన్మించారు.
8. ఇద్దరి వద్దా వైస్ ప్రెసిడెంట్లుగా ఉన్నవారే ప్రెసిడెంట్లు అయ్యారు. ఇద్దరి పేర్లూ జాన్‌సనే. వారిలో ఒకరు 1808లోను మరొకరు 1908లోను జన్మించారు.
9. లింకన్, కెన్నెడీ ఇద్దరి పేర్లలోనూ ఏడు అక్షరాలే ఉన్నాయి.
10. లింకన్ సెక్రటరీపేరు కెన్నెడీ. కెన్నెడీ సెక్రటరీ పేరు లింకన్. ఇద్దర్నీ కూడా సెక్రటరీలు, హత్య జరిగిన రోజున బయటకు వెళ్ళవద్దని కోరారు.

ఆత్మ ఉన్నదా? లేదా అనే విషయం ఎలా ఉన్నా ఈ పై విషయాలు చూస్తే మాత్రం అన్నీ యాదృచ్ఛికం అని కొట్టి పడేయటానికి వీలు లేదనిపిస్తోంది. మరయితే అదేంటి? అనేది మాత్రం ఇంకా పరిశోధిస్తున్నారు. ★

(పైవారం :
ప్రేక్షకుల కోపం ప్రాణాలతో
చెలగాటమాడిన చంగ్ లింగ్ సూ)

సీరియల్

ఈ రాగానికదే తాళం

చక్కిలం విజయలక్ష్మి

30

(గత సంచిక తరువాయి)

మూడు రోజులు గడిచిపోయాయి.

లక్ష్మీదేవమ్మ వండిపెడ్తోంది. పనికుర్రాడు రాము పైపనులు చూస్తున్నాడు. జయంతికి ఇదంతా ఏమిటో అర్థంకాక అయోమయంగా వున్నా లక్ష్మీదేవమ్మ పెట్టింది తిని మామితో కబుర్లతో పొద్దుపుచ్చుతోంది. ఒంటరిగావుంటే హైదరాబాదులోని రఘునాథరావుగారి ఇల్లు, ఆ ఇంట్లోని మనుషులు, వాళ్లతో అనుబంధాలు, అనుభవాలు, హరి ... హరి ... అంతే జయంతి పరుగున వెళ్లి సరస్వతి మెడ కావులించుకుని "మామీ. ఏమైనా కబుర్లు చెప్పవూ ?" అంటూ గోముగా అడుగుతుంది. పనిచేయాలన్నా ఏ పనీ లేదు. లక్ష్మీదేవమ్మ పనిలో వేలుకూడా పెట్టనివ్వదు. రాము సరేసరి. ఈ విషయం చికాకుగా వున్నా మొదటి మూడు రోజులూ జయంతి అంతగా పట్టించుకోలేదు. నాలుగో రోజు ఇక ఆగలేకపోయింది జయంతి.

అసలు వీళ్లిద్దరూ ఎవరు ? తనకెందుకు సేవలు చేస్తున్నారు ? ఈ ఇల్లు తన కోసం బాబాయ్ ఎందుకు ఖాళీ చేయించినట్టు ? తనేం చేస్తుందని, ఏం చేయబోతోందని, ఈ ఇంటికి అద్దె ఎలా కడ్తుందని, ఎలా జరుగుబాటవుతుందని బాబాయ్ అడగరేం ? తను అడగబోతే తప్పించుకున్నట్టుగా మరో మాట తెస్తారు !

ఆ రోజు నిలదీసి అడిగింది జయంతి.

నిట్టూర్చాడాయన.

"సరే. ఎప్పుడైనా చెప్పక తప్పదుకదా. కానీ నేను చెప్పడానికేమీలేదు. ఈ ఉత్తరం చదివితే బహుశా నీకంతా తెలియవచ్చు" అంటూ సీలు చేసిన ఓ పొడుగాటి బరువైన కవరు అందించాడు సుబ్రమణ్యయ్యర్.

జయంతి అందుకుని ఓపన్ చేసింది.

లోపలేదో దస్తావేజులతోపాటు ఓ సుదీర్ఘమైన ఉత్తరం వుంది.

ఉత్తరం చదవసాగింది జయంతి.

అమ్మా జయంతీ,

నీవు తమిళ దేశానికి బయలుదేరుతున్నావు. దీనివల్ల హరితో నీ వివాహాన్ని ఆటంకపరచి నిన్ను దూరంగా పంపిస్తూ నేను గెలిచానో, హరిని చేసుకోలేకపోయినా నేను వేరే వాళ్లతో చేయాలనుకునే వివాహాన్ని కాలదన్ని వెళ్లిపోతూ నీవే గెలిచావో నాకు తెలియదు. కానీ నీవిలా వెళ్లటం నా గుండెల్లో చాలా రంపపుకోతగా వుంది. అయితే ఒక అంధుడి భార్యవై కలిగించేతగా మాత్రం కాదు. అందుకే నిన్ను వెళ్లిపోనిస్తున్నాను. ఎప్పటికైనా నీ మనసు మారి మనూనో, మరొకరినో చేసుకోవడానికి అంగీకరిస్తూ నీవు తిరిగి వస్తావనే ఆశను గుండెల్లో పదిలపరుచుకుని మరీ వెళ్లిపోనిస్తున్నాను.

నీవు ఆస్తిపాస్తులు అక్కర్లేదని ఖండితంగా తిరస్కరించావు. నీ పట్టుదల, నిస్వార్థం నాకు తెలుసు. అందుకే ఆస్తి మొత్తం కాకుండా ఆస్తిలో మూడవ వంతు నీ పేర రాసి దాని తాలూకు దస్తావేజులన్నీ పంపుతున్నాను. అప్పుడు మీరెలా బ్రతికారో నాకు తెలీదు. తెలిసి ఇప్పుడు నిన్ను అనాథగా, నిరుపేదగా బ్రతకనివ్వటం నాకు ధర్మంకాదు. నేనంగీకరించను కూడా. ఈ మూడవ వంతు ఆస్తినైనా నీవు తీసుకోకపోతే మిగిలిన నా ఆస్తిపాస్తులన్నీ ఏ మఠానికో రాసేసి నేను, నా కుటుంబంతో ఎక్కడికైనా వెళ్ళిపోతాను.

పోతే సుబ్రమణ్యయ్యర్ నేను అక్కడకు వచ్చినప్పుడు శివం ఆప్తమిత్రుడిగా, మీ ఇంటి ఓనర్‌గా నాకు బాగానే పరిచయమయ్యారు. అన్ని విషయాలూ ఆయనకు ఉత్తరం రాశాను. ఇకమీద అక్కడ నీ మంచిచెడ్డలన్నీ ఆయనే చూస్తారు. ఆయనకెటూ నీమీద వాత్సల్యముంది.

రాము నౌకరు కుర్రాడు. వాడికి తమిళం, తెలుగు వచ్చు. నమ్మకస్తుడు. వాణ్ణి తీసివేయకు. లక్ష్మీదేవమ్మతో పాటు వాణ్ణి నేనే పంపాను.

లక్ష్మీదేవమ్మ మా దూరపు చుట్టం. ఈ మధ్యనే భర్తపోయి నిరాశా నిస్పృహలతో కృంగిపోయివుంది. పిల్లల్లేరు. ఎక్కడున్నా అడిగేవారు లేరు. నీవంటి సౌమ్యురాలి కంపెనీ ఆమెకు కొంత మనశ్శాంతి నివ్వవచ్చు. వంట బాగా చేస్తుంది. ఆమెకు తమిళంరాదు. చురుకైన మనిషి కాబట్టి నీవు త్వరగానే నేర్పుకోవచ్చు.

ఇది నీవు వెళ్లినట్టో, నేనే పంపినట్టో తెలీకుండా వుంది. కానీ నీ వెప్పుడు రావాలనుకుంటే ఆ క్షణంలోనే బయలుదేరి రావచ్చు. నీవు వరసకు కోడలివయినా మా కన్నకూతురితో సమానం. కూతురికి తండ్రి ఇంట ఎప్పుడూ స్థానం ఉంటుంది, ఆమె రావాలేగానీ.

సదా నీ శుభాన్ని కాంక్షిస్తూ,

మీ మామయ్య.

జయంతి కళ్ళలోంచి కన్నీరు జారింది. "మామయ్యా లక్ష్మీదేవమ్మ గారికి నా కంపెనీ అవసరమా ! నాకు తెలుసు మామయ్యా నాకు తెలుసు. మీ ఋణం ఎన్ని జన్మలకూ తీర్చుకోలేను' అనుకుంది భక్తిగా.

"మీ మామయ్య నాకు అక్కడి విషయాలన్నీ ఉత్తరం రాశారమ్మా. నీవు రాకముందే రామును, లక్ష్మీదేవమ్మను పంపుతూ వాళ్లతో ఉత్తరాలు పంపారు. నీ మూడ్ ఎలా వుంటుందో, రాగానే ఎందుకు లెమ్మనీ, నీ మనసు కాస్త కుదుటపడనీ అనీ ఆగాను. మీ మామయ్య నీ ఉత్తరంలో ఏం రాశారో నాకు తెలీదు. కానీ

జరిగిన కథ—10 : గీతతో బజారుకెళ్లిన జయంతిని పద్మిని అవమానిస్తుంది. గీత బర్త్‌డే రోజు జయంతి పాడిన పాట విన్న సుమిత్రమ్మ జయంతిని సంగీతం మాస్టారు దగ్గర సంగీతం నేర్చుకోమని చెపుతుంది. జయంతి తనకిపుడు సంగీతంమీద ఆసక్తి లేదని చెపుతుంది. కారు యాక్సిడెంట్‌లో పద్మిని మరణిస్తుంది; హరికి కళ్లు పోతాయి. యాక్సిడెంటులో గాయాలయిన మన్‌మోహన్‌కు తన రక్తం ఇస్తుంది జయంతి. జయంతి వ్యక్తిత్వం మన్‌మోహన్‌ను ఆకర్షిస్తుంది. జయంతి హరి సేవలలో కాలం గడుపుతూ ఉంటుంది. గీతను చూడవచ్చిన పెళ్లివారు వాళ్ల అబ్బాయికి జయంతి నచ్చినట్లు రఘునాథరావుకి ఉత్తరం రాస్తారు. జయంతి కథకు మొదటి బహుమతి వచ్చింది ఆమెను చూడను ఆమె అభిమానులు వచ్చారు. జ్వరం వచ్చి పడుకున్న జయంతిని మన్‌మోహన్ కిటికీలోంచి చూసాడు. మర్నాడు ఆ కిటికీ మూసి ఉండటం గమనిస్తాడు మన్‌మోహన్. జయంతి మన్‌మోహన్ ప్రేమను తిరస్కరిస్తుంది. జయంతి వివాహ ప్రసక్తి తెచ్చిన సుమిత్రమ్మతో తను హరి బావను పెళ్లి చేసుకుంటానని చెపుతుంది. ఆ వార్త విని జయంతిపై మండిపడతారు రఘునాథరావుగారు. రఘునాథరావు జయంతికి ఆమె చిన్ననాడు జరిగిన సంగతులు చెప్పి ఇప్పుడు తాము అనుభవిస్తున్న ఆస్తికి జయంతే వారసురాలు అని చెపుతారు. ఎవరెన్ని చెప్పినా జయంతి తన మనస్సును హరి ఆకర్షణనుంచి మరల్చలేకపోతుంది. ఆమె ఆ ఇంటిని వదిలి వెళ్లడానికి నిశ్చయించుకుంటుంది. జయంతి తన తండ్రితో గడిపిన గ్రామానికి వెళుతుంది. అక్కడ సుబ్రమణ్యర్ దంపతులు ఆమెను చక్కగా ఆదరిస్తారు.

ఆయన నీ శ్రేయోభిలాషి అన్నది మాత్రం నిజం. వివాహం విషయం ఏమైనా కనీసం ఆయన చేసిన ఈ ఏర్పాట్లనైనా నీవు అంగీకరించి తీరాలి. ఈ కాలంలో ఏమున్నా లేకపోయినా డబ్బు వుండాలి. ఆ తర్వాత అయినవాళ్ల అండదండలుండాలి. నీవు చూస్తే వయసులోవున్న పిల్లవు. నీ కివన్నీ ఆసరా లేకపోతే ఈ పాపిష్టి లోకం నిన్ను బతకనివ్వదు. అందువల్ల...''

''సరే. సరే బాబాయ్'' అంది జయంతి చిన్నగా నవ్వుతూ.

31

కాలచక్రం నెల రోజులు ముందుకు సాగిపోయింది. జయంతి మనసు మాత్రం దానితో పాటు ముందుకు కదలకుండా రాటకు కట్టేసిన లేగదూడలా నెల వెనకటి కాలం దగ్గరే గింజుకుంటోంది. దారానికి పట్టిన పూల పరిమళంలా జయంతి మనసును హరి స్మృతులు వీడిపోవటం లేదు. తను లేకపోతే హరికి వెలుగే లేదనుకుంది. తను లేక క్షణం బ్రతంలేడనుకుంది. ఆ అసౌకర్యం, అశాంతి భరించలేక హరి దిగి వస్తాడనుకుంది. ఆత్మ నిగ్రహం సడలి తన ఆకాంక్షను మన్నిస్తాడనుకుంది. వెంటనే రమ్మని ఉత్తరం రాస్తాడనుకుంది. ఊహూ ! అలాంటిదేమీ జరగలేదు. ఎవరూ తన ఊసే ఎత్తుతున్నట్లు లేదు! అందరూ తనను మరచిపోయారు.

వుక్రోషంతో పూర్వులు అధికమయ్యాయి జయంతికి. ముఖం ఎర్రబడింది. కానీ అది ఒక్క నిముషమే. అంతలోనే ఆమె వాస్తవానికి దగ్గరగా వెళ్లింది.

తనను మరచిపోవటమేమిటి ? కాదు కాదు ఇది తనతో హరిని మరపించే ప్రయత్నం. పసిబిడ్డకు తాయిలాన్ని మరపించినట్లు...! జయంతికి కోపం వచ్చింది. నిరాశా ఆవరించింది.

ప్రేమ అనేది మోజు కాదు తీరిపోవడానికి. తాయిలం కాదు మరచిపోవడానికి. ఇది వాళ్లకెలా అర్థమయ్యేలా చెప్పేది ?

అంతలో సుబ్రమణ్యయ్యర్ వచ్చాడు.

''పౌల్ట్రీకి వెళ్తున్నాను. వస్తావా అమ్మా'' అన్నాడు.

''వస్తానువద బాబాయ్'' అంటూ లేచింది జయంతి.

ఇద్దరూ ఫర్లాంగు దూరంలో వున్న పౌల్ట్రీ చేరుకున్నారు. అక్కడ పెద్ద పెద్ద షెడ్లు వేసి వున్నాయి. వాటిల్లో కోళ్ళు కేవలం తినడానికే పుట్టినట్లుగా క్షణం తీరికలేకుండా ముక్కులతో పొడుచుకుని తింటున్నాయి. తెల్లగా, ఎర్రని జుట్టుతో ఎంతో అందంగా వున్నాయి. పరిశుభ్రత పాటించడంవల్ల ఆ పరిసరాలు కోళ్లతో ఎంతో ఆహ్లాదకరంగా వున్నాయి. ఇద్దరూ పిచ్చా పాటీ మాట్లాడుతున్నారు. కోళ్లకు మేతవేస్తూ అన్నాడు సుబ్రమణ్యయ్యర్



ఈరాగాని కదే తాళం

''డబ్బు లేనివాళ్లు లేక బాధపడ్తూ వుంటారు. సిరి తలకింద పెట్టుకు దరిద్రానికి ఏడ్చినట్లు అంత డబ్బు వుండీ నీవింత సాధారణ జీవితం గడపడం నాకేమీ బాగాలేదు జయంతీ. దాచి ఎవరికిద్దామని? దేనికైనా సద్వినియోగం వుండాలి...''

''నేనూ అదే ఆలోచిస్తున్నాను బాబాయ్'' అంది జయంతి.

''ఔనమ్మా. ఆలోచించు. చిన్నపిల్లవు. ఇప్పుడు కాకపోతే ఎప్పుడు అనుభవించాలి? మంచి ఇల్లు కట్టించుకుని, సామాన్లు కొనుక్కో. నీకు తోటలు, మొక్కలు ఇష్టం కదా? ద్రాక్ష తోటలో మరోటో వేయి. ఈ వ్యాపకాలలో పడి నీ మనసు కాస్త కుదుటపడితే నెమ్మదిగా వివాహం...''

''బాబాయ్''

''సరే ఆ విషయం నీకే వదిలేస్తాను. ఇంతకు ఏదో ఒకటి చెయ్. ఎన్నాళ్లిలా ఏదీ పట్టకుండా, పట్టించుకోకుండా యోగినిలా గడుపుతావ్? నెలరోజులయింది. వచ్చినరోజెలా వున్నావో ఈరోజూ అలాగే వున్నావు. నాలుగు రోజులు విశేషాలైనా మాట్లాడావు. తర్వాత అదీ లేదు. అక్కడేదో కథలూ అవీ రాసేదానివట. మరిప్పుడవేమీ లేదు. ఇప్పుడేమంత కొంప మునిగి పోయిందని? ఏదో ఒకటి చెయ్.''

''చేస్తాను బాబాయ్. తప్పకుండా చేస్తాను.''

''ప్రేమఅనేది మోజు కాదు తీరిపోవడానికి. తాయిలంకాదు మరచిపోవడానికి ఇది వాళ్లకెలా అర్థమయ్యేలా చెప్పేది?'' తన ఆలోచన గుర్తు వచ్చింది జయంతికి.

'చెప్తాను, అర్థమయ్యేలా చెప్తాను' అనుకుంది దృఢంగా.

పత్రికలలో ఆ విషయం చదివి ఆ కుటుంబం యావత్తూ నిర్విణ్ణమయింది.

జయంతి ... జయంతి ఇంతపని చేసిందా?

సుమిత్రమ్మముఖాన కత్తివాటుకు నెత్తురు చుక్క లేకుండా పోయింది. ఆశ్చర్యం ఆమె నరనరానా పాకి నిశ్చలం చేసింది.


తల్లీ తండ్రీ కూడా లేని ఓ నిరుపేద ఆడపిల్ల, మారుమూల కుగ్రామంలో పెరిగి పెద్దదైన ఓ సాధారణ విద్యావంతురాలు, కృత్రిమమైన సుఖభోగాలకు అత్యంత సులభంగా ఆకర్షితురాలయ్యే వయసులో వున్న యువతి ఇంత అనూహ్యమైన, ఉదాత్తమైన నిర్ణయం తీసుకుని ఆచరణలో పెట్టటమా !!!

కానీ రఘునాథరావుగారి పెదిమల మీద మాత్రం చిరునవ్వు విరిసింది. పురుషుడైన ఆయనకు జయంతితో అంత సాన్నిహిత్యం లేక పోయినా జయంతి అంటే ఏమిటో ఆయనకు తెలిసినంతగా ఎవరికీ తెలీదు. జయంతి ఈ పని చేయటం ఆయనకేమీ ఆశ్చర్యాన్ని కలిగించలేదు. జయంతి లాంటి సామాన్యమైన అమ్మాయే ఇలాంటి పని చేయగలదు. ఇలాంటి పని చేయ గలిగిన వాళ్లే సామాన్యంగా కనిపించేది. 'అయాం ప్రవుడాఫ్ యూ మై బేబీ' అనుకున్నారాయన.

గీత సంతోషించాలో బాధపడాలో తెలీక వెంటనే చిన్నన్నగారికి ఉత్తరం రాసి పడేసింది.

జయంతి వెళ్లిపోయాక జయంతే తన భావనా ప్రపంచంగా బ్రతుకుతూన్న శ్రీహరి ఆ విషయం విని చలించిపోయాడు.

జయంతీ! నీ ప్రేమను, ఆ ప్రేమ పట్ల నీకున్న నిశ్చలతను ఎంత సూటిగా, ఎంత దృఢంగా, ఎంత నిరాడంబరంగా చూపించావు! నిన్ను అవమానించి పంపిన మామీద ఎంత మెత్తగా దెబ్బ కొట్టావు!



చందమామ చందము

అది నీలి ఆకాశము
నీ నల్లని కేశము కాదు
అది చందమామ
నీ నగుమోము కాదు
అవి నక్షత్రాలు
నఖక్షతాలు కావు
అది తెలి మేఘం
నీ లేత పమ్మెద కాదు
అది వెన్నెల
నీ వలపు వన్నెలు కావు
అది చల్లదనము
నీ ఉల్లము కాదు
అది అందీ అందని దూరం
ఇది నీ చందము

— భమిడిపాటి వెంకటరమణ

అతని హృదయం మంద మారుతం తగిలిన పూల రేకులా వణికిపోయింది.

* * *

పునరుద్ధరించిన మెయిన్ గేట్ మీదుగా 'అంధ సేవా సదనం' అన్న గుమ్మడికాయంత అక్షరాలతో అర్చి ఆకారంలోని బోర్డు మెరిసి పోతోంది. విశాలమైన ఆవరణలో పాకలన్నీ పీకి, బిల్డింగులు కట్టడానికి పునాదులు తవ్వుతున్నారు. ఒక్కవైపుగా రాళ్ళు, సిమెంట్ బస్తాలు, ముడి కర్ర గుట్టలుగా పడి వున్నాయి. మరో వైపు గచ్చుకోసం గానుగ వేయబడి వుంది. కూలీలు, మేస్త్రీలు, తాపీ పనివాళ్ళు, వాళ్లను ఒజమాయిషీ చేస్తూ సుబ్రమణ్యయ్యర్—నానా గందర గోళంగా వుంది, అక్కడ. ఇవన్నీ ఏమీ కనిపించని నలుగురైదుగురు అంధులు ఓ మూలగా వున్న చెట్టు క్రింద కూర్చుని వినిపించే శబ్దాలలోనే దృశ్యాలను చూసేందుకు ప్రయత్నిస్తున్నారు.

పెంకుటింట్లో చిన్న చెక్కబల్ల ముందు కుర్చీలో కూర్చుని ఏదో రాస్తూన్న జయంతి, ఆ పని పూర్తి అయినట్లుగా పెన్నుకు క్యాప్ పెట్టి బల్లమీద పడేసి కిటికీలోంచి బయటకు చూసింది.

జరుగుతూన్న పని ఆమెకెంతో తృప్తిని కలిగిస్తోంది.

ఆమె చూపు చెట్టు క్రింద కూర్చున్న అంధులమీద పడింది, ఈ ప్రపంచంలోనే వున్నా వాళ్ల ప్రపంచం వేరు. వాళ్ల ప్రపంచంలో వెలుగులేదు. దాని రంగు చిక్కని నలుపు, వాళ్ల

ప్రపంచంలోని మనుషుల రూపం 'శబ్దం'. వాళ్ల రాత్రింబవళ్లకు అర్థాలు నిద్ర, జాగృతి. వాళ్ల కళ్లకు అర్థం, వుపయోగం కన్నీళ్లు మాత్రమే!

జయంతి గుండెలో కోత పెట్టినట్లుగా అయింది.

మీ కోసమే బాబూ, అసమర్థురాలినయినా ఈ మహా యజ్ఞాన్ని తల పెట్టింది. మీ ప్రపంచంలో దీపం పెట్టడానికీ, మీ ప్రపంచంలో రంగులు పూయించడానికీ...

రఘునాథరావుగారి ద్వారా సంక్రమించిన సంపదను యావత్తూ అంధుల సంక్షేమానికి వినియోగించ నిశ్చయించింది జయంతి. ఆ విషయానికి సంబంధించిన విషయ సేకరణ చేసింది. సుబ్రమణ్యయ్యర్ దగ్గర తమున్న ఇల్లుకొని, అంధులకు సౌకర్యంగా వుండేలా బిల్డింగులు కట్టడానికి ప్లాన్లు గీయించి ఆ పని ప్రారంభించింది. దేశంలోని అన్ని పత్రికలలోను అనాథలైన అంధులను ఆహ్వానిస్తూ ప్రకటనలు ఇప్పించింది. 'నేత్రాల' కోసం నేత్రనిధులకు అప్లికేషన్లు పెట్టింది. అంధులు సులువుగా నేర్చుకో తగ్గ వృత్తివిద్యలు నేర్పించాలనే ప్రయత్నంలో కూడా వుంది జయంతి.

''ఇదివరకు వున్న వాళ్లు గేదెల్ని పెట్టినప్పుడు పూవులమ్మిన చోట కట్టెలు అమ్మినట్లయిందని బాధపడ్డాను. కానీ నీవు వెలుగుపూలు పూయిస్తున్నావు తల్లీ'' అని ఆనందబాష్పాలు రాల్చాడు సుబ్రమణ్యయ్యర్.

పత్రికలలో ప్రకటనలిచ్చినా ఇంకా జయంతి ఆశించినంత మంది రావటంలేదు.

ఈ దేశంలో అవకాశాలిచ్చినా వినియోగించుకునే వాళ్ళు లేరు. భుక్తికోసం పిల్లల కళ్లలో జిల్లేడుపాలు పిండి అంధులను తయారుచేసే మనుషులున్న సమాజంలో మీ కళ్ళు బాగుచేస్తాం, మీ లోపాన్ని సరిచేసే విద్యలునేర్పిస్తాం రమ్మంటే రాకపోవడంలో ఆశ్చర్యమేమీ లేదు.

తొందరేముంది ? బిల్డింగులు పూర్తికానీ అనుకుంది జయంతి. ఇప్పుడున్న కొద్దిమంది పెంకుటింట్లోనే సర్దుకుంటున్నారు.

''లోపలికి రావచ్చా ?''

వినిపించిన స్వరానికి ఉలికిపడి చూసిన జయంతి, ఆనందాశ్చర్యంతో శిల్పంలా నిలబడిపోయింది.

''నేనూ అంధుణ్ణే. రావచ్చనుకుంటాను'' అంటూ ఒకడుగు ముందుకువేశాడు ఆగంతకుడు.

ఇంకో రెండడుగులు వేస్తే కుర్చీ అడ్డొస్తుంది. పరుగున వెళ్ళి చేయి అందించింది జయంతి.

దొరికిన చేతిని ఆప్యాయంగా నిమురుతూ ''జయంతీ'' అని మృదువుగా అన్నాడు.

''బావా !!!''

''ఔను. నేనే. నేనే వచ్చేసాను జయంతీ. నీ ప్రేమలోని ఔన్నత్యానికి తలవంచి వచ్చేశాను. నీవు సుఖభోగాలనుభవించాలనే తాపత్రయంతో



నీ ప్రేమను కించపరచాము. అదే ప్రేమను మరింత ఉదాత్తంగా ప్రదర్శించావు జయంతీ. నీ ప్రేమలోనే నీవు పరమార్థాన్ని వెతుక్కున్నావు.

అందుకే నీ సాహచర్యంలో నా బ్రతుకుకు కాస్త అర్థాన్ని కల్పించుకుందామని వచ్చాను; నీ భర్తగానైనాసరే, నీవు స్థాపించిన సేవా సదనంలో ఓ సభ్యుడిగానైనాసరే.''

జయంతి హరి పాదాలమీదికి జారిపోయింది.

''బావా, ఈ అంధ సేవా సదనాన్ని స్థాపించింది పేరుకు అంధుల కోసమే అయినా నిజానికి మీరు లేక నా జీవితంలో ముసిరిన చీకట్లను పారద్రోలటానికే సుమా. ఈరోజు నా కంటిపాప నన్ను వచ్చి చేరింది. నా అంధకారమయ ప్రపంచం వెలుగు వెల్లువ అయింది. నేను... నేను... మీ...''

హరి జయంతిని పైకి లేపి హృదయానికి హత్తుకున్నాడు.

''నీవు నా నయనజ్యోతివి; జీవనజ్యోతివి.''

[అయిపోయింది] ●

నాసిరకం దారాలు వెలిసిపోవచ్చు.
కోట్స్ సూపర్‌షీన్ వెలిసిపోయేది కాదు!



సూపర్‌షీన్ ఎన్నుకోండి.

సూపర్‌షీన్ సులువుగా జారేలా ప్రత్యేకించి తయారుచేయబడిన 3 పోరల మెర్సిరైజ్డ్ దారం. ఇది గట్టిగా ఉండి కుట్టుపనిలో గట్టి సౌకర్యాన్నిస్తుంది. రంగు వెలిసిపోదు.

జాకెట్లు, ఫ్రాకులు, షర్టులు వగైరాలకు సూపర్‌షీన్ ఎన్నుకోండి. అన్ని తేలిక బట్టలకూ సూపర్‌షీన్ శ్రేష్ఠమైనది.

మదురా కోట్స్ ఉత్పాదన

చెప్పడం మరవకండి–'సూపర్‌షీన్‌తో కుట్టండి'

కోట్స్
సూపర్‌షీన్



కోట్స్ - ఉత్తమ దారాల ఉత్పత్తిదారులు

HAITRA-B MCL 2B TEL

ఎలాంటివి ఎంచుకున్నా సరే-
ఎమరాల్డ్ సూటింగులు, స్టార్ లైట్ షర్టింగులు
మీ వంటికి సొగసునిస్తాయి.
మెత్తగా నేసిన ప్రియా * టెరీన్ చీరలు
— ఆకర్షణీయమైన డిజైన్లలో, అందమైన రంగుల్లో



దావణగెరె

అందంచిందే సమ్మేళనతో నూతన సరళి కల్పన !

డి దావణగెరె కాటన్ మిల్స్ లిమిటెడ్
హనుమంతప్ప బిల్డింగ్స్,
చిత్రదుర్గ రోడ్, దావణగెరె 577 002.

షోరూములు :
కావేరి భవన్, బెంగుళూరు-560 009.
దాజీబాన్ పేట్, హుబ్లి-580 020.
చిత్రదుర్గ రోడ్, దావణగెరె-577 002.

THOMAS/8304-C/TEL



''ఇల్లాలు–ప్రియురాలు'' సుహాసిని

"ఇల్లాలు–ప్రియురాలు"లో ఇంటా – బయటా

రావు(సత్యనారాయణ) బంగళా కాంపౌండ్‌లో చెట్టుకింద మంటచూస్తూ శేఖర్(శోభన్‌బాబు), లక్ష్మి (శుభ), ఇందిర (సుహాసిని) కూర్చొనున్నారు ప్లేట్లలో ఏవో సర్దుతూన్న రావు ''ఈ కట్లరీ క్రాకరీ అన్నీ లాస్ట్‌టైం లండన్ వెళ్లినప్పుడు కొన్నా. కొన్న ఖరీదుకంటే కస్టమ్స్ వాళ్ళు వేసిన డ్యూటీ దారుణమైంది అనుకో. అయినా – వాటీస్ దిస్? ఇక్కడా తయారు చెయ్యరు; మనం ఎక్కడికో వెళ్లి కొని తెచ్చుకుంటే పెనాల్టీ వేస్తారు?'' అన్నాడు.

శేఖర్ నవ్వుతూ, ''తయారు చెయ్యరని పేలకురా. నీకసలు విదేశీ సరుకు అంటే మోజు ఇక్కడ గడ్డి లండన్‌లో 'ది గ్రేట్ గ్రాస్' అని పాతిక పౌన్లు అన్నారనుకో. నువ్వు ఆహా ఓహో అని అది కొనేస్తావ్. అసలు నువ్వక్కడ్నుంచి ఒక ఫారిన్ పెళ్ళాన్నికూడా తెచ్చుకోవాల్సింది,'' అన్నాడు.

''ఫారిన్ అమ్మాయిని పెళ్ళాంగా తేలేదు గాని, మొదటసారి నేని ఫారిన్ వెళ్లినప్పుడు మాంచి థ్రిల్‌గా గడిపానులే.''

ఆ మాటకు అతని భార్య లక్ష్మి ముఖం ఎర్రబారింది. ''ఎవతది?'' అన్నది.

''అలా ఆవేశపడకే – నీకు బ్లడ్‌ప్రెషర్ వస్తుంది. ఒక్క విషయం చెప్పా నిన్ను కట్టుకున్న తర్వాతనుంచి నేను మళ్ళీ దేనివంకయినా కన్నెత్తి చూశానా? పార్టీలో, ఫంక్షన్స్‌లో, ఆఫీసుల్లో రంభల్లాంటి అమ్మాయిలు నా దగ్గర కొచ్చినా సరే – నేనిలా శ్రీరామచంద్రమూర్తిలాగే ఉన్నాను,'' అన్నాడు రావు.

వెంటనే ఇందిర ''అవును. పెళ్లి చేసుకోవాలేమిటి? ఆ మూడు ముళ్ళూ లేకుండా మరో మనిషితో చాటుగా సంబంధం పెట్టుకో వచ్చుగా?'' అంది తన భర్త శేఖర్‌వంక క్రీగంట చూస్తూ.

అది గమనించిన రావు ''చూడమ్మా. ఇందూ! నువ్వు శేఖర్‌ని ఓరగా చూస్తూ అంటున్నావ్ అది చాలా తప్పు. నాలాంటివాడు కర్మ చాలకో, పొరపాటునో ఏదయినా వెధవపని చెయ్యొచ్చుగాని, శేఖర్ మాత్రం కలలోకూడా ఏ తప్పూ చేయడు,'' అన్నాడు.



అక్కినేని, రాధ



సినిమా

''అని అందరూ నమ్ముతున్నాం గనుకే ఏ తప్పయినా చెయ్యొచ్చు. నా మాటల్లో అర్థం ఏమిటో మీ స్నేహితుడ్నే అడగండి, అన్నయ్యగారూ!'' అంటూ అక్కడ్నుంచి లేచి చక్కా వెళ్లిపోయింది ఇందిర.

''ఇందూ, ఇందూ! ఏమిటే, ఇందూ?'' అంటూ లక్ష్మి అనుసరించింది.

శేఖర్ ఎదురుగా ఉన్న మంటవంకే చూస్తూండిపోయాడు.

ఎ. కోదండరామిరెడ్డి దర్శకత్వంలో అట్లూరి పూర్ణచంద్రరావు సమర్పించే బాబూ ఆర్ట్స్ ''ఇల్లాలు– ప్రియురాలు'' చిత్రానికి జి. బాబు నిర్మాత

"సంగీత సామ్రాట్" ఎ. ఎన్. ఆర్.

''మధుర గాయకుడుగా శ్రీ నాగేశ్వరరావు, మనోహరమైన నర్తకిగా జయప్రద నటిస్తారు,''

సుమలత, శివకృష్ణ, నిర్మల, పి. ఎల్. నారాయణ, మురళీమోహన్ ''కాయ్ రాజా కాయ్''





''వసంత గీతం''

విశేషాలు

-జి. వి. జి.

అన్నారు సింగీతం. ఈయన దర్శకత్వం వహించే శ్యామల ఫిలిమ్స్ వారి ''సంగీత సామ్రాట్'' చిత్రానికి రాజశ్రీ, ఆత్రేయ, చక్రవర్తి, సెల్వరాజ్ ప్రభృతులు తెరవెనుక కృషి చేస్తారు. ఈ సంగీత నృత్య ప్రధాన చిత్రాన్ని కె. కృష్ణమూర్తిరాజు నిర్మాణతలో ఎస్. వెంకటరెడ్డి సమర్పిస్తారు. ''బాల్యంనుంచి లలిత కళలపట్ల గల ఆసక్తే నన్ని చిత్ర నిర్మాణానికి ప్రోత్సాహించింది. మేలో పాటల రికార్డు చేస్తున్నాం. జూన్‌లో షూటింగ్ ప్రారంభించి, ఆగస్టులో పూర్తి చేస్తాం,'' అన్నారు నిర్మాత డాక్టర్ కె. శ్యామలమ్మ ఎం. బి. బి. ఎస్.

"శ్రీశ్రీ"పై చైతన్య చిత్ర ఇంటర్నేషనల్ వారి చిత్రం

''మహాప్రస్థానం — నాటి శ్రీశ్రీతో అత్యంత సాన్నిహిత్యం ఉన్న రచయిత అబ్బూరి వరదరాజేశ్వరరావుగారి ఇంటర్‌వ్యూతో రెండవ షెడ్యూల్ ను ప్రారంభించాం,'' అన్నారు బి. నరసింగరావు. ఈయన దర్శకత్వంలో రవీంద్రనాథ్ 'శ్రీశ్రీ'పై నిర్మించే చిత్రానికి అంతకు ముందు శ్రీశ్రీ కుటుంబ సభ్యులతో, ఆయన సన్నిహితులతో ఇంటర్‌వ్యూలు చేయడం జరిగింది. శ్రీశ్రీ శ్రీమతి సరోజ, ఏకైక కుమారుడు రమణ, కూతుళ్ళు మంజుల, మంగళ, మాల, అత్తమామలైన సూర్యనారాయణ దంపతులు, మరదళ్ళు రమోలా, అమ్మలు [రాజ్‌బాబు అర్ధాంగి] పెక్కు ఆసక్తికరమైన విషయాలు తెలియజేశారు. ''తెలుగు సాహిత్యంలో అభ్యుదయ ధోరణి ప్రబలడానికి ప్రధానకారణం శ్రీశ్రీ కవిత్వం,'' అని ఇంటర్‌వ్యూలో ప్రముఖ కవి కాళోజీ అభివర్ణించారు. సాహితీ ప్రియులలోను, సామాన్య ప్రేక్షక వర్గాలలోను ఆసక్తి రేకెత్తించేలా తయారవుతూన్న ఈ చిత్రానికి మద్రాసులోని శ్రీశ్రీ స్వగృహం పరిసరాలలోనూ చిత్రీకరణ జరిగింది. వరూకోంద్రా ఛాయాగ్రాహకుడు. డి. రాజగోపాల్ సంకలనకర్త.



''జనం—మనం''లో ప్రభ

కృష్ణ కొత్త చిత్రాలు

కె. రాఘవేంద్రరావు దర్శకత్వంలో అశ్వనీదత్ నిర్మించే వైజయంతీ మూవీస్ చిత్రం జూన్‌లో సెట్‌కు వెళ్తుంది. అక్టోబర్ నుంచి ప్రముఖ పంపిణీ సంస్థ లక్ష్మీ ఫిలిమ్స్ నిర్మించే చిత్రంలో శ్రీదేవి నాయిక, కె. రాఘవేంద్రరావు దర్శకుడు. అక్టోబర్‌లోనే టి. కృష్ణ దర్శకత్వం వహించే శ్రీ అజంతా ప్రొడక్షన్స్ ''అందరి కంటె మొనగాడు'' చిత్రం మొదలవుతుంది. ఎ. కోదండ రామిరెడ్డి దర్శకత్వంలో ఎం. ఎస్. రెడ్డి అక్టోబర్ నుంచి నిర్మించే చిత్రంలో జయప్రద నాయిక. శోభన్‌బాబు సమర్పించే కృష్ణచిత్రవారి చిత్రం, యు. సూర్యనారాయణ బాబు నిర్మించే పద్మావతి ఫిలిమ్స్ చిత్రం, ఎ. కోదండ రామిరెడ్డి దర్శకత్వంలో మిద్దె రామారావు, త్రివిక్రమరావు నిర్మించే చిత్రాలు, పి. బాబ్జి నిర్మించే త్రిమూర్తి అండ్ శశిరేఖా ఆర్ట్స్ చిత్రం, ఎమ్. మల్లికార్జునరావు దర్శకత్వంలో రత్నా మూవీస్, సాయిరాం మూవీస్ నిర్మించే చిత్రాలు, వగైరా.

''మార్చండి మన చట్టాల్ని''లో గొల్లపూడి





నందమూరి బాలకృష్ణ "సాహసమే జీవితం"

కట్టా సుబ్బారావు దర్శకత్వంలో "ఇదీ మన భారతం"

"నేటి సమకాలీన సామాజిక పరిస్థితులు ప్రతిబింబించే విశిష్టమైన ఇతివృత్తం," అన్నారు కట్టా సుబ్బారావు. ఈయన స్క్రీన్‌ప్లే, దర్శకత్వ బాధ్యతలు వహించే ఇంటర్నేషనల్ ఆర్ట్ ఫిలిమ్స్‌వారి పై చిత్రంలో శివకృష్ణ, రాజేష్, ప్రభాకరరెడ్డి, గిరిబాబు, నూతన్ ప్రసాద్, కాంతారావు, పి. ఎల్. నారాయణ, గోకిన రామారావు, మాడా, ప్రసాద్ బాబు, లక్ష్మీకాంత్, రవికుమార్, వనితశ్రీ, సాధన, గీత, జయవిజయ, జ్యోతిలక్ష్మితోపాటు ప్రముఖ రంగస్థల కళాకారులు డి.వి. సుబ్బారావు, సంపత్, లక్ష్మణకుమార్, ఆచంట వెంకటరత్నం, వల్లూరి వెంకట్రామయ్య చౌదరి, ఎం. ఆర్. ఆంజనేయులు, ఎ. వి. సుబ్బారావు, నవ నటుడు మోహన్‌రావు పాల్గొంటున్నారు. మోదుకూరి జాన్సన్ సంభాషణలకర్త. చక్రవర్తి స్వరకల్పనలో ఆత్రేయ, సి. నారాయణరెడ్డి, వేటూరి, గోపి గీతాలు రాశారు. సలీం నృత్యాలు, కె. సత్యం కూర్పు, కొంగర సాంబశివరావు ప్రొడక్షన్‌తో పరిమిశెట్టి సుబ్బారావు నిర్వహణ బాధ్యతలు వహిస్తున్నారు. మదమంచి లక్ష్మి సమర్పించే ఈ చిత్రానికి కథకుడు, నిర్మాత బి. మోహన్‌రావు.

[illegible]

బాగా ఎండగా వుంది, గొడుగు వేసుకొని నటిస్తారా అన్నారు, కొత్త అందులోనూ, వద్దే కాదన్నాను!



మొదటి షెడ్యూల్ పూర్తయిన "ఉగ్రరూపం"

"మే 6 నుండి 21 వరకు మొదటి షెడ్యూల్ జరిగింది. మలిషెడ్యూల్ జూన్ 14 నుంచి 30 వరకు," అన్నారు ఎం. రోసిరాజు. ఈయన కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వంలో ఎస్. ఆర్. భారతి సమర్పించే జయభారతి ఇంటర్నేషనల్ వారి "ఉగ్రరూపం" చిత్రంలో శారద, శివకృష్ణ, విజ్జి, రామకృష్ణ, ప్రభాకర రెడ్డి, పి. ఎల్. నారాయణ, మాడా, చంద్రమౌళి, సుభాష్, చంద్రరాజు, పి. ఆర్. వరలక్ష్మి, తవకల, రమేష్‌నాయుడు, డి. పి. రాజు, పి కె. రంజిత్ నటిస్తున్నారు. డాక్టర్ రవీంద్రబాబు మాటలు, సత్యం సంగీతం. రంగా ఛాయ, ప్రకాశరావు శిల్పం, వేణుగోపాల్ కూర్పు, రవీంద్రగోపాల్ సహకార దర్శకత్వం, తార నృత్యాలు, ఎన్. వి. రాజకుమార్ ప్రొడక్షన్‌తో పి. కె. రంజిత్ నిర్వహణ బాధ్యతలు వహిస్తున్నారు.

ఇప్పుడు... గోద్రెజ్ రూపొందించిందొక కొత్త సబ్బు. ఇది మీ అంత శ్రద్ధగా మీ చర్మాన్ని కాపాడుతుంది.



Godrej

శుద్ధమైన వేపనూనె యొక్క సహజ సద్గుణాలు కలిగినది.

నీమ్, మర్గోసా అన్న పేర్లతో పిలువబడే వేపచెట్టు, చర్మ సంబంధ సమస్యలకై మానవజాతికి ప్రకృతి ప్రసాదించిన వరాలలో ఒకటి. వేపనూనెను క్రమం తప్పకుండా వాడితే, అది మీ చర్మం నునుపుగా, తేటగా ఉండడానికి తోడ్పడుతుంది.

గోద్రెజ్, శుద్ధమైన వేపనూనెను చేర్చి రూపొందించిన సబ్బు, నిమిన్— మీ చర్మ సమస్యలను కడిగి పారవేసే లగ్జరీ టాయిలెట్ సోపు. ఈ గోద్రెజ్ నిమిన్ మరింతకాలం మన్నుతుంది. ఎందుకంటే ఇది ఇతర కొన్ని మర్గోసా సబ్బులవలె మెత్తబడిపోదు.

మీ చర్మ సమస్యలను కడిగి పారవెయ్యండి...
మీ చర్మానికి శుభ్రమైన, ఆరోగ్యవంతమైన నిగనిగ ఇవ్వండి.



చిరంజీవి, విజయశాంతి
''మహానగరంలో మాయగాడు''

సినిమా

"ఘరానా రౌడీ"లో తండ్రిని మించిన తనయుడు

తుపాకి (శివప్రసాద్) మెల్లగా జేబు కత్తిరిస్తూండడం చూసి తండ్రి నరసింహం (నూతన్ ప్రసాద్) తృళ్ళిపడ్డాడు. "ఏమిట్రా! ఏమిట్రా ఈ పని? ఒరేయ్, ఊళ్ళు దోచుకునే వాళ్ళను చూశాను. దేశాన్నే తాకట్టు పెట్టే వాళ్ళను చూశాను. కాని, కన్న తండ్రి జేబు కత్తిరించేవాణ్ణి నిన్నే చూస్తున్నా, కొడకా!''

తడుముకోకుండా జవాబిచ్చాడు తుపాకి: ''ఇంట గెలిచి రచ్చ గెలవమన్నారుగా నీలాంటోళ్ళు? అందుకని ఓంకారం నీ జేబుతోనే మొదలెట్టాను'''

''కొట్టేసేవాడివి జేబులో చెయ్యి పెట్టి తీసుకోవచ్చుగదా? మళ్ళీ కత్తిరించడంఎందుకు? బంగారంలాంటి చొక్కా పాడుచేశావు చూడు!''

"నువ్వేగా ఎలాంటి తప్పుడుపని చేసినా— ఎవరికీ అనుమానం రాకుండా చెయ్యాలన్నావ్? ఆఁ. జేబులో చెయ్యిపెట్టి తీశాననుకో— నేనే తీశానని నీకు అనుమానం రావొచ్చు. ఇలా కత్తిరించి తీశాననుకో— ఎవడో జేబు కత్తిరించాడులే అనుకుంటావ్... మావయ్య దగ్గర నువ్వు కొట్టేస్తున్నావ్; నీ దగ్గర నేను కొట్టేస్తున్నాను.''

''సరి సరే! అంత డబ్బు నీ దగ్గరుంటే ఏ పాడు ఆలోచనలో రావొచ్చు. ఇట్నా ఇవ్వు... అచ్చా! ఇదిగో... ఈ అర్ధరూపాయి పెట్టి వేరుశనక్కాయలు కొనుక్కో.''

''ఈ అర్ధరూపాయి, ఈ అర్ధరూపాయి పెట్టి నువ్వే జీళ్ళు కొనుక్కొని తిను,'' అంటూ తుపాకి తుర్రుమన్నాడు.

''వీడు చంద్రగ్రహణం రోజు పుట్టినప్పుడే అనుకున్నాను— అయితే మంత్రవుతాడూ, లేకపోతే జేబులు కత్తిరిస్తాడూ అని. .''అంటూ నిట్టూర్చాడు నరసింహం.

రాజశేఖర్‌రెడ్డి దర్శకత్వం వహించే విజయ భేరీ మూవీస్ ''ఘరానా రౌడీ'' చిత్రానికి విజయ భాస్కర్ రెడ్డి నిర్మాత.



రంగనాథ్ ''ఘరానా రౌడీ''

ఇటీవల విజయవాడలో ''సితార'' చిత్రం విడుదల సందర్భంగా ఏర్పాటుచేసిన పత్రికా సమావేశంలో స్వాగతం చెబుతున్న శ్రీ ఈడ్పుగంటి లక్ష్మణ (లక్ష్మి పబ్లిసిటీస్), శ్రీ తుర్లపాటి కుటుంబరావు, చిత్ర నిర్మాత శ్రీ ఏడిద నాగేశ్వరరావు, దర్శకుడు వంశీగార్లని చిత్రంలో చూడవచ్చు.



"నా ఇల్లు — నా పిల్లలు"

''మేలో షూటింగ్ ప్రారంభించి జూన్‌లో పూర్తి చేయాలనుకుంటున్నాం,'' అన్నారు బి భాస్కరరావు. ఈయన స్క్రీన్‌ప్లే, దర్శకత్వంలో జె. వి రమణారెడ్డి సమర్పించే శ్రీ ద్వారక తిరుమల పిక్చర్స్ వారి సైచిత్రానికి మార్చి 26న పాటల రికార్డింగ్‌తో ప్రారంభోత్సవం జరిగింది. సి నారాయణరెడ్డి గీతాలు, సత్యం సంగీతం, ఎస్ సాంబశివరావు నిర్వహణతో ఆర్. చంద్రారెడ్డి, కె. శివపార్వతిరెడ్డి నిర్మాతలు.

"ఈ తీర్పు ఇల్లాలిది"లో
భీతిల్లే భీమేశ్వరరావు

భీమేశ్వరరావు (రాళ్ళపల్లి) రొప్పుతూ, రొజుతూ వచ్చి రాజా (మోహన్‌బాబు) ఎదురుగా ఆగాడు. "సార్! మీరు దొంగల్ని ఛేజింగు, సార్! నేను మిమ్మల్ని ఛేజింగు, సార్! దుంప తెగిపోయింది, సార్!"

"అది సరేగాని, నీకెదురుగా ఏ దైనా మోటార్ బైక్ కనిపించిందా?" రాజా అడిగాడు.

"ఏది, సార్? రెండు చక్రాల మోటార్ సైకిలేనా? కనిపించింది, సార్! యమస్పీడ్‌గా పోయింది, సార్!"

"మరి, అంత స్పీడ్‌గా పోతూంటే ఆపలేదా నువ్వు?"

"వాడ్నా, సార్? వాడు పరమ రౌడీలాగ కనిపిస్తున్నాడు, సార్! కొట్టినా కొడతాడు, సార్! సార్! మీరు మీ అమ్మగారికి ఒక్కడే కొడుకు, సార్! నేను మా ఆవిడకి ఒక్కడ్నే మొగుడ్ని, సార్!"

"నీలాంటి సన్నాసులు మాటికొక్కరుండ బట్టే మొత్తం పోలీసు డిపార్టుమెంటుని చూసి నలుగురూ నవ్వుతున్నారు తెలుసా?"

"తెలుస్సార్... ఉద్యోగమెందుకు, సార్? పెళ్ళాం పిల్లల్ని పోషించడానికి, సార్. మనం క్షేమంగా ఉండాలిగదా, సార్! లేకపోతే ఎలా పోషించగలం, సార్?"

"ఇదుగో... ముందు నువ్వు స్టేషన్‌కు పద!"

"ఎస్సార్... సార్! సెల్యూట్ మరచి పోయాను. సార్!"

"ఛీ — ఛీ!" అంటూ రాజా వడివడిగా వెళ్ళిపోయాడు.

అరుణ చంద్రమోహన్,
"కలలు కనే కళ్ళు"





"ఈ తీర్పు ఇల్లాలిది"లో భానుప్రియ, సత్యనారాయణ


మోహన్‌బాబు ద్విపాత్రలు నిర్వహించే ఎ. ఆర్ ఆర్ పిక్చర్స్ "ఈ తీర్పు ఇల్లాలిది" చిత్రంలో సుజాత, భానుప్రియ, సత్యనారాయణ, అనూరాధ, తీనాదాస్ వగైరా తారాగణం తాతినేని ప్రసాద్ దర్శకత్వంలో కె. వెంకట్రామ రాజు కథ సమకూర్చి, సమర్పించే ఈ చిత్రానికి కె. ఎల్. ఎస్. ఎస్. రామచంద్రరాజు నిర్మాత జూన్ విడుదల.

డి. రామానాయుడి చిత్రాలు

"జూన్‌లో రెండు చిత్రాలను మొదలెడుతున్నాను," అన్నారు సురేష్ అధినేత డి రామానాయుడు "సంఘర్షణ" అనంతరం మురళీ మోహనరావు దర్శకత్వం నెఱపే చిత్రంలో బాలకృష్ణ, విజయశాంతి, శారద, సంగీత, నిర్మల, చంద్రమోహన్, గొల్లపూడి, నూతన్ ప్రసాద్, పి. ఎల్. నారాయణ, మరో తార పాల్గొంటారు. పరుచూరి సోదరుల రచన, చక్రవర్తి సంగీతం నిర్వహిస్తారు.

పరుచూరి సోదరుల రచన, దర్శకత్వంలో తయారయ్యే "శ్రీ కట్నలీలలు" చిత్రంలో చంద్రమోహన్, తులసి, నూతన్ ప్రసాద్, గొల్లపూడి, పరుచూరి గోపాలకృష్ణ ప్రభృత నటవర్గం.

"ముందడుగు" హిందీ పరివర్తనం "మక్‌సద్" త్వరలో విడుదల కానున్నది.



హిందీ చిత్ర విశేషాలు!

★ 'లవ్ మేరేజ్' చిత్రం హీరోయిన్ మీనాక్షి శేషాద్రి పర్సనల్ హేర్ స్టయిలిస్ట్ లతకు ఆ చిత్ర కళా దర్శకుడు, సయ్యద్‌తో, అసిస్టెంట్ డైరెక్టర్ అబ్బాస్‌కు ఆ చిత్ర నిర్మాత లలో ఒకరైన ఖాదర్ కాశ్మీర్‌తో 'లవ్'లు ముదిరి, 'మేరేజ్'లు జరగబోతున్నాయి.

★ "జమానా" చిత్ర నిర్మాణమప్పుడు ఆ యూనిట్‌లో కొందరు జంటలకు ఎడబాటు కలిగింది. రచయితలు సలీమ్ — జవేద్, రాజేష్‌ఖన్నా–డింపుల్ విడిపోయారు. పూనమ్ ధిల్లాన్– డైరెక్టర్ రమేష్ తల్వార్‌ల ప్రణయం, మరో నాయిక రంజీతాకు అక్బర్‌ఖాన్‌తోటి సఖ్యం పటాపంచలయ్యాయి.

★ రోము సిప్పీ నిర్మించే "కుజ్లీ" త్రీడీ చిత్రంలో తెర మీద డాన్స్ చేస్తున్న కెబెరా నర్తకి తొడలు అప్పుడప్పుడు ప్రేక్షకుల సమీపంగా కదిలేటట్లు భ్రమ కలిగించే విధంగా చిత్రీకరింపబడుతూందట.

★ అలనాటి నటి నాదిరా బొంబాయిలో పాత్రికేయులకు కాక్‌టైల్ పార్టీ ఇచ్చి, "నేనూ నా భర్తనుంచి విడిపోయానహో!" అని ప్రకటించిందట.

★ హర్యానా అసెంబ్లీ సభ్యులకోసం "ఆజ్ కా ఎమ్మెల్యే" ప్రత్యేక ప్రదర్శనను ఏర్పాటు చేయవలసిందనీ, ఆ చిత్రానికి వినోదపు పన్నును రద్దుచేస్తే బావుంటుందనీ ఆ రాష్ట్ర ముఖ్యమంత్రిని స్పీకర్ కోరితే, పశ్చిమ బెంగాల్ ఎం. ఎల్. ఎ. ఒకతను ఎమ్మెల్యేలను న్యూనతపరిచే రీతిలో ఉన్న ఆ చిత్రాన్ని బహిష్కరించాలని సూచించాడట.

★ "ఇన్‌క్విలాబ్" తర్వాత...? ఉత్పల్‌దత్ నటించిన ఓ బెంగాలీ చిత్రం" ఇన్‌క్విలాబ్ కి బాద్"గా హిందీలో డబ్ చేయబడుతోంది.

★ "ఫ్రైడే, సాటర్‌డే" అనే టైటిల్‌ను అక్బర్‌ఖాన్ రిజిస్టర్ చేయించాడు. మరొకరి చిత్రం పేరు "మరద్ మరద్ నహీ, ఔరత్ ఔరత్ నహీ !"

★ టైటిల్స్‌లో "ఆజ్" అని ఉన్న చిత్రాలు చాలావరకు ఫ్లాప్‌లు అయ్యాయి. అవి : ఆజ్ ఔర్ కల్, ఆజ్ కి రాధా, ఆజ్‌కి తాజా కబర్, ఆజ్ కా మహాత్మా, ఆజ్ కా ఎం.ఎల్.ఎ."

★ "కూలీ" చిత్రంమీద మరో కేసు. అమితాబ్‌బచ్‌చన్ ప్రార్థన చేస్తున్న సమయంలో రతి అగ్నిహోత్రి ఓరకంటితో చూడడం ఆక్షేపణీయమైనదంటూ ఓ పనిలేని పుల్లయ్య కేసు పెట్టాడు

★ నటీమణులలో నాలుగు 70 ఎం. ఎం. చిత్రాల్లో నటించే ఘనత హేమమాలినికి దక్కింది. అవి "షోలే, ది బర్నింగ్ ట్రెయిన్, అలీబాబా ఔర్ 40 చోర్, రజియా సుల్తానా." వీటన్నిటిలోనూ ఆమె సరసన ఆమె భర్త ధర్మేంద్ర నటించాడు.

★ మన్‌మోహన్ దేశాయ్ తండ్రి గతంలో 31 చిత్రాలు నిర్మించాడు. వాటిల్లో ఒక్కటైనా చూడలేదట మన్‌మోహన్. ఈయన "మర్ద్" చిత్రంలో అమితాబ్‌బచ్‌చన్ తండ్రిగా దారాసింగ్ నటిస్తున్నాడు. ★

ప్రశ్నావళి

కె. రామలక్ష్మి

ఆర్. ఎన్. ఎస్. — దొంతలూరు

కె. రా.గారూ మీకొక పెళ్లీడుకొచ్చిన కూతురుందనుకోండి. కట్నం కావాలని ఒక ఉద్యోగి, కట్నం అక్కరలేదని ఓ నిరుద్యోగి సంబంధం వచ్చారనుకోండి — ఇద్దరిలో ఎవరికి ఇచ్చి పెళ్లి చేస్తారు ?

★ ఇద్దరికీ యివ్వను ! పెళ్లీడొచ్చింది కనుక ఎవరికో ఒకరికి పిల్లని కట్టపెట్టాలన్నది నా తత్వానికే విరుద్ధం. పెళ్లి సంబంధాలు — స్నేహాన్ని పెంపొందించేవిగా వుండలేగాని పిల్లల్ని ఒదుల్చుకునేవిగా వుండకూడదు. అది గ్రహించండి !

బి. పి. ఆర్. — కె. సి వర్కు ఎ

కలిమి బలిమి చెలిమి ఏది గొప్పది ?

★ చంపారు. సమస్య కాబోలు పూరించాలని కంగారుపడి పప్పు వేణుగోపా'లావధానికి' ఫోను చేద్దామనుకున్నాను ! దేనికదే గొప్ప !

బి. హెచ్. వి. — మునగపాక

ఈ రోజులలో చదివిన చదువులకి ప్రయోజనం లేదంటున్నారు. నిజమేనా ?

★ ఉద్యోగం రాదు — విజ్ఞానం రాదని కోట్లాది నిరుద్యోగులు — నిరూపించడం లేదా ! ఇంకా యీ అనుమానం దేనికి.

జి. ఎస్. — ఆలూరు

ప్రేమ శాశ్వతం అంటారు కదా — మరి కొందరు ప్రేమికు:ు తాత్కాలికంగా విడిపోతున్నారే ?

★ సృష్టిలో — ఏదీ శాశ్వతం కాదు. అలాంటిది నీటి బుడగలాంటి జీవితంమీద ఏ క్షణంలో సగం సేపో రంగుల హరివిల్లుగా విస్తరించేది శాశ్వతం ఎలా అవుతుంది !?

టి. ఆర్. — అర్ష వీడు

అక్కయ్యగారూ, ప్రతివారం మీ ప్రశ్నావళి శీర్షిక చూస్తున్నాను. ప్రశ్న పంపినవారి పూర్తి పేరు వ్రాయరెందుకని ?

★ వూళ్లు చూస్తున్నారుగా — చిన్న చిన్న గ్రామాలు. పూర్తి పేరు వేస్తే గుర్తుపట్టి అమ్మాయిల పేరున ప్రేమలేఖలూ, చెత్తలేఖలూ రాసే ప్రబుద్ధుల ప్రమాదం ఎక్కువ. ఒక రెండు మూడు వారాల అనుభవం తరవాతనే — ఈ పొడి అక్షరాలు మొదలు పెట్టడం జరిగింది. పూర్తి చిరునామాలూ, పేరూ లేని ప్రశ్నలకి జవాబులు ఎలా వుండవో, ప్రశ్నావళిలో పూర్తి పేరు కూడా అలాగే వుండదు !

వి. వి. ఆర్. — విశాఖపట్నం

కొందరు తల్లులకి ప్రేమ ఎక్కువ; కొందరు తల్లులకి అసూయ ఎక్కువ. కారణం?

★ తల్లి మనసు.

కె. వి. ఎమ్. — దులియాజాన్

భారతదేశంలో నిరుద్యోగ సమస్య తీరాలంటే ఏమి చేయాలి ?

★ డిగ్రీ చదువుల కెగబాకడం తగ్గించి, వృత్తి విద్యలు — చిన్న చిన్న పరిశ్రమల స్థాపన కవసరమైన డిప్లొమోలూ సంపాదించుకునే ప్రయత్నాలు చేయాలి. చదువంటే — ఒక్క డిగ్రీ కాదు — సగౌరవంగా బ్రతకనేర్వడం కూడాను.

కె. డి. బి. — మచిలీపట్నం

సృష్టిలో దొరకనిదేమిటి ?

★ తెలివితేటలు. అవి సంపాదించుకోవాలి ! ఎవరూ యివ్వరు.

ఎస్. ఆర్. — భట్టిప్రోలు

వివాహిత అయిన స్త్రీకి మాంగళ్యం గుర్తు. వివాహితుడైన మగవాడికి గుర్తు ఏమ:టి ?

★ ఏం లేకే — కొంపలు మునుగుతున్నాయి నాయినా. ఏదేనా గుర్తుండేలా తతంగంలో (పెళ్లి !) మార్పు తేవాలని — కోరాలి.

కె. ఎమ్. — తూడి

ఆంధ్రపత్రికలో నాపేరు కన్పించాలంటే.

★ వెరీ సింపుల్ ? ప్రకటన యివ్వడం ఒక పద్ధతి. ఫాలాకుడి డైరీ కెక్కేదేదైనా చేయడం రెండవ పద్ధతి.

కె.జి.ఎస్. — నారాయణపేట

పతివ్రతలకి పేరు పొందిన దేశంలో పుట్టి కేవలం ఉద్యోగంకోసం శీలాన్ని అమ్ముకొన్న స్త్రీలకు మీ సలహా ?

★ ఇలాంటి వాటికి సలహా ఎవరికీ అక్కరలేదు. అవసరం అన్నిటినీ మించిన కష్టం. ఈనాడూ, ఇసుకని ఏ బియ్యంగానో మార్చగల శక్తి ఆడదానికిస్తే — శీలం అమ్ముకోదు. ఉద్యోగంకోసం — ఆడదాన్నికోరే నీచుల్ని మీరేం అనరుగాని వుద్యోగం కావాలి కనుక పతనానికి సహితం తెగించవలసిన స్థితిలోపడ్డ ఆడవారిని ఎందుకు — ఆడిపోసుకుంటారు ?

ఎస్.ఎస్. — అనంతపురం

మీరు ఎలాటి ప్రశ్నలకేనా జవాబులు చక్కగా యిస్తారు. ఏమిటో నా మనస్సుకి మిమ్మల్ని చూడాలనిపించింది. మీ యింటికివస్తే నన్ను ప్రేమిస్తారా ?

★ ప్రేమించను ! సత్కరిస్తాను.

ఎం.బి.ఆర్. — కుర్పిపార (ఒరిస్సా)

మీరింతవరకు ఎప్పుడైనా గుండెబరువుతో ఏడ్చారా ?

★ లేదు.

శేఖర్ — వగరి

జాతకాలు, జన్మ నక్షత్రాలపై వాటి ఫలితాలపై మీ అభిప్రాయం ?


★ నా కిప్పటిదాకా — నమ్మకంలేదు.

పి.కె.సి.బి. — తుంబకుప్పం

మీ జవాబులు చదువుతూవుంటే మీరు ఎదురుగా కూర్చుని తిట్టినట్లుంటుంది...

★ అబ్బా ! నిజంగా అంత బాగుంటాయా ?!

★



గైడ్ గైడ్ గైడ్

ఎం.ఏ రహిమాన్



"కుమార్ బాబు బుద్ధిమంతుడైపోయాడు!" ఆ సంగతి తెలుసుకున్న అతని స్నేహితులకు చాలా ఆశ్చర్యంగా వుంది. ఈనాడు కుమార్ బాబు బుద్ధిమంతు డయ్యాడంటే ఇదివరకు ఎంతగా చెడిపోయాడో వూహించుకుంటే అర్థమవుతుంది.

"జీవితం అన్ని విషయాలలో అనుభవం కొరకే!" నన్న సూక్తిపై సూటిగా నడిచే కుమార్‌బాబు కలవారి అబ్బాయి కాబట్టి డబ్బుకు కరువుండదు. చదువు సంధ్యలకు 'ఫుల్ స్టాప్' పెట్టేసి రకరకాల విలాసాలతో, వినోదాలతో కాలం వృధా చేస్తుండేవాడు. పెద్దలు ఎంత మందలించినా లాభంలేకపోయింది. అలాంటి వాడు ఒక్కసారిగా బుద్ధిమంతుడై పోవడానికి కారణమేమై వుంటుంది? అని ఎంతగా ఆలోచించినా అతని స్నేహితులకు అర్థం కాలేదు.

కుమార్‌బాబుకు "పేకాటంటే" మహా పిచ్చి. పెద్దపెద్ద మొత్తాలతో ఆడకపోతే ఆట ఆడినట్టుండేది కాదు..."మంచి మందు" అంటే ఎగిరిగంతు లేసేవాడు. ఇప్పుడు అతని విలాసాలలో వినోదాలలో పాలు పంచుకున్న స్నేహితులు పేకాటకు పిలిచినా, మంచి మందుపార్టీ చేసుకుందామన్నా... కుమార్‌బాబు ఇచ్చే సమాధానం వింటే విచిత్రంగా ఉంటుంది.

"ఒరేయ్! సమయం సందర్భాన్ని బట్టి పేకాట సరదాగా ఆడుకోవాలిగాని అలవాటుగా ఆడకూడదురా! భవిష్యత్తుకే ప్రమాదం. మనం ఆశతో ఆడుతూ ముందుకుపోతాం, తర్వాత తిరిగి చూస్తే... ఆర్థికంగా, మానసికంగా దెబ్బ తింటాం. ఇక మందుపార్టీ విషయం అంటావా.. అసలు మనం పుట్టింది కళ్ళుతెరచి బ్రతకడానికి. జీవితంలో సగంకాలం నిద్రకే సరిపోతుంది. రెండవసగంలో మత్తులోకి ఒరిగితే... అది చాలా అనర్థాలకు దారితీస్తుంది... అది మన క్యారక్టరునే దెబ్బతీస్తుంది" అని వేదాంతిలా మాట్లాడుతున్నాడు.

ఫలానా అమ్మాయి బలేగుంటుంది. కాసేపు ఆట పట్టిద్దామా? అనంటే. "అమ్మాయిల మనసులలో అభిమానం సృష్టించబడేలా ప్రవర్తించాలిగాని ఏడిపించి కాదురా!" అని ఎంతో మంచివాడులా చెబుతున్నాడు. కనీసం సినిమాకైనా, విడియో గేమ్స్‌కైనా వెడదాం రారా అనంటే,

"పరీక్షలు దగ్గర పడుతున్నాయి-రా! చిన్నవయసులోనే చక్కగా చదువుకోవాలిరా! వయసు ముదిరితే చదువు ఒంటపట్టదు, కనుక యిప్పుడు బి. కాం. 'ఫస్ట్‌క్లాస్'లో పాసయ్యేలా ప్రయత్నిస్తున్నాను. సినిమాలు ఎప్పుడు వస్తూనే వుంటాయి. పరీక్షల తర్వాత చూసుకోవచ్చు. కాని పోయిన కాలం తిరిగిరాదు కదరా!" అని ముక్తసరిగా సమాధానమిచ్చి చిరునవ్వుతో వెళ్ళిపోయే కుమార్‌బాబును చూస్తుంటే అతని స్నేహితుల్లో కొంత మందికి మంటగా... అసూయగా వుంటుంది.

అసలు అతనిలో మార్పు కారణం ఏమిటో ప్రత్యక్షంగా అతన్నే అడిగే ధైర్యం చాలక, ఆరా తీయమని 'కిరణ్' అనేవాడికి బాధ్యత అప్పజెప్పారు స్నేహితులు. కిరణ్ డిటెక్టివ్ లాంటివాడు. ఏ విషయాన్నయినా తెలివిగా, తేలిగ్గా ఆరా తీయడం అతని ప్రత్యేకత.

ఓ వారం రోజుల తర్వాత స్నేహితులందరూ కలుసుకున్నపుడు కుమార్‌బాబు గురించి వివరాలు చెప్పాడు కిరణ్.

"ఒరేయ్! కుమార్‌గాడు బుద్ధిమంతుడవడానికి కారణం ఒక రిక్షావాడురా!"

"ఆఁ... రిక్షావాడా?... ఎలారా?" అని అందరూ ఆశ్చర్యంగా అడిగారు.

"రంగయ్య అని... మా అన్నయ్యవాళ్ళ పిల్లలను, మా ప్రక్కింటివాళ్ళ పిల్లలను జీతం మీద రోజూ స్కూలుకు తీసుకెళ్ళి, మళ్ళీ సాయంకాలం తీసుకొస్తుంటాడు. ఒకరోజు కుమార్‌బాబు నన్ను సినిమాకు తీసుకెడదామని మా యింటికొచ్చాడు. ఓ పది నిమిషాలు కూర్చోరా... అంటే వరండాలో కూర్చొని పత్రికలు తిరగేస్తున్నాడు. అప్పుడు రంగయ్య

జీతం కోసం వచ్చాడు అప్పటికి అతని జీతానికి వారం గడువుంది. ముందుగా అడుగుతున్నందుకు కారణం అడిగితే, అతను తన కొడుకు రాముడు ఎం. కాం. ఫైనల్ యియర్ పరీక్ష ఫీజుకు డబ్బు అవసరం వచ్చిందని చెప్పాడు. అదంతా విన్న కుమార్‌బాబు రంగయ్యను పరీక్షగా చూశాడు. బాగా పరిచయమున్న వ్యక్తి... అన్న సంతోషంగా లేచాడు. కాని ఏమనుకున్నాడో ఏమో... గతాన్ని తలచుకుంటూ, పూర్వజన్మ గుర్తుకొచ్చినవాడిలా కూర్చుండిపోయాడు.''

''అవునూ...రిక్షావాడు తన కొడుకు కోసం డబ్బులడిగితే అవసరానికి ఆదుకోవచ్చుగాని, యిలా ఒక్కసారిగా అలవాట్లన్నీ మార్చుకుంటానికి సంబంధం ఏమిటి ?, మరింత ఆశ్చర్యంగా అడిగారు...స్నేహితులు.

''అక్కడేవుంది లి టి కే ష న్ ... అది చెప్పాలంటే ఒక కధగా చెప్పాలి. వినే ఓపిక మీకుంటే చెబుతాను'' అని కిరణ్ అందరి ముఖాల వైపు పరిశీలనగా చూశాడు.

''ఊఁ...ఊఁ...అది కూడా చెప్పేయ్ !'' అన్నారు అందరూ.

కిరణ్ కుమార్‌బాబును గూర్చి కధగా చెప్పడం మొదలెట్టాడు.

అది షుమారు పన్నెండు సంవత్సరాల క్రితం నాటిమాట.

అప్పుడు కుమార్‌బాబు మూడవ క్లాసు చదువుతూండే వాడు. ఒకరోజు వాళ్ళ క్లాసు మాష్టారు జరిగిన పాఠాల్లో ప్రశ్నలువేసి అందరి అంతు తేల్చుకున్నాక, క్రొత్తగా ఒక నీతి శతకాన్ని ప్రారంభిస్తూ, అందులోని పద్యాలను ఒక్కొక్కరిని వరుసగా చదవమన్నారు.

ఒక్కొక్కరి తర్వాత కుమార్‌బాబు వంతు వచ్చింది. కుమార్‌బాబు క్లాసులో అందరికంటే అందంగా వుంటాడు. ఎంత అందంగా అని... సరిగ్గా చెప్పాలంటే 'న్యూట్రమూల్' బోయ్ లాగానో...లేదా...మిలమిలమెరిసే సిమ్లా ఆపిల్ పండులా వుండేవాడు. అంత అందంగా వున్న కుమార్‌బాబులో ఒక్కటే లోపం...అతనిది కాస్త బండనాలిక. పద్య పదాలనే కాదు, చిన్న చిన్న మాటలను కూడా అతను సరళంగా వుచ్ఛరించిలేడు. ఇప్పుడు ఆ లోపం సవరించుకోగలిగాడనుకోండి. ఆ విషయం క్లాసులో అందరికీ తెలుసు. అందరూ నవ్వుతారని లేచి నిలబడి క్షణంసేపు పుస్తకాన్ని, మరోక్షణం మాష్టారి వైపు, మరోసారి నవ్వుతున్న సహ విద్యార్థుల వైపు చూస్తూండి పోయాడు.

''చదవవేంరా !'' అని గద్దించి అడిగారు మాష్టారు. పాపం! కుమార్‌బాబు బెదిరిపోయి,

''నాకు రాదండి !'' అన్నాడు ఎలాగో.

''మాష్టారూ ! ... వాడిది బండ నాలికండి !'' అని ఎవరో అంటే మాష్టారు వారించి,

''చదువునాయనా !'' అని మరోసారి అన్నారు.

''కావాలంటే పేముబెత్తంతో పదిదెబ్బలు తింటానుగాని చచ్చినా చదవను'' అన్నట్టు చేయిచాచి మాష్టారినే తీక్షణంగా చూస్తూ నిలబడ్డాడు కుమార్‌బాబు.

అతని దీనస్థితికి మాష్టారుకు జాలికలిగి, అతని వంతుకు వచ్చిన పద్యాన్ని పదిసార్లు చూసి వ్రాయమన్నారు.

తరువాత వంతు రాముడిది.

రాముడు చాలా పేదింటి పిల్లవాడు. అందంలో కుమార్‌బాబు కంటే తీసిపోడు. ఒక్కమాటలో చెప్పాలంటే కలకత్తా జామ పండులా వుంటాడు. చాలా తెలివైనవాడు. బాగా చదువుతాడు. కాని ఏం లాభం ? ... అతనికి అచ్చుపుస్తకమేకాదు... అతని నిక్కరుకు కూడా గుండీలు లేవు.

తనవంతు రాగానే లేచి ... వూడిపోతున్న నిక్కరుకు బ్రహ్మముడిలాటిది ఒకటి నడుముకు బిగించి, కాస్త కంగారుపడుతూ ప్రక్కనున్న కుమార్‌బాబు దగ్గర పుస్తకం తీసుకొని చదవ బోయాడు. ఇదంతా చూస్తున్న మాష్టారు,

''ఏరా ! నీ అచ్చుపుస్తకమేమయింది ?'' అనడిగారు.

''మా అమ్మ కొనివ్వలేదు మాష్టారూ !''

''అమ్మంటున్నావు ? ... నాన్న ఏమయ్యాడురా ?''

''మా నాన్నను అడిగితే కాళ్ళు యిరగ తంతానంటాడు మాష్టారూ !''

''అబ్బా ! ... అంతటి మహానుభావుడా ? ఏం చేస్తూంటాడురా ?''

''రిక్షా త్రొక్కుతాడు.''

''అదా సంగతి ! సరే ... ఎవరిదో పుస్తకం తీసుకున్నావుగా చదువు !''

అంతలో నిక్కరు మళ్ళీ వూడితే రాముడు సర్దుకొని చదవబోతుంటే,

''ఏరా ... నిక్కరుకు గుండీలు లేక పోతే పిన్నీసు పెట్టుకోకూడదూ ?'' అని చెవి మెలేశారు. మాష్టారు.

''మా అమ్మను ఎన్నిసార్లు అడిగినా యివ్వలేదు మాష్టారూ ... అంతలో బడికి టైమయిపోతే పరుగెత్తుకొని వచ్చేశాను.''

''ఇలా సిగ్గు వదిలేశా ?'' అని మాష్టారంటే అవునన్నట్టు అమాయకంగా తలూపాడు రాముడు. అప్పుడు మిగతా పిల్లలందరూ ఘొల్లుమని నవ్వారు. తర్వాత మాష్టారు ఒకడి దగ్గర పిన్నీసు తీసుకొని స్వయంగా రాముడి నిక్కరుకు పెడుతూంటే ... పాపం ! రాముడు నిజంగా సిగ్గుపడిపోయాడు.

తర్వాత రాముడు తన వంతు కొచ్చిన పద్యాన్ని చదవక రాగం తీసి మధురంగా పాడాడు. మాష్టారు తన్మయులై, ''భగవంతుడా ! యింత చక్కని బాలుడికి పేదరికం అంట గట్టావా ?'' అని తనలో తానే ప్రశ్నించుకున్నారు.

అంతలో...

''మా రాముడ్ని ఒకసారి పంపండి మాష్టారూ !'' అని ఒక స్త్రీ తరగతి గది బయట నిలబడి అడిగింది.

పోలికలను బట్టి చూస్తే ఆమె రాముడి 'తల్లి' అని స్పష్టంగా తెలిసిపోతుంది. తన విద్యార్థుల లోపం తల్లిదండ్రులకు చెప్పడం మాష్టారికి అలవాటు.

''ఏమ్మా ! రెండు వారాల నుంచి చెబుతున్నా పిల్లలకి పుస్తకాలు కొనివ్వటం తెలియదా ?'' అనడిగారు.

''ఏమయింది మాష్టారూ ?'' అని బిక్క మొహంవేసి అన్నది రాముడి తల్లి.



"ఏమైందని అడుగుతావేమిటమ్మా ? ... రాముడికి పుస్తకాలే కాదు ... వాడి నిక్కరుకు గుండీలు కూడా లేవు. నువ్వు తల్లివై వుండి వాడికేం కావాలో చూడాలి ? ... లేదా ? "

అప్పుడు రాముడి తల్లి తన పెద్దరికం మీద అభిమానంతో, అహంకొద్దీ...

"వాడికి అన్నీ కొనిపెట్టాను మాష్టారు ! వాడు పోగొట్టుకుంటూంటాడు !" అని అబద్ధాన్ని అందంగా వచ్చినిజంలా చెప్పేసింది. అప్పుడు మాష్టారు వెర్రికోపంతో...

"ఏరా ! పుస్తకాలు పోగొట్టుకొని, అమ్మ కొనివ్వలేదని అబద్ధాలు చెబుతావా ? ... అబద్ధాలూ ... !" అంటూ పేముబెత్తంతో "షవ్ షవ్"మని రాముడ్ని ఎక్కడబడితే అక్కడ బాదారు.

పాపం! చిన్నారి రాముడు ఆ దెబ్బలకు తట్టుకోలేక, 'అమ్మోయ్ ! ... బాబోయ్!' అంటూ అల్లాడిపోయాడు.

"ఏదో రెండు దెబ్బలు కొట్టి వూరుకుంటాడు అనుకుంటే, పశువును బాదినట్టు బాదుతాడేంటి యీ పంతులూ!" అనుకొని రాముడి తల్లి, తన తప్పుకు తనలో తాను తిట్టుకుంటూ, "ఈసారి కొనిస్తే జాగ్రత్తగా వుంచుకుంటాడు లెండి మాష్టారు." అన్నది– రాముడ్ని దగ్గరకు తీసుకుంటూ.

"లేదు లేరా! మన మాష్టారేగా కొట్టింది. మేష్టారు ఎంతకొడితే అంత బాగా చదువస్తుందిరా!" అని వూరడించి రాముడి కళ్ళ నీళ్ళు తుడిచింది.

జరిగినదంతా కుమార్‌బాబు, మిగతా పిల్లలు దిగ్భ్రాంతి చెంది చూస్తుండిపోయారు. తర్వాత రాముడి తల్లి వచ్చిన పనేమిటో చెప్పేసి వెళ్ళిపోయింది.

కుమార్‌బాబు, రాముడు మంచిస్నేహితులు. బడి వదిలిన తర్వాత కుమార్‌బాబు వుండలేక, అడిగేశాడు.

"రాముడూ ! ... నిజంగా మీ అమ్మ పుస్తకాలు కొనియిచ్చిందా ?"

"లేదురా ! అంతా అబద్ధం."

"ఎందుకని అలా చెప్పిందిరా ?"

"మనం చిన్నోళ్ళం కదా...ఏమి చేయలేమని"

"పాపం! నిన్ను బాగా కొట్టారురా మాష్టారు" అన్నాడు జాలిగా. అప్పుడు రాముడి కింకా దుఃఖం వుబికి వచ్చింది. అతనితోబాటు కుమార్‌బాబుకు కూడా ఏడుపు వచ్చేసింది.

కుమార్‌బాబుకి లెక్కలు చేయడమంటే చాలా యిష్టం. అందుకు రాముడ్ని కూడా రమ్మంటూంటాడు తన యింటికి. ఏంచక్కా కలసి లెక్కలు చేసుకోవచ్చని. కాని రాముడు తనకు యింట్లో చాలా పనుంటుందని చెప్పేడు. అర్థంకాక కుమార్‌బాబు–

గైడ్ — గైడ్ — గైడ్

"ఎందుకని ?" అన్నాడు దీర్ఘంగా.

"మా నాన్న రిక్షా తీసుకెళ్ళగానే మా అమ్మకూడా కూలిపనికి వెళ్ళిపోతుంది. కనుక నువ్వే మా యింటికి రా!" అన్నాడు రాముడు.

"సరే"నని కుమార్‌బాబు ఒకరోజు రాముడింటికి వెళ్ళాడు.

రాముడు చాలాసంతోషంతో ఆహ్వానించాడు. తన చెల్లెల్ని చూపిస్తూ, "మా చెల్లి రాజి !" అన్నాడు. మళ్ళీ వెంటనే–

"చాలా బాగుంది కదూ !" అన్నాడు.

"అవునూ చాలా బాగుంది...బెంగుళూర్ ద్రాక్ష పండులా !" అన్నాడు కుమార్‌బాబు. తర్వాత రాముడు చాపపరచి కూర్చోమన్నాడు. కుమార్‌బాబు తాను తెచ్చుకున్న చాక్లెట్లు రాముడికి, చెల్లి రాజీకిస్తూ కూర్చున్నాడు. అంతలో రాముడి తల్లి వచ్చింది. అబ్బాయి ఎవరో తెలుసుకొని సంతోషించింది.

"ఇద్దరూ చక్కగా చదువుకోండినాయనా" అని కూతుర్ని ఎత్తుకొని లోపలికెళ్ళింది. చాలా సేపటిదాకా యిద్దరు మిత్రులు చదువుకున్నారు.

అంతలో ఏవో పాటలు పాడుకుంటూ, తూలుతూ రాముడి తండ్రి రంగయ్య వచ్చాడు.

"మా నాన్న !" అన్నాడు రాముడు.

"అబ్బ...ఎంత ఛండాలపు వాసనా !" అని ముక్కు మూసుకున్నాడు కుమార్‌బాబు.

"మా నాన్న సారా తాగుతాడు అందుకని వాసన".

"సారా తాగితే పోలీసోళ్ళు పట్టుకోరూ ?" అని అడిగాడు కుమార్‌బాబు ఎప్పుడో ఎవరో చెప్పినట్టు గుర్తు చేసుకుంటూ.

"ఇప్పుడు పట్టుకోరు. అందుకే మా నాన్న రోజూ తాగి వస్తున్నాడు."

"ఎందుకని ?"

"గాంధిగారు పుట్టి నూరేండ్లు దాటిందట. ఆ తర్వాత ఆంధ్రరాష్ట్రం వచ్చిన రోజునతాగితే తప్పులేదని లైసెన్సు యిచ్చేశారంట...యిదం సూనాన్న అమ్మతో గొప్పగా చెబుతూంటె విన్నాను." అన్నాడు రాముడు.

తూలుతూ వచ్చిన రంగయ్య మంచ మీద కూర్చొని పిల్లల సంభాషణ ఏం పట్టనట్టు వెళ్ళి,

"ఏవేఁ సుబ్బులు ! అన్నం పెట్టవే" అం వంటగది వైపు వెళ్ళాడు. అప్పుడు పిల్లలిద్దరూ వాకట్లోకి చాప వేసుకొని కూర్చున్నారు.

రంగయ్య, సుబ్బుల మధ్య ఏం సంభాషణ జరిగిందో ఏమో... రంగయ్య కోపంగా అన్నం, కూరగిన్నెలన్నీ బయటికి తీసుకొనివచ్చి గిరాటు వేసి, మళ్ళీ లోపలికి వెళ్ళి భార్యను బంతిలా తన్నుకుంటూ బయటికి వచ్చాడు. జుట్టును గిరాగిరా త్రిప్పి డొక్కలో కాలుతో తన్నాడు. ఆ దెబ్బకు తాళలేక సుబ్బులు,

"ఓరి దేముడో... చచ్చిపోతున్నారో..." అని లబోదిబోమంటూ బిగ్గరగా కడుపు పట్టుకొని ఏడవసాగింది.

ఊహించని యీ సంఘటనకు కుమార్‌బాబు లేచి నిలబడి వణికిపోసాగాడు. రాముడెళ్ళి చెల్లెలిని ఎత్తుకొని,

"నాన్నా... నీకు బుద్ధిలేదు... మనిషివి కాదు" అన్నాడు.

"ఏందిరోయ్... పేలుతున్నావ్ ?" అని దగ్గరున్న కఱ్ఱ అందుకున్నాడు రంగయ్య. రాముడు వెంటనే చెల్లిని కుమార్‌బాబు చేతికిచ్చేసి తుఱ్ఱున బయటికి పరుగెత్తాడు.

"ఏవేఁ... నన్ను ఎదిరిస్తావా ?... నన్ను లెక్కలడుగుతావా ?" అని భార్యను బాదసాగాడు. ఆమె అరుపులకు పక్కింటి పరమానందం, ఎదురింటి ఎలమంద, వెనకింటి వెంకమ్మ, యింకా చుట్టుపక్కల చిన్నా పెద్దా అంతా వచ్చి గుమిగూడారు. ఒకడు వచ్చి రంగయ్య చేతిలోని కఱ్ఱ లాక్కుంటే ఒకడు గట్టిగా పట్టుకొని మర్యాదగా,

"ఏంటి రంగన్నా... ఏం జరిగింది ?" అనడిగాడు.

"ఏంటా... యిది నా పెళ్ళాం... నేను మొగుణ్ణి...నేను చెప్పినట్టు యిది పడివుండాల... అవునా ?..." అని ఎఱ్ఱటి కళ్ళతో వచ్చిన పెద్దమనుషులవైపు చూశాడు. "చెప్పూ చెప్పూ" అన్నట్టు అందరు మౌనంగా వింటూంటే–

"యిది నన్ను లెక్కడగుతాది. కోడికూర వండమని రెండు... రెండు రూపాయలిచ్చి వెళ్తే... పచ్చిపులుసు... బెండకాయ వేపుడూ... మజ్జిగా అంట... యిది నాకు పెట్టేది. సూత్తున్నకొద్దీ నెత్తికెక్కి కూకుంటున్నది" తూలుతూ రొప్పుతూ మాట్లాడుతూనే వున్నాడు రంగయ్య.

"రెండు రూపాయల్లో నేను బియ్యం,

ఈ దేశంలో...

ఏ ఇంటిగోడలు చూసినా
"నల్లగుండుని" మోసిన
శ్రీనాధునిలాగా
బాధాకరమైన
"నినాదాల్ని" మోస్తూ
తడగాళ్ళు పడుతూ
దైన్యంగా,
హైన్యంగా
కన్పిస్తుంటాయి !!

— కె. కిశోరుబాబు

— కె. అశోకుబాబు

మీ పంటలకు కావలసిన పోషణ అందుతోందా?

జై కిసాన్ సంపూర్ణ 19:19:19

జై కిసాన్ యూరియా 46.4% నత్రజని



ఏ ఇతర ఎరువు కన్నా హెచ్చు పోషక పదార్థములు కలవి!

* జైకిసాన్ సంపూర్ణ 19:19:19
  పోషక పదార్థములు 1:1:1 పాళ్లలో గల సంకీర్ణ ఎరువులలోకెల్లా మిన్నయైనది.
* నైట్రేట్-నత్రజని గల ఎరువులతో పోల్చితే, సంపూర్ణలోని నత్రజని ఏమీ వృథాపోదు.
* సంపూర్ణలోని పోషక పదార్థములన్నీ నీటిలో కరుగుతాయి.
* అందువలన పంటలపై దీని పనితనం తొందరగా కనబడుతుంది.
* జైకిసాన్ యూరియా 46.4%లో నత్రజని ఎంతో ఎక్కువ, బైయూరెట్ తక్కువ.
  అందుచేత ఇది అన్ని రకాలుగా వేయడానికీ, పంటపై పిచికారి చేయడానికీ సురక్షితమైనది
* అతి తెల్లనిది, అతి శుద్ధమైనది, అతి శక్తివంతమైనది.



జై కిసాన్ ఎరువులు

అత్యధిక దిగుబడి కోసం అత్యధిక పోషణ.

JAI KISAAN

జువారి అగ్రో కెమికల్స్ లిమిటెడ్, గోవా

ప్రాంతీయ విక్రయ కార్యాలయాలు: సికింద్రాబాద్, విజయవాడ, బెంగుళూరు, హుబ్లి, నాగపూర్, పూనా, జువారి నగర్.

LINTAS.ZUA.106-2315 TL

గైడ్ - గైడ్ - గైడ్

కోడికూర ఎలా తేనయ్యో'' అని బాధగా ఏడుస్తూ అన్నది సుబ్బులు.

''అదిగో మళ్ళీ నోరెత్తుతుంది ... నేను మొగుణ్ని ... నువ్వు ... నేను చెప్పినట్టు చేసి పడివుండాలా !'' అని మళ్ళీ కొట్టబోయాడు. అంతలో యిద్దరు పట్టుకుంటే –

''వదలెండెహే !'' అని విదిలించుకొని వాళ్ళమీద తిరగబడ్డాడు. ఏదోలే ! అని వూరుకుంటే మరీ రెచ్చిపోయాడు రంగయ్య మత్తులో.

''వీడి సంగతి వూరుకుంటే లాభంలేదు. బక్కెట్టు నీళ్ళుపోసి మంచానికి కట్టెయ్యండని'' అన్నాడు ఎలమంద. అన్నట్టు అందరూ అదే పనిచేశారు.

''అయ్యోయ్యో...చచ్చిపోతాడు బాబోయ్'' అని గొడవ చేయసాగింది సుబ్బులు.

''నిన్ను చంపుతుంటే లెక్కలేదుగాని ... మంచానికి కట్టేస్తే చస్తాడా? నువ్వూరుకోమ్మా! వెళ్ళి పిల్లను ఎత్తుకో ముందు. అరగంటనుంచి ఏడుస్తోంది'' అన్నాడు పక్కింటి పరమానందం. సుబ్బులు పిల్లను అందుకుంటూ,

''బెదిరిపోయావా బాబూ ? యిదంతా మాకు రోజూ మామూలే !'' అన్నది బాధలో కూడా నవ్వు తెచ్చుకుంటూ.

జరిగినదంతా చూసిన కుమార్‌బాబు చలించి పోయాడు.

సద్దుమణిగాక రాముడొస్తే ... క్రింద పడిన అన్నాన్ని కంచంలో తీసిపెట్టింది సుబ్బులు. అది కళ్ళార చూసిన కుమార్‌బాబు తన స్నేహితుని స్థితిని చూసి ద్రవించిపోయాడు. ఇంట్లోవున్నా...ఏం చేస్తున్నా కుమార్‌బాబుకు,

''రాముడు కూడా తనలాగే చక్కటి బట్టలేసుకొని చక్కగా వుంటే ఎంత బాగుండును?'' అని ఒక ఆలోచన. ''నాన్నగారు అలాచేయరే ! ... మరి రాముడి నాన్న ఎందుకు అలాచేస్తాడు ?'' అని బాధపడసాగాడు ఉండలేక రాముడి గూర్చి వాళ్ళ అమ్మా, నాన్న తాతగార్లతో చెప్పి బావురుమనేవాడు.

''రాముడు చాలా మంచివాడు. అతను నాలాగే హాయిగా ఉండాలి. రాముడు బాధపడుతూంటే నేను చూడలేను !'' అని మరిమరి యింట్లోవాళ్లతో చెప్పుకునేవాడు. అతని పెద్దలు ఏదో సర్దిచెప్పి అతన్ని బుజ్జగించేవారు.

కొన్నాళ్ళ తర్వాత కుమార్‌బాబు వాళ్ళు యిల్లు మారవలసి వచ్చింది. కొత్త యిల్లు రంగయ్యవాళ్ళ రిక్షాకార్ఖానా దగ్గర ఉంది. ఇల్లు స్కూలుకు చాలా దూరముందని, కుమార్‌బాబు రోజూ వెళ్ళి రాలేడని జీతంమీద రిక్షావాడ్ని మాట్లాడితే మంచిదని నిర్ణయించారు కుమార్‌బాబు పెద్దలు.

అదృష్టం కొద్దీ ఆ అవకాశం రంగయ్యకే వచ్చింది. కుమార్‌బాబు మున్ముందు రంగయ్యను చూసి భయపడినా తర్వాత రంగయ్య కలుపుగోలుతనాన్ని చూసి ధైర్యం తెచ్చుకున్నాడు. రంగయ్య సరదాగా కబుర్లు చెపుతూ కుమార్‌బాబును బాగా ఆకర్షించాడు.

ఆ సంగతి తెలిసిన రాముడు చాలా సంతోషించాడు. కాని కుమార్‌బాబు మాత్రం తాము స్నేహితులమని రంగయ్యకు తెలియనీ వద్దన్నాడు అటు రంగయ్య ఎవడో వాళ్ళ అమ్మా నాన్నలకు తాతగారికి తెలియనివ్వలేదు.

రంగయ్య మాత్రం కష్టపడి బాగా సంపాదించేవాడు. కాని అంతా నాటుసారాకు ధారబోసేవాడు. ఒకసారి బాగా త్రాగేసి ఒళ్ళుతెలియని మైకంలో పడిపోయాడు. ఉన్నపంచి ఊడిపోయి దిగంబరంగా ఉన్నాడు. అది నడివీధి. అటు వచ్చిన రాముడు, కుమార్‌బాబులు చాలా బాధపడ్డారు. నిషాదిగిన తర్వాత కుమార్‌బాబుఅడిగితే రంగయ్య నాకేం గుర్తులేదన్నాడు. ''అందుకే తాగినవాడు పశువుతో సమానం'' అని తాతగారు చెప్పిన మాట గుర్తుకొచ్చింది కుమార్‌బాబుకు.

కొన్నాళ్లకు రంగయ్యకు నాటుసారాపై మొహం ఎత్తింది. ఆలోచన బ్రాంది, విస్కీలపై మళ్ళింది. 'ఒకేసారి పెట్టుబడి కావాలి కదా' అని ఆలోచిస్తూంటే కుమార్‌బాబు వాళ్ళు యిచ్చే జీతం గుర్తుకొచ్చింది.

''బలే !...తింటే అడవి మాంసం తినాలిగాని... యీ చప్పిడిరకాలు ఎన్నాళ్ళు కొట్టినా యింతే !'' ననుకొని జీతంకోసం ఎదురు చూడసాగాడు.

అయినా మధ్య మధ్యలో తాగటం యింట్లో భార్యా పిల్లలను ఏడిపించడం మాత్రం మానలేదు. అన్ని విషయాలు కుమార్‌బాబుకు తెలుస్తూనే వున్నాయి.

ఇటు రాముడుకు స్కూల్లో చాలా గడ్డు రోజులు వచ్చాయి. అచ్చు పుస్తకాలు, నోట్సులు వగైరా వగైరా లేవని మాష్టారు రాముడ్ని కష్టపెడుతూనే వున్నారు. బెంచి ఎక్కిస్తున్నారు. గంటల తరబడి ఎండలో నిల్చోబెడుతున్నాడు. అయినా రాముడి తల్లి తిండి మాత్రం పెట్టగలిగేది కాని స్కూలుకు సంబంధించినవి మాత్రం సమకూర్చలేకపోయింది. రంగయ్య మాత్రం హాయిగా తాగి తందనాలు ఆడుతూనే వున్నాడు.

చూసి చూసి ఒకరోజు మాష్టారు నెల రోజులు గడువుయిచ్చి, అచ్చు పుస్తకాలు తీసుకొని రాకపోతే పేరు కొట్టేస్తానని బెదిరించారు. పాపం! రాముడు దిగులు పడిపోసాగాడు. కుమార్‌బాబు విచారానికి అంతులేదు. రాముడు స్కూలుకు రాకపోతే తను ఒంటరివాడై పోతాడు. తనలోని బలహీనతను గుర్తించి మిగతా విద్యార్థులు ఆటపట్టిస్తారు. రాముడైతే చక్కగా మాట్లాడుతాడు. తనతోనే బాగా ఆడతాడు... ఇక రాముడు పేరు కొట్టేస్తే ఎలా?...అన్నిటికీ ఆ రంగయ్యే కారణం. తమ యింటికి నాన్నగారు

దాంపత్యాన్ని గురించి



ధర్మపథం

– బులుసు వేంకటరమణయ్య

భార్యాభర్తలకు దాంపత్యమనేది పవిత్రమైనది. సంసార జీవితంలో ఇద్దరూ భేదంలేకుండా ప్రవర్తించాలనేది దీని ముఖ్యోద్దేశం. శారీరకంగానూ, మానసికంగానూ ఇద్దరూ ఒక్కటే అనే భావం పరస్పరం ఉండాలి. "దంపతులు" అనేది ఒకే పదం. దాని అర్థం భార్యాభర్తలు. ఈ పదమే వారి ఐక్యతను తెలుపుతూ ఉన్నది.

వివాహానికి ప్రధానమైన పేరు పాణిగ్రహణం. అంటే చెయ్యి పట్టుకోవడం. అంటే – సంసార జీవితంలో ఒకరికొకరు ఆసరాగా ఉండడం అన్నమాట. అలా ఉన్నప్పుడు కష్టంగాని, సుఖంగాని సమానంగా పంచుకోవాలి. ఎట్టి అవస్థ సంభవించినా ఒకరినొకరు అనుసరించే ఉండాలి. అట్టి దాంపత్యంలోనే మనస్సుకు శాంతి లభిస్తుంది. వార్ధక్యంలో కూడా ఒకరిపై ఇంకొకరికి అభిమానం తగ్గదు. అందువల్లనే జీవితాంతం ఒకరినొకరు విడిచిపెట్టి ఉండడమనేది లేదు. ఇప్పుడున్నట్లు విడాకులుఇచ్చే ప్రసక్తే ఉండదు. మనవారి వివాహ సంస్కారంలోని పద్ధతి ఇదే.

ఆదిమ దేవతలైన త్రిమూర్తుల విషయంలో కూడా ఈ సంప్రదాయం వ్యక్తమవుతున్నది. శివుడు అర్ధనారీశ్వరుడు – అంటే శివుని శరీరంలో సగభాగం పార్వతి. తనకంటె తన సతీమణి వేరుకాదనే విషయాన్ని యిది సూచిస్తున్నది. విష్ణుదేవుని వక్షంపై లక్ష్మీదేవి ఉన్నదంటే – ఆయన హృదయంలో ఉన్నదన్న మాట. బ్రహ్మనోటిలో సరస్వతీదేవి ఉన్నదంటారు కదా ! ఆ వాగ్దేవి సృష్టికర్త నోటిలో ఉండడం సహజమే! ఆ దంపతుల యిద్దరిమాటా ఒకటే అనే అంశం దీనివల్ల తెలుస్తున్నది. ఇలా, మనోవాక్కాయాలలో దంపతులు త్రికరణశుద్ధిగా – భేదం లేకుండా ఉండడం పయి పురాణగాథల వల్ల తెలుసుకోవలసి ఉన్నది.

పెండ్లి తంతులో అగ్నిసాక్షిగా వధూవరుల చేత పరస్పరం అనుకూలంగా ప్రవర్తిస్తామని ప్రమాణం చేయిస్తారు. ఈవిషయం గ్రహింపక చాలామంది సంప్రదాయాల కిందా, లాంఛనాల కిందా లెక్క కడతారు. వివాహమనేది సంప్రదాయ సిద్ధమైన ఒక సంస్కారమని భావిస్తారు. దాంపత్య తత్వాన్ని గ్రహించినవారు మాత్రం దీన్ని అతి పవిత్రమైన సంస్కారంగానూ, జీవితంలో ప్రధానమైనదిగానూ భావిస్తారు. ★

అన్నీ ఎలా సమకూర్చుతున్నారో అలాగే రాముడికి రంగయ్య అన్నీ సమకూర్చాలి రాముడ్ని ప్రేమతో చూసుకునేలా చెయ్యాలి. ఏదో ఒక వుపాయం ఆలోచించి, బాగా బుద్ధి చెప్పాలని నిర్ణయించుకున్నాడు. చివరకు ఒక వుపాయం ఆలోచించి మనసులో పెట్టుకున్నాడు.

రంగయ్య జీతం త్వరలోనే వస్తుందని తను దొరలు తాగే బ్రాంది, విస్కీలు, బిర్యానిలు, కోడివేపుళ్ళు తింటానని కలలు కంటున్నాడు. నలుగురు మిత్రులతో చెప్పి, వాళ్ళనుకూడా కొంత సొమ్ము తెచ్చుకొని తనతో కలవమని ప్రోత్సాహించాడు. స్వర్గమే చూడబోతున్నట్టుగా వుంది అతనికి. చాలా హుషారుగా వుండసాగాడు.

అనుకున్నరోజు రానే వచ్చింది. రంగయ్య జీతం కోసం కుమార్‌బాబు యింటికి వెళ్ళాడు. ఆ రోజు కుమార్‌బాబు పుట్టిన రోజు. కొత్త బట్టలేసుకొని కుమార్‌బాబు తాతగారిని పిలుచుకొని హడావుడిగా బయటికొచ్చి,

"రంగయ్యా అర్జంటుగా బజారు వెళ్ళాలి పద. అలాగే నీ జీతం కూడా యిస్తాను" అన్నాడు. మారు మాట లేకుండా రంగయ్య యిద్దర్ని రిక్షా ఎక్కించుకొని బజారు తీసుకెళ్ళాడు.

బజారులో కుమార్‌బాబు తాతగారి సహాయంతో కావాల్సినవన్నీ కొన్నాడు. తర్వాత రిక్షాను రంగయ్య యింటికే పోనివ్వమన్నాడు. తనింటికెందుకో అర్థం కాలేదు రంగయ్యకు.

రిక్షా రంగయ్య యింటికెదురుగా ఆగగానే రాముడు, అతని తల్లి బయటకు వచ్చారు.

"రాముడూ ! ఈ రోజు నా పుట్టినరోజు! యిదిగో మిఠాయి" అని అందిస్తూ మళ్ళీ అన్నాడు "ఈ రోజు నా పుట్టినరోజే కాదు ... మీ నాన్నకు జీతం వచ్చేరోజు. ఆ డబ్బులలో నీకు అచ్చుపుస్తకాలు, నోట్సులు, జతబట్టలు కొన్నాను" తెచ్చిన వస్తువులన్నీ యిచ్చాడు. రంగయ్యకు మాత్రం నోటమాట రాలేదు.

"రంగయ్యా! నువ్వు సంపాదించినదంతా తాగి పాడుచేసుకుంటున్నావని, రాముడ్ని స్కూల్లో తీసేస్తారని రోజు బాధపడుతూ చెప్పేవాడు కుమార్‌బాబు. నీ జీతం నీ కుటుంబానికి పనికి వచ్చేలా చేస్తే నువ్వు కాస్త తెలుసుకుంటావని యిలా చేశాను" అని కుమార్‌బాబు వాళ్ళ తాతగారు అన్నారు.

కుమార్‌బాబు రాముడితోగల అనుబంధాన్ని, రాముడు పడుతున్న బాధలను మొదటినుంచి చివరిదాకా వివరంగా చెప్పాడు.

"ఇప్పుడు చెప్పు రంగయ్యా ... నేను చేసింది తప్పంటావా ? మా నాన్నగారు మమ్మల్ని ఎలా సంతోష పెడుతున్నారో – అలాగే నువ్వు కూడా మీ యింట్లో వాళ్ళను సంతోష పరచాలని యిలా చేశాను. రాముడు చాలా బాగా చదువుతున్నాడు. వాడి చదువు ఆపొద్దు రంగయ్యా. రాముడు చదువు మానేస్తే ... నేను కూడా సరిగా చదువుకోలేను" అని కుమార్‌బాబు అంటే రంగయ్య గతాన్ని తలచుకొని తప్పులను గుర్తించి,

"బాబూ... నా కళ్ళను తెరిపించావు. నిజంగా పశువులాగా ప్రవర్తించాను. ఇంకెప్పుడూ తాగను. నీమీద ఒట్టు. ఎన్ని కష్టాలు వచ్చినాసరే రాముడ్ని బాగా చదివిస్తాను. వృద్ధిలోకి తెస్తాను" అని మాటిచ్చాడు. అన్న మాట ప్రకారం రంగయ్య యిప్పటికి బుద్ధిగా వున్నాడు. కాని కుమార్‌బాబు పెరిగి పెద్దవాడై అంతా మరచిపోయాడు. అడ్డదార్లు తొక్కాడు. మారని రంగయ్యను చూడగానే బాల్యమంతా గుర్తుకొచ్చింది. ఒకనాడు తనేమిటో యిప్పుడు తను ఏం చేస్తున్నాడో తెలుసుకున్నాడు.

అలా కథ పూర్తిచేశాడు కిరణ్.

"మాటలతో మచ్చిక చేసుకొని అడగగా తన కథంతా చెప్పాడు కుమార్‌బాబు. పసితనంలో మనిషిలో దైవం ఉంటారంటారు. అందుకే తనలాగే రాముడుండాలని ఆశించాడు. పరిస్థితులనుబట్టి విడిపోయినా రంగయ్య బుద్ధిగానే వున్నాడు, కాని కుమార్‌బాబు ? ఒకనాడు రంగయ్యకు కుమార్ బాబు 'గైడ్' అయ్యాడు. ఈనాడు కుమార్‌బాబుకు రంగయ్య "గైడ్" అయ్యాడు. మళ్ళీ కుమార్‌బాబు నాకు 'గైడ్' అయ్యాడు. కనుక రేపటి నుంచి నేను మందు పార్టీలకు, పేకాటలకు రానేరాను." అని చెప్పి స్నేహితుల నుంచి చల్లగా జారుకున్నాడు కిరణ్. ★

ముంధా వెంకట రమణారావు సీరియల్

ఉదయసంధ్య

7

(గత సంచిక తరువాయి)

"అయితే ఆ ఊర్వశివి నువ్వా ?" చంద్రం అడిగేడు 'భారతి' తిరగవేస్తూ. సీతా రామయ్య ఇంటికి అన్ని తెలుగు పత్రికలూ వస్తాయి. అతనికి 'భారతి' అంటే అభిమానం. "ఇప్పుడా స్టాండర్డంతా పోయింది. తల్లిశెట్టి రామారావు కార్టూన్లేవీ ? బాపిరాజు రచనలేవీ ? హేమాహేమీలు రాసేవారు. అబ్బే... ఇప్పుడంతా పోయింది." రామారావులేచేడు... కాఫీతాగేడు. బట్టలు వేసుకోని ఆఫీసుకివెళ్ళేడు...సాయంత్రం ఇంటికొచ్చి, భోజనం చేసి పడుకున్నాడు... ఇదీకథ...నేను చెప్పినట్టే ఈ రచనలూ ఉన్నాయి. అంటాడతను.

లత నవ్వింది..."ఊర్వశిని నేనుకాను...నేను మానవకాంతని. ఊర్వశి దేవలోకంలో ఉంది. ఈ కవికుమారుడు శాపవశాత్తూ భూలోకంలో పడ్డ గంధర్వుడు..."

"లేదు. నువ్వు ఊర్వశివే. వాడికీ స్వర్గం చేరుకొందుకి శాపం అడ్డొస్తుంది. నీకూ తక్కిన ఆడపిల్లలకీ ఎంతతేడానో చెప్తున్నాడు కవి..." చంద్రం మత్తుగా చూశాడు లతని. ఇద్దరూ గదిలో ఒంటిగా ఉన్నారు. తక్కిన వాళ్ళంతా ఇంకా గూటికి చేరుకోలేదు.

"నేను ఊర్వశిలా ఉంటానా ? నువ్వు చూసేవా ఊర్వశిని ?" లత అడిగింది నవ్వు ఆపుకుంటూ...

"నిన్ను చూస్తే ఊర్వశిని చూడాలా ? ఏం నవ్వు ! ఆనవ్వు అందం మరెవరికుందీ ప్రపంచంలో !"

"నువ్వు కవిత్వం రాస్తావా ఏమిటి ?"

"నీ అందంచూసి ఎందరో కవులు పుడతారు...ఎందరో చిత్రకారులు జన్మిస్తారు. హెలెన్ ఆఫ్ ట్రాయ్‌లాటి దానిని నువ్వు...నేను) అందాన్ని ఎన్నో కోణాలలోంచి చిత్రిస్తాను... పెయింట్ చేస్తాను...ఆ చిరునవ్వు నీది కేచ్ చెయ్యాలి..." చంద్రం లత గడ్డంక్రింద చెయ్యి పెట్టి ఆ ముఖాన్ని పరిశీలిస్తూ అన్నాడు.

చంద్రం సున్నితమైన వ్రేళ్ళు గిలిగింతలు పెట్టినట్టయి లత కిలకిలానవ్వింది. ఆ పొగడ్తకీ, ఆ స్పర్శకీ ఆమెలోని ఆడది మేల్కొంది... "ఇంకా...ఇంకా ఏం చేస్తావు ?" అని అడిగింది.

"నీ చిత్రాలన్నీ ప్రపంచపు వివిధ ఆర్ట్ గేలరీస్‌లో ప్రదర్శిస్తాను...నాకూ పేరు ప్రతిష్టలూ.. డబ్బూ... నీఅందం ప్రపంచం అంతా కీర్తన చెయ్యబడుతూ...కొన్ని వందలఏళ్ళు గడిచినా చెక్కుచెదరదు" చంద్రం వ్రేళ్ళు ఆమె చెవులనీ, ముక్కునీ మెల్లగా రాసి, పెదవులని సున్నితంగా తాకేయి.

"ఇంకా ఏంచేస్తావ్..." చంద్రం ఉంగరాల జుత్తుని, మత్తయిన కళ్ళనీ చూస్తోంది లత.

"నిన్ను పెళ్ళిచేసుకుంటాను..." అన్నాడు చంద్రం.

"ఛీ...పో...పెళ్ళా ! అంతమూడూ పాడు చేసెవ్...పెళ్ళెవడిక్కావాలి ? ఊర్వశి పెళ్ళిచేసుకుందా ?" లత లేచిపోయింది, చెయ్యి విదిలించకొని...

చంద్రం ముఖం వాడిపోయింది..."పెళ్ళి చేసుకోవా ఆడదానివయ్యేక ?"

"ఇవాళ నేను దేవకాంతని చంద్రం. దేవతల్లా మాట్లాడు...గంధర్వుడిలా కలలుకను..."

చంద్రం లేచి నిల్చున్నాడు..."అయితేవిను. నిన్ను నేను ప్రేమిస్తున్నాను..." తడబడుతూ అన్నాడు.

"అదికొంత నయం. ప్రేమించు ఘాటుగా ప్రేమించు కాని పెళ్ళిమాట ఎత్తకు" నిటారుగా నిలబడింది లత. ఆమెకళ్ళు ఆహ్వాన పూర్వకంగా చూస్తున్నాయి అతడి వ్రేళ్ళకేసి...అతడి పెదవులకేసి; కళ్ళకేసి.

చంద్రం ముందుకు వెళ్దాం అనుకున్నాడు కాని జంకేడు... "పెళ్ళి కాకపోతే నిన్నెలా పెయింట్ చెయ్యను ?"

"ఏం ఏమిటడ్డు ?" లత అడిగింది...

"నీ అందం నాకెలా తెలుస్తుంది ?"

"అంటే...?"

చంద్రం తడబడ్డాడు "అందం అంటే ఉత్తమొహమేనా ? కాళ్ళూ, చేతులూ, ఒళ్ళూ"

లత చిరునవ్వు నవ్వింది ... "మొహంలో అందాన్ని చిత్రించలేనంటావ్.. వెంకటేశ్వరులు కవిత్వం రాసేడు ... నా కాళ్ళూ, చేతులూ, ఒళ్ళూ చూసేడా ? ఎంత బాగా రాసేడు..."

"కవిత్వం వేరు ... బొమ్మలు గియ్యడం వేరు...ఆడదాని బొమ్మ గియ్యాలంటే ఆడది బట్టల్లేకుండా ఎలా ఉంటుందో...దాని శరీరంలోని ప్రతి భాగం యొక్క అందం తెలియాలి." తెగించి అన్నాడు చంద్రం, వెంకటేశ్వరులు మీద కలిగిన అసూయతో.

"అదాసంగతి ! అలా చెప్పు ! నన్ను నీ ముందు...ఛీ! ... అమ్మా! చూడు చంద్రం ఏమంటున్నాడో !" అని కేకవేసింది లత నవ్వుతూ...ఆమె కేక వెయ్యకుండా, భయంతో ముందుకు వచ్చి ఆమె నోరు మూసేడు చంద్రం, ఒక చెయ్యి ఆమె నడుము చుట్టూ వేసి..."ఉస్! ఊరుకో! ఏమిటీ పెంకితనం..." లత కళ్ళతో నవ్వుతోంది...లత నవ్వు చూసిన చంద్రం ధైర్యంగా ఆమెను దగ్గరకు తీసుకోబోతున్నాడు...

"వారాలబ్బాయొచ్చేడు" నరసమ్మ కేక వేసింది క్రిందనించి. ఆ కేక చల్లటి చన్నీళ్ళలా తగిలి, చంద్రం లతని వదిలిపెట్టి దూరంగా పోయేడు...

వెంటనే లత ముఖం ముడుచుకుంది. పళ్ళతో క్రింది పెదవిని గట్టిగా కొరుకుకుంది. చంద్రం కుర్చీలో కూలబడి లతకేసి చూస్తూ అన్నాడు ... "ఈ వారాలవాడింకా మనల్ని వదలడా ?" వాడే రాకుండా ఉంటే ఆ పెదవులలో ఎంత మధువు ఉందో తెలుసుకొని ఉండును తను... ఎంత అందమైనదీ లత !

జరిగిన కథ — 5 : రామం వారాలు చేసుకుంటూ చదువుకుంటుంటాడు. దుర్గమ్మ కూతురు మీనాక్షి రామాన్ని ఆదరిస్తుంది. పూర్ణమ్మ ఇంటిలోని వీధి కొట్టులో రామం నివాసం. ప్లీడరు సీతారామయ్యగారి మేనకోడలు నిర్మలకు రామం అంటే ఇష్టం. శాంతమ్మగారి నడిగి వాళ్లింట్లో గదిలో ఉండడానికి నిశ్చయించుకుంటాడు రామం. వెంకటేశ్వరులు రాసిన ప్రేమ పద్యాలు చదివి లత రామంమీద విరుచుకుపడి అతనిని అవమానిస్తుంది. శాంతమ్మ రామంను తమ ఇంటికి వచ్చి ఉండమని చెపుతుంది. రామం మాటలను పెడచెవిన పెడతాడు వెంకటేశ్వరులు. నిర్మలంటె విశాలకి పడదు. వరలక్ష్మి రామాన్ని రత్నాన్ని ఒక దారిలో పెట్టమని కోరుతుంది. రామం సెలక్షన్సులో మొదటివాడుగా సెలక్టయ్యాడు. వెంకటేశ్వర్లు రాసిన పద్యాలు 'భారతి'లో ప్రచురింపబడ్డాయి. రామం తండ్రి నుంచి మనియార్డరు, ఉత్తరం అందుకొంటాడు.

కాలేజీలో ఇందరు ఆడపిల్లలున్నారు. ఎవ్వరూ లత కాలి గోటికి సరిరారు. ఇంక లత కాలేజీలో చేరుతే ఏమన్నా ఉందా ? ఎన్నాళ్లకిలా ఒంటరిగా లత దొరికింది... ఎప్పుడూ ఈ ఇంట్లో ధర్మ సత్రంలోలాగా మనుష్యులు.

ఎక్కడినించో నిర్మల పరుగెత్తుకొచ్చింది గదిలోకి... ''భారతిలో వెంకటేశ్వరుని పద్యాలు పడ్డాయే...లతా...అవి నిజంగా వాడు రాసినవి కావు...రామం రాసేడు...నాకు విశాల చెప్పిందే... వెంకటేశ్వర్లు రాసిందంతా తరవాత రామం మార్చేసి ఇలా రాసేట్ట...అదీ సంగతి...ఎంతో బాగా రాసేట్ట...రామమే అర్థాలు చెప్పాలి... ఏంరా అన్నా...ఇక్కడేం చేస్తున్నావ్...సుబ్బుడు నిన్ను సినిమా హాల్ దగ్గరకు రమ్మన్నాడు... మరిచిపోయేవా ?'' చేతులు ఊపుకుంటూ కళ్లు తిప్పుకుంటూ చెప్పింది నిర్మల.

''అదా సంగతి...ఈ వారాలబ్బాయి గారు ఈ రంగంలోకి దిగేరన్నమాట...పిలు రామాన్ని...'' అన్నాడు చంద్రం.

నిర్మల వెళ్లి రామాన్ని పిలిచింది. రామం వచ్చాడు. టేబులు మీద 'భారతి' కనిపించింది. వెంకటేశ్వరుల కాపీ నిన్న వచ్చింది. రామంవచ్చి లతనీ, చంద్రాన్నీ చూసేడు. ఇద్దరి ముఖంలోనూ కోపం కనిపిస్తోంది. నిర్మల అంది...''ఇదుగో రామం...అడగండి అర్థం...''

చంద్రం తలుపు దగ్గరగా వేసివచ్చి అడిగేడు...''ఈ భారతిలో ఊర్వశి అన్న పేరుతో వెంకటేశ్వరులు రాసిన పద్యాలు చదివేవా ?''

''చదివేను.''

''ఎలా ఉన్నాయి ?'' చంద్రం అడిగేడు.

''ఇదే మొదటిసారి రాయడం. రాయగా రాయగా మంచి శైలి పట్టబడుతుంది...''

''అయితే ఇంకా రాస్తాడన్న మాట! ఊర్వశి అయింది...ఇంక మేనక అని రాస్తాడా ?''

రామం ఊరుకున్నాడు...నిర్మల, అన్న కోపం గ్రహించి మాట్లాడలేదు.

''తిన్న ఇంటి వాసాలు లెక్కపెట్టేవాడివి నువ్వు...జిత్తులమారి నక్కవి. ఏమీ తెలియని



అమాయకుడిలా తిరుగుతూ ఇదా చేస్తావ్ ?'' చంద్రం గొంతు పెంచేడు.

''మీరంటున్నదేమిటి ?'' రామం భయపడుతూ అడిగేడు. ఈ ఆరోపణ ఘోరంగా ఉంది.

''ఇంకా అర్థంకాలేదా ? ఈ పద్యాలు రాసింది నువ్వుకాదా ? ఇవి లతని ఉద్దేశించి రాసినవి కావా ? ఈ ఇంట్లో తింటూ, ఈ ఇంట్లో మనుష్యులకు దగ్గరగా ఉంటూ నువ్వు చేస్తున్న పని ఇదా ? నీకీ ఇంట్లో అడుగు పెట్టడానికన్నా అర్హత ఉందీ ? చెప్పు... నువ్వే రాసేవా ?'' చంద్రం రామం భుజం పట్టుకున్నాడు. ప్రమాదం పసికట్టి నిర్మల బయటకు వెళ్లి అమ్మని పిలుచుకొద్దాం అనుకుంది. చంద్రం వెంటనే అది పసికట్టి అన్నాడు... ''నిర్మలా నువ్వు వెళ్లకు... ఉండు... విశాల ఏం చెప్పింది నీకు ?''

నిర్మల చాలా ఇరకాటంలో పడిపోయింది... ఇలా పరిణమిస్తుందని ఊహించలేదు... ''ఏమో నాకు తెలీదు...'' నిర్మల కోపంగా అంది.

''ఇప్పుడే అన్నావ్ కదూ...రామం ఆ పద్యాలు మార్చి రాసేడని... చెప్పు !''

''ఒరే అన్నా... నేనేం అలా చెప్పలేదు. పోనీ రామం రాసేడనుకో... నీకేంరా మధ్యని ? అందులో లత పేరు ఉందా ఏం ? నువ్వలా రాయలేవని నీకేడుపు...'' నిర్మల రామం సహాయానికొచ్చింది.

లత రామంకేసి చూసి అడిగింది... ''ఏం రామం... ? నువ్వేనా రాసేవ్ ?''

రామం అణకువగా అన్నాడు... ''ఉన్న సంగతి చెప్తాను. ఆ రోజు మీరు ఆ పద్యాలని పత్రికకి పంపమని వెంకటేశ్వరులుతో అన్నారు. అది పంపుతానన్నాడు. అయితే అవి ఒక గంధర్వుడి కథ రూపంలో పంపుతే బాగుంటుంవని నే చెప్పేను. పద్యాల సంఖ్య ఎక్కువ చేసేం.

ఉదయ సంధ్య

శైలి వెంకటేశ్వరులుదే. నేను భావం ఇచ్చేను... పద్యాలు కొద్దిగా మార్చేను. ఇవి ఎవ్వరిని ఉద్దేశించినవీ కావు. మీకలా అనిపిస్తే మమ్మల్ని క్షమించండి !''

ఆ మాటలు రామం అనడమేమిటి చంద్రం రామం చెంపలు ఛెల్లుమనిపించేడు...

''బ్లడీ రోగ్ ! ఇదా నువ్వు చేస్తున్న పని... చేసిన తప్పుడుపనికి నిన్ను క్షమించాలిరా ? ఈ ఇంట్లో అడుగు పెట్టడానిక్కూడా అర్హత లేనివాడివి... చేరనిస్తే... నువ్వు చేసేదిదా ? రేపట్నించి ఈ ఇంటి గడప తొక్కకు...'' మరో రెండు చెంపపెట్లు.

నిర్మల కేకలు పెట్టింది... ''ఒరే అన్నా... రామాన్ని కొట్టకు ! నువ్వెవడివిరా రామంమీద చెయ్యిజేసుకుందుకి... అమ్మా ! అత్తయ్యా ! రామాన్ని అన్న తంతున్నాడు !'' నిర్మల ఏడుస్తూ కేకలుపెట్టింది. చంద్రం చెల్లెలి గూబమీద కూడా ఒకటి అంటించేడు... ''నోర్మొయ్యి... స్టుపిడ్ !''

రామం తల దిమ్మెక్కిపోయింది. కళ్లు గిర్రున తిరిగేయి. పొద్దున్న పదికి తిన్న తిండి, కడుపులో మంచినీళ్లు తప్ప మరేమీలేవు. కార్బన్ కాగితం పెట్టి మూడు కాపీలు నోట్సు ఇప్పటి వరకూ రాసేడు. ఆకలి ఎక్కువయింది. ఆదినారాయణ ఇంటికి వెళ్తే తినడానికిస్తారు. కాని ఆ ఇల్లు దూరం. సీతారామయ్యగారింటికి పోయి కూర్చుందాం అనుకున్నాడు. వంటయితే తనకి ముందు పెట్టి పంపించేస్తుంది శాంతమ్మ. ఇంకా సాయంత్రం ఆరయింది. కాని బాగా చీకటిపడిపోయింది.

లత అప్పుడంది... ''చాల్లే చంద్రం...'' ఆమె కళ్లల్లోకి ఏదో తృప్తి వచ్చింది... ఇదివరకు పెదవులని గట్టిగా కరచుకున్న ఆమె

" ? "

ఆకలి చావులతో
కేక లేస్తుంటే –
ధర్మం, మానవత్వం,
న్యాయం, సమానత్వం,
అంటూ
ఊకదంపు కబుర్లతో
చెవి కోసిన మేకలా
పిచ్చి గంతులేస్తాడేంటీ కవి ?
పట్టెడన్నం పెట్టగల
సహృదయత లేనపుడు,
అర్థంలేని ఈ వుపన్యాసం
ఎవర్ని ఉద్ధరించను ??

— కోలపల్లి ఈశ్వరరావు

ఇప్పుడు నరాలకి విశ్రాంతి దొరికినట్టుగా హాయిగా చూస్తోంది.

కడుపులో ఆకలికి తోడుగా ఈ అనుకోని సంఘటన... అవమానం... దానికితోడుగా దెబ్బలు... ఏదో చెప్పబోయేడు... కాని మాటలు రాలేదు. చంద్రం చెయ్యివేస్తూ కనిపించింది... తెలివి తప్పిపోయి క్రిందని పడిపోయేడు రామం. సిరామరకల పాత బట్టలతో, ఆ నేలమీద, నీరసంగాపడి ఉన్న ఆ దేహం రోడ్డుమీద మూర్ఛ వచ్చి పడిపోయే ముష్టివాడి జీర్ణించిన దేహంలా ఉంది.

నిర్మల కేకలు పెడుతూ క్రిందికి పరుగు తీసింది... ''అమ్మా ! రామాన్ని అన్న చంపేసేడు !'' అని ఏడుస్తూ.

లత ముఖంలోని సంతోషం పోయింది. భయం ప్రవేశించింది. ''చంద్రం... ఎందుకిలా పడిపోయేడు ? ఏం చెయ్యడం... అసలెందుకలా కొట్టేవ్...''


''నువ్వు కిందికి వెళ్లి నీళ్లు తీసుకరా... నీళ్లు జల్లితే తెలివొస్తుంది... వేగం...'' చంద్రం భయపడుతూ అన్నాడు... లత కిందికి పరుగెత్తింది...

కాని ఇంతలో సీతారామయ్యగారు గదిలోకొచ్చేరు నిర్మలతో... చంద్రాన్ని చూసి అన్నారు ''నువ్వేనా కొట్టేవ్ ?'' ఆ గొంతులో కాఠిన్యం.

చంద్రం మాట్లాడలేదు... తల దించుకున్నాడు... సీతారామయ్య క్రిందికివంగి రామాన్ని లేవనెత్తి స్వంతంగా తన గదికి తీసుకెళ్లి, మంచంమీద పడుకోపెట్టేడు... ''నిర్మలా డాక్టర్‌గారిని కేకవెయ్యి...'' అని అనడమేమిటి నిర్మల పరుగు తీసింది. ఎదురింటి వర్మ డాక్టర్‌గారి ఇంటికి.

* * *

రామానికి తెలివి వచ్చేసరికి సీతారామయ్యగారు తేలికగా నిట్టూర్చేరు. వర్మ డాక్టరు





సన్‌రైజ్ ఫ్లాస్క్
సదుపాయం
ఉచితం!
ఈ ప్రత్యేకతగల సన్‌రైజ్ థర్మోస్ ఫ్లాస్క్ మీ సొంతమే !
కేవలం 5 ఖాళీ సన్‌రైజ్ 200 గ్రా. రీఫిల్ ప్యాక్‌లు యిచ్చి వాటి బదులు దానిని తీసుకోనవచ్చును.
సన్‌రైజ్ మంచి మరొకటి గొప్ప విలువైన సదుపాయం. 5 ఖాళీ సన్‌రైజ్ 200గ్రా. రీఫిల్ ప్యాక్‌లను సేకరించి, వాటిని మీ డీలర్ దగ్గరకు తీసుకువెళ్ళండి. అంతే, ఒక వారం లోపున, మీ సొంత సన్‌రైజ్ ఫ్లాస్క్, ఆయన దుకాణంలో మీ కోసం ఎదురు చూస్తూ ఉంటుంది. మీరు చేయవలసిందల్లా, మళ్ళీ మీ డీలర్ వద్దకు వెళ్ళినప్పుడు, దానిని తెచ్చుకోవడమే. చాలా సులువైన పని, అవునా? అందుచేత మీ సేకరణ ప్రారంభించండి-ఇప్పుడే!
Nestlé sunrise
Refill Pack
200g
త్వరపడండి!
ఈ సదుపాయం
సెప్టెంబరు 15, 1984తో
ముగుస్తుంది
sunrise
కొత్త
Nestlé
సన్‌రైజ్
ఇన్‌స్టెంట్
ప్రాతఃకాలపు ఆ తాజాతనాన్ని అనుభూతి చెందేందుకు
8252

అన్నాడు... "ఒంట్లో బలంలేదు కుఱ్రాడికి... మంచి టానిక్‌లూ, తిండీ పడాలి..."

రామం లేవబోయాడు. చుట్టూ ఇంటిల్లపాదీ ఉన్నారు. సిగ్గు వేసింది. చెంపలు మండుతున్నాయి. దవడ నొప్పెడుతోంది. లేవబోగానే "లేవకు పడుక్కో... ఈ వేడిపాలు తాగు" అని శాంతమ్మ వచ్చి మంచంమీద కూర్చొని పాలగ్లాసు ఇచ్చింది. పాల వాసన పడకపోయినా తాగక తప్పలేదు. దాంతో నీరసం కొంచెం తగ్గింది.

డాక్టర్ వెళ్లిపోయేరు. అప్పుడు సీతారామయ్య చంద్రాన్నిపిలిచి అడిగారు..."రామాన్ని ఎందుక్కొట్టేవ్ ? నిర్మల కేక వెయ్యకపోతే ఇంకా కొట్టి ఉందువు... మనిషికి ఆ నీరసంలో మెదడుకి దెబ్బ తగిలి ప్రాణానికి ప్రమాదం వచ్చును. ఏమిటి రామం చేసిన తప్పు ? తప్పు చేస్తే అది నా నోటీసుకి తేవాలి... నేను నిర్ణయిస్తాను తప్పు చేసిందీ లేనిదీ... అందుకు శిక్ష నేను వేస్తాను... నువ్వొక మనిషిని క్రిమినల్ ఎసాల్ట్ చేసేవని గ్రహించేవా ? రామం పోలీసుకి కంప్లెంటిస్తే ? 'లా' చదువుతావేమో ?"

చంద్రం తల దించుకున్నాడు. నరసమ్మ కేకలు పెట్టింది... ఒక చదువూ లేదు సంధ్యా లేదు. ఎప్పుడూ ఆ బొమ్మలు గియ్యడంతో సరిపోతోంది. మొగుడొదిలీసినదాన్ని... ఇక్కడేదో పడున్నాను... నువ్వేదో ఉద్ధరిస్తావని ఆశలు పెట్టుకున్నాను... నువ్వు చేస్తున్న నిర్వాకం ఇది. నువ్వొక జులాయివాడిలా తయారయ్యేవ్... నీకు చేతులెలా ఒచ్చేయిరా మేకలాటి వాడిమీద చెయ్యి జేసుకుందికి ? పద... పోదాం... అరుకు దగ్గర అడవుల్లోకి... అక్కడ అతని దగ్గరే పడి ఉందాం... అతనేం రావొద్దనలేదు. మీ చదువుల కోసమని ఇక్కడ పడున్నాను...

శాంతమ్మ లతమీద విరుచుకు పడింది... "నువ్వున్నావేమోనే? వాడు చెయ్యి చేసుకుంటూ ఉంటే చూస్తూ ఊరుకున్నావా ? అసలెందు కొచ్చిందీ తగువు ?"

చంద్రం అన్నాడు, లత ప్రమాదంలో ఇరుక్కుంటోందనీ, తను సహాయం చెయ్యాలనీ "ఆ పద్యాలు... వెంకటేశ్వరులు రాసినవి... రామం రాసేడు... అవి లతని దృష్టిలో పెట్టుకొని రాసేడు..."

"అదంతా నిర్మల చెప్పింది. పద్యాలు చదివేను. బాగున్నాయి. లతని మనస్సులో పెట్టుకు రాస్తే అది లతకి కాంప్లిమెంటే. కాని అవి అలా రాసినవి కావు. పోనీ అది లతకి తప్పనిపిస్తే నా దగ్గరికొచ్చి చెప్పొచ్చు. ఇప్పుడు నువ్వు చేయవలసిన మొదటి పని మిష్టర్ రామారావ్‌కి క్షమాపణ చెప్పుకోడం. నేను ముందు చెప్పుకుంటాను. తరవాత నువ్వు చెప్పుకో..."

రామారావ్ మంచంమీంచి లేచేడు. ఆందోళనతో..."బాబుగారూ, మీరలా అనడం భావ్యం కాదు. పెద్దవారు నాకెవ్వరూ క్షమాపణ చెప్పుకో నక్కర్లేదు..."

సీతారామయ్య రామంచెయ్యి పట్టుకున్నాడు "ఇది నా బాధ్యత...పిల్లల్ని సరిగా డిసిప్లిన్‌లో పెట్టకపోతే అది తల్లిదండ్రుల బాధ్యత. మిష్టర్ రామారావ్ ! ఇవాళ ఈ ఇంట్లో నీకు జరిగిన అవమానానికి బాధ్యత నాది...నన్ను క్షమించు. ఇక ముందెప్పుడూ ఇలా జరగబోదని హామీ ఇస్తున్నాను ! విన్నారా మీరందరూ ?"

రామం కన్నీళ్లు కార్చేడు. అందరూ నోట మాటలేక ఉండిపోయారు.

"చంద్రం ! ఇప్పుడు నీవంతు. నువ్వు చెప్పకపోతే నీ తరఫున నేను చెప్పవలసి వస్తుంది"

చంద్రం రామంముందుకు వచ్చి తలదించుకొని అన్నాడు. "ఐ యామ్ సారీ !"

ఆ మాటలు అనడమేమిటి నరసమ్మ లేచి చంద్రాన్ని దవడమీద ఛెళ్ళున కొట్టింది ఎడాపెడా..."వెధవా ! క్షమించమని అడగలేవురా తెలుగులో ? నా కడుపున చెడపుట్టేవురా..." నరసమ్మ ఏడ్చింది.

ఆ తరవాత అంతా గందరగోళంగా తయారయింది. సీతారామయ్య అన్నారు. "సరే, వాడిని కొట్టి లాభం ఏమిటి? మన మనస్సుల్లో మార్పు రావాలి; మన ఆలోచనలు మారాలి. రామం ఇవాళ

శీఘ్రంగా వ్యాపిస్తున్న వార్త



ఇక్కడే ఉంటాడు. నాతో కూర్చొని సహపంక్తిలో భోజనం చేస్తాడు. ఈ ఇంటిలో వాడికొక స్థానం నేను ఏర్పరుస్తాను. అదే ఆలోచిస్తున్నాను'' ఆ మాటలని అతను క్రిందకు వెళ్ళిపోయేరు. రామం మంచం దిగబోయేడు. ''దిగకు, ఆయనకి తెలుస్తే నా పరువుండదు'' అన్నది శాంతమ్మ.

సావిత్రి రామం దగ్గరికొచ్చి అన్నది. ''చావకొడితే కొట్టేరుకాని, నీకీ ఇంట్లో పేరు పెరిగిపోయింది. పెద్దవాడి వయిపోయేవ్.''

* * *

తన పక్కని రామాన్ని కూర్చోపెట్టుక భోజనం ముగించేరు సీతారామయ్య. అప్పుడు చెప్పేరు ''నువ్వీ ఇంటికొచ్చీ. నీకోగది ఇస్తాను. అందులో ఉండీ చదువుకో. నువ్వు ఎవరి ఇంటికీ వెళ్ళక్కర్లేదు భోజనం కోసం. ఇక్కడేఉండి చదువుకో. ఎస్. ఎస్. ఎల్. సి. అయ్యేక ఏమయేదీ తరవాత ఆలోచించొచ్చు. నేను శాస్త్రిగారితో మాట్లాడుతాను. అక్కడ నీకు చదువవదు. విన్నావా ?''

కాదు, కూడదు అనలేకపోయేడు రామం. ఇంత ఉదారుడు, నిజాయితీపరుడు అయిన వ్యక్తి ముందు 'లేదు' అనలేకపోయేడు. ''సరేనండీ'' అనవలసి వచ్చింది ప్రతిమాటకీ.

''నేను మా ఊరు వెళ్తాను ముందు. అక్కడేఉండి చదువుకోవాలని ఉంది పరీక్షకి'' రామం ఆఖరికన్నాడు.

''నువ్విక్కడుంటే లత చదువు సరిగ్గా నడుస్తుందని...'' అన్నాడతను.

''లతగారి కోసం నేను నోట్సు తయారు చేస్తున్నాను. అది చదువుకుంటే చాలు.. ''

''నువ్వు మీ ఊరు వెళ్ళకపోతే నువ్విక్కడికి వచ్చేయడం ఖాయం...విన్నావా ?''

''అలాగే బాబూ !'' అన్నాడు రామం.

ఆ రాత్రి అక్కడ ఉండలేదు. వెంకటేశ్వరుల ఇంటికి వచ్చేసేడు రామం ''ఇక్కడ జరిగినది ఎక్కడా అనకు'' అని శాంతమ్మ కోరింది. అందరికీ చెప్పింది ఎవరికీ ఈ జరిగిన సంగతి చెప్పొద్దని. అందరూ తలలూపేరు. అందుకు ఇంటికి రాగానే పూర్ణమ్మ పని చెప్పినా, నీరసంగా ఉందని చెప్పలేకపోయేడు రామం. ఆవులకి గడ్డి వెయ్యడం...ఇత్యాది పనులు చెయ్యవలసి వచ్చింది...

విశాల అడిగింది...''అలాగున్నావేం రామం? చెంప ఎర్రగా కంది ఉందేమి ?''

''ఏదో పురుగు పాకింది కామోసు... నిన్నట్నించీ మంట పట్టుకుంది...''

''ఉండు...నూనె రాస్తాను...'' అని నూనె తెచ్చి రాసింది...రామం అబద్ధం ఆడేడని ఆమె గ్రహించింది.

8

బస్సు ఆ పల్లెటూరు వెళ్ళదు. మూడు మైళ్ళ మీదకి ఉండిపోతుంది. అక్కడ్నించి మరో ఊరు వెళ్తుంది. బస్సు రావి చెట్టు కింద ఆగింది. రామం దిగేడు. క్లీనరు మీదికెక్కి రామం పాత ట్రంకుపెట్టె అందించేడు. రామం అందుకోబేయేడు కాని అందలేదు. టీకొట్టు దగ్గరున్న కూలీ పరుగునవచ్చి అందుకున్నాడు... ''రాంబాబేటి...ఓహో! యెప్పుడు రావడం...'' అని పలకరించేడు అప్పుడే బస్సు దిగడం చూస్తున్నా. ''ఏం వెంకటీ బాగున్నావా ?'' అని రామం పలకరించేడు మధ్య వయస్సులో ఉన్న కూలీని. ''ఏదో బాబూ తమ దయవొల్ల!'' అని మర్యాదగా అన్నాడు వాడు.

'టీ'కొట్టుకి బేరం అట్టేలేదు బస్సు వెళిపోయేక. బస్సు అక్కడ ప్యాసింజర్లకి 'టీ' కోసం ఆగదు. దిగేవాళ్ళు దిగి, ఎక్కేవాళ్ళు ఎక్కగానే వెళ్ళిపోతుంది. కానీ ఆ బస్సుకోసం వచ్చినవాళ్ళు అక్కడ నిరీక్షిస్తారు. 'టీ' దుకాణం ఈ రూటుకి పదేళ్ళక్రితం బస్సు పడ్డప్పట్నించీ ఉంది. అంజయ్య దాని యజమాని. రామాన్ని పలకరించేడు. ''యేటి రాంబాబూ...ఉత్తరమన్నా రాసినావు కావు ? ఇంట్లో నువ్వొస్తున్నట్టు తెల్దే? బుగత నాకు సెప్పనేదు...'' అన్నాడు...ఒక కప్పు టీ కలిపి ఇచ్చి తాగేదాకా వదలలేదు. డబ్బులిస్తే పుచ్చుకోలేదు. ''అమ్మమ్మ...యెంతమాట...నీకాడ డబ్బులా!'' అన్నాడు అది మహాపరాధం అన్నట్టు.

నాలుగువేపులా ఎత్తయిన కొండలు కని



డాక్టర్ సలహాలు

డాక్టర్ కె. వెంకటేశ్వరరావు

సి. జి. — విజయవాడ

నా వయస్సు 20 సంవత్సరములు. నేను రెండు సంవత్సరములనుండి చుండ్రుతో బాధ పడుతున్నాను. షాంపూలు వాడినా రెండు రోజులకు మరల వస్తోంది. విపరీతమైన దురదగా వుంటోంది.

★ లోనికి ఫల్విన్—ఎం. లేక ఇడీఫల్విన్ అనే మాత్రలను రోజుకి ఆరు వంతున వరుసగా 20 రోజులపాటు వాడండి. పై పూతగా ఇకోనజోల్ అనే ఆయింట్‌మెంట్ వాడటం మంచిది.

ఎమ్. ఎమ్. ఆర్. — విశాఖపట్నం

నా వయస్సు 19 సంవత్సరములు. ఇప్పుడు నాకు ఎక్కువగా జుట్టు ఊడిపోవుచున్నది. మా ఇంట్లో వంశపారంపర్యంగా బట్టతల వస్తోంది. దీనిని మొదలే గమనించి విటమిను మాత్రలు వాడితే అరికట్టవచ్చని ఒక పత్రికలో చదివాను. జుట్టు ఊడిపోకుండా వుండాలంటే ఏమి మందులు వాడాలి ?

★ విటమిన్ల మాత్రలు తిన్నంత మాత్రాన వచ్చే బట్టతల రాకుండాపోదు. ఈ బట్టతల రావటం అనేది వైద్యశాస్త్రంలో ఇంకా సమస్య గానే ఉంది. అంటే నివారణోపాయం ప్రస్తుతం ఎవరూ ఖచ్చితంగా చెప్పలేరు.

ఎస్. ఎస్. ఎస్. ఆర్. — అనపర్తి

నా వయస్సు 17 సంవత్సరములు. నాకు మలవిసర్జన ప్రదేశమునందు చిన్న కణితిగా నున్నది. మలవిసర్జన కాలమందు కొంచము నెప్పిగా వుంటున్నది. అప్పుడప్పుడు రక్తము గూడా పడుచున్నది. దీనికి నివారణోపాయం తెలియజేయండి.

★ మీరు శస్త్రవైద్యులకి చూపించి పైల్స్ ఉన్నదీ లేనిదీ తీర్మానించుకోవలసి ఉంటుంది. పైల్స్ ఉన్నవని తెలిసితే వైద్యుల సలహా ప్రకారం శస్త్ర చికిత్స చేయించుకోవలసి ఉంటుంది. చిన్న ప్రమాణంలో ఉన్నవాటికి పై పూతగా ఆయింట్‌మెంట్ వాడితే సరి పోతుంది. ★

ఉదయ సంధ్య

పిస్తున్నాయి. వేదకాలంలో వ్యాసుడూ, వాల్మీకీ ఇటువంటి ప్రదేశాలలోనే ఉండేవాళ్లనిపిస్తుంది. కొండలు దూరంగా ఉన్నాయి, విరివిగా చెట్లూ చేమలూ ఉన్నాయి. మామిడి తోటలు...వరి పొలాలూ...మిరప చేలూ.

వెంకటి, ట్రంకుపెట్టి తలమీద పెట్టుకున్నాడు. నడక సాగించేడు రామం, పొలాల మధ్యనించి. దూరంగా చెట్లమధ్యని కనిపిస్తోంది తమ పుట్టిపెరిగిన అగ్రహారం. పేరు మాత్రం మిగిలిపోయింది. ఇప్పుడు మహా ఉంటే నలభై యాభై బ్రాహ్మణ గడపలుంటాయి. ఉన్నవాళ్లకి రోజులు గడవడం కష్టంగా ఉంది. కొడుకులూ, కూతుళ్లూ ఈ తరం వాళ్లెవరూ ఇక్కడ ఉండడం లేదు. ఉద్యోగాలు దొరికి, పెళ్లిళ్లయ్యీ బయటపడుతున్నారు. విశాఖపట్నం, హైదరాబాదు, ఖరగ్‌పూర్, బిలాస్‌పురూ పోతున్నారు. వేదాన్ని వదిలేరు. పనిముట్లని చేతపట్టేరు. కాలేజి డిగ్రీలని చేతపట్టేరు. ఉదరం కోసం ఎన్నో విద్యలు నేర్చుకొని ఎన్నో దేశాలకి పోయేరు. అగ్రహారాలు...భూములూ...బుగతలూ మరిలేవు... లేరు. ఉన్నవి నిలబెట్టుకోలేకపోయేరు. లేనివి రాబట్టుకోలేకపోయేరు. వ్యసనాలకి దాసులయేరు. వేదం పలికే నోళ్లు అశ్లీలాలు వర్ణించేయి, ఏకపత్నీవ్రతులు భోగవిలాసపరులయ్యేరు. కాఫీ ముట్టుకోని నోరు, మద్యం తాగింది. ఉల్లిపాయ తినని మనుష్యులు కోళ్లూ, గొర్రెలూ హరాయించుకున్నారు. తాటాకు దస్తాలని వదలిన వ్రేళ్లు పేకదస్తాలని ఆనందంగా పట్టుకున్నాయి. ఎలా వచ్చిన లక్ష్మి అలానే పోయింది. తండ్రులూ, తాతలూ చేసిన పనులకి ఫలితం అనుభవిస్తోంది ఈ తరం.

రామం పూర్వీకులదీ అగ్రహారం. మేడలూ, మిద్దెలూ ఉండేవి. వారంతా మరో విధంగా ఆస్తిని నాస్తి చేసేరు మరొకరకమైన వ్యసనం వలన. దానకర్ణుడిలాగ, శిబిచక్రవర్తిలాగ ఉండాలని ప్రయత్నించి, వైదిక కర్మలూ, యజ్ఞాలు, క్రతువులూ, పరలోకంలోని ప్రేతాలకీ, స్వర్గంలోని దేవతలకీ, ఈలోకంలోని దరిద్రులకీ శాంతి కలుగజేద్దామని చేసి, దాన ధర్మాలు, పండుగలు, పర్వాలు, ఆరాధనలు, సంతర్పణలు ఈ పటాటోపంతో ఆస్తంతా కరిగిపోయింది. అప్పుడు రామం తాత, జోగయ్య రంగంలోకి రావడం, అతనొక్కడే ఆస్తికి వారసుడవడం జరిగింది. విశాఖపట్నంలో ఇళ్లు, ఈ అగ్రహారం, గుర్రపు బళ్లు ఇత్యాదివి అన్నీ ఉండేవి. జోగయ్యగారి కొక గుణం జాడ్యంలా పట్టుకుంది. కీర్తికోసం పుణ్యం కోసం తీవ్రమయిన కాంక్ష. అది పుట్టుకతోనే జాడ్యంలా వస్తుంది. ఆ జాడ్యానికి విరుగుడు లేదు... మందులేదు. అపుడొచ్చింది మహా కాటకం. పంటలన్నీ పోయేయి... తినడానికి తిండిలేదు... తాగడానికి గంజిలేదు... ప్రజల ఆర్తనాదాలు భూనభోంతరాళాలూ మిన్నుముట్టేయి... అప్పుడు జోగయ్యగారు మహా హోమం ఆరంభించేరు... ఆ హోమగుండం ఆకలిమంటలు... దానికి నెయ్యి అతని ఆస్తి... అన్నదానం ఆరంభమయింది... ఎవరు వచ్చినా సరే... ఎప్పుడు వచ్చినాసరే...కబళం వెయ్యబడుతుంది ఆ యజ్ఞశాలలో. అతని భార్య లక్ష్మమ్మ అతని అడుగు జాడలలో నడిచే పతివ్రత. నాలుగేళ్లు ఉండి దేశాన్ని అస్థిపంజరం చేసిందా కరువు... కరువు ఆఖరయి మళ్లా సుభిక్షంగా ఉండేసరికి జోగయ్యగారికి మిగిలింది చాలా తక్కువ... కీర్తిమాత్రం ఆకాశమంత. ఆ కీర్తిని చూసి, ఆ వెలుగును చూసి భ్రమపడి వచ్చే యాచకులకి లేదనలేక, తన సంతతికి ఏమీ లేకుండా చెయ్యడం ఇష్టం లేక ఆయన గృహస్థాశ్రమం వదిలి సన్యాసులలో కలిసిపోయేరు...కాశీ, హరిద్వారం, ప్రయాగ తిరిగి తిరిగి, ఇంటికి తిరిగివచ్చి ఒక ఏకాదశినాడు అందరినీ పిలిచి తనకి పిలుపు వచ్చింది, పోతున్నానని, దేవుడిని నమ్ముకోమని, కపాలం ద్వారా ప్రాణాలని వదిలేరు... అప్పటి కతని వయస్సు నలభై.

రామం తండ్రి కాళిదాసు, పెదతండ్రి రామదాసులు మిగిలేరు. రామదాసు తనవాటా ఆస్తి అమ్మేసుకొని, డబ్బు తీసుకొని ఉద్యోగం కోసం ఉత్తరదేశం పోయేడు. కాళిదాసు ఈ పల్లెటూరులో స్థిరపడ్డాడు. పెదతండ్రి ఇటు రాకపోకలు ఎనాడయో మానీసేడు. అతనికొక కొడుకు కూతురు. ఇద్దరికీ పెళ్లిళ్లయేయి. బొంబే దగ్గర ఏదో బట్టల మిల్లులో పని చేస్తున్నాడు. తన చదువు గురించి కాళిదాసు రాయగా వీలుపడదని క్లుప్తంగా జవాబువచ్చింది. అదీ సామరస్యం మిగిలింది అన్నదమ్ముల మధ్య.

(ఇంకా వుంది)



మనిషిమనసు

డాక్టర్ నారాయణరావు

గణగణమని అలారం మోత వినిపించగానే అప్రయత్నంగా గడియారం మీద చేత్తో మొట్టి, ఇక తప్పదన్నట్టు నిద్ర లేవబోతున్నాను. ఉదయం అయిదున్నర. ఈ టైముకైనా లేస్తే గాని నాకు ఎనిమిదింటికి తెమలడం కుదరదు.

"ఛీ వెధవమొహం! వెధవమొహావాని! పొద్దుటే ఇక్కడికెందుకు తగలడ్డావే! పో అవతలికి. నిద్ర లేవగానే వెధవ శకునం మవ్వాను." పక్కింటావిడ గొంతు చించు కొంటోంది.

నాకు ఈ అరుపులు, కేకలు కొత్తవేం కాదు. కనీసం వారానికి నాలుగైదు రోజులైనా ఇలాటి సుప్రభాతం వింటూనే నిద్రలేస్తాను.

మొన్నటికి మొన్న ఇలాగే పక్కింటి హనుమాన్లుగారూ నేనూ బయట నుంచుని మాట్లాడుకుంటున్నాం. ఆయన ఏదో పనిమీద బయటికి వెళుతున్నట్టున్నారు. ఆయనే నన్ను పిలిచి పలకరిస్తే తప్పదని మాట్లాడుతున్నాను. ఆయనకి మా వీధిలో మంచిపేరే ఉంది. రోజూ పూజా పునస్కారం — దైవభక్తి ఉన్నవాడు. మనిషి కూడా మంచివాడే. "మీరేదో బయటికి వెళ్తున్నట్టున్నారు" అన్నాను — ఇకనైనా నే లోపలికి పోవచ్చునా అన్నట్టు. "ఆ! అవునండీ! ఎదీ అదిగో ఆ వెధవమొహం అక్కడేడిసిందిగా! అది ఎటో పోతే నేనూ బయలుదేరుదామని. ఖర్మ! ఎప్పుడు బయటికి వచ్చినా అదే ఎదురొస్తుంది."

ఇలా ఒకరేమిటి. ప్రతిరోజూ ఎవరో ఒకరు విసుక్కునే మొహం మా వీధిలో ఎన్నేళ్ళనించో అడుక్కుంటూ తిరిగే ముసలమ్మది.

ఆ ముసలమ్మ ఎప్పుడు ఎక్కడ పుట్టిందో నాకు తెలీదుగాని, మేము ఈ వీధిలోకి వచ్చిన ఎడాది దగ్గర్నించి ప్రతిరోజూ కనిపిస్తునే ఉంటుంది. అప్పుడప్పుడు ఇంకో చిన్నపిల్లని తన కూడా తెస్తూ ఉంటుంది. ఇంతమంది ఇన్నిసార్లు ఇన్ని రకాలగా తిట్టి పోస్తున్నా అది మా వీధిని ఒదిలేసి దూరంగా ఎందుకు పోదా అని నా కప్పుడప్పుడు అనిపిస్తుంది. నిజం చెప్పాలంటే అది నన్నెప్పుడూ ఏవీ అడగలేదు. అడిగుంటే బహుశ నేను పొమ్మని అందునేమోకూడాను. కాని ఒకటి మాత్రం నిజం. అది ఎదురైతే నాకెప్పుడూ దానిమీద కోపం రాలేదు అది ఎదురవ్వడంవల్ల పని జరగకపోవడంగాని, అశుభం జరిగినట్టుకాని నాకు గుర్తులేదు. మా వీధిలో వాళ్ళు మాత్రం, అది ఎదురైతే దరిద్రం చుట్టుకుంటుం దంటారు.

ఆ ముసలమ్మకి నా అనేవాళ్ళు ఎవరూ లేరని నా నమ్మకం. ఒక మనిషిని పట్టుకుని ఎదుటి మనిషి అంత దారుణంగా మాట్లాడు తుంటే నాకు చాలాసార్లు బాధవేసేది. పాపం అది ఎంత బాధపడుతుందో కదా అనిపించేది. ఎవరితో చెప్పుకోగలదు తన బాధ అని అనుకునేవాడ్ని.

"అబ్బ! దాని మొహమే అంతలెండి. మొన్న మా ఫ్రెండింటికి వెళ్లబోతూంటే ఎదురొచ్చింది — దరిద్రమ్మొహం. వాళ్లింట్లో చూద్దామని చేతిలోకి తీసుకోగానే ట్రాన్సిస్టరు నా చేతిలోంచి కిందపడి దభేలున బద్దలయ్యింది. ఎన్నిసార్లనుకుని ఏం లాభంలెండి. అది కనిపిస్తే అన్నిపన్లూ మానుకోవడమే మంచిది" అది మా ఎదురింటి రామారావుగారి ఉవాచ.

అసలు నిజంగా ఒక మనిషి మొహంలో అంత శక్తి ఉంటుందా! ఏంకీడు చేశారని వాళ్ళందరి పన్లూ అలా పాడయ్యేలా చేస్తుంది ఆ ముసలమ్మ! ఎంతమంది ఎన్ని కథలు చెప్పినా నాకు మాత్రం ముసలమ్మమీద జాలేసేది.

చూడ్డానికి దాని మొహం అంత అందంగా ఉంటుందని నేననుకోను. నెరిసిపోయి, తైల సంస్కారంలేని చింపిరి జుట్టు, గుంట కళ్ళు, సగం మిగిలిన పళ్ళూ, చిరిగి పీలికలైపోయిన చీరా,పదిగజాల దూరంనించే వేసే చుట్టకంపుతో కలిసిపోయిన చెమట వాసన.

అనవసరంగా ఓరోజు హనుమాన్లుగారితో అనేశాన్నేను. నా మనసులోమాట చెప్పేంతరువాత చాలాసార్లనిపించింది— చెప్పకుండా ఉండా ల్సిందని. "నిజంగా మీరు దేవుణ్ని నమ్ముతుంటే ఆ భగవంతుడి ఆజ్ఞ లేందే మంచిగాని, చెడుగాని జరగదుకదా! ముసల్దానిమొహం కనిపించినంత మాత్రాన చెడు తప్ప మంచి జరగదని మరింత గాఠంగా నమ్ముతున్నారంటే, మీరు ఆ భగవం

ఘుడికన్నా, ఈ ముసల్దానికి ఎక్కువ శక్తిని ఆపాదిస్తున్నారనిపిస్తుంది.''

హనుమాన్లుగారికి చాలా కోపం వచ్చింది. కనని తను ఎంత తమాయించుకున్నారో నేనర్థం చేసుకోగలను. నన్ను వెర్రి వెధవని చూసినట్టు చూశారు. ''మీ కుర్రాళ్ళకున్న జబ్బేయిది. తన దాకా వస్తేగాని తెలియదు'' అన్నారు చివరికి.

ఖాళీగా కూర్చున్నప్పుడు నాకు ముసలమ్మ ్తతే గుర్తుకొచ్చేది. ప్రపంచంలో ఎవరికీ కేనక్కరలేదు. అందరికీ నేనంటే అసహ్యం ని తెలిసినప్పుడు — ఆ మనిషికి ఎంత మానసిక దనో కదా అనిపించేది. ఏదోనాడు ఈ ఆవేదన రించలేక ముసలమ్మ ఆత్మహత్యకి తలపడు ుందని నాకు తెలుసు. ఏదో తెలీని ఆవేశం చ్చేది. ''నువ్వేం బాధపడకు ముసలమ్మా! ళ్ళందరూ మనుషులు కదా! ఇలాగే పవర్తిస్తార్లే! నువ్వంటే నాకేమీ అసహ్యం దు. నువ్వు ఎదురొచ్చినా నాకు ఏమీ నిపించదు'' అని ఎప్పుడైనా చెబ్దామా నిపించేది. మళ్ళీ ఎందుకో దాని రూపం, అదో కం వాసనా గుర్తొచ్చేది. ఆలోచన్లు అంతటితో గిపోయేవి.

మనిషి మనసు

ఆఫీసునించి వచ్చి సాయంత్రం అయిదింటికి కాఫీ తాగుతూ కిటికీ లోంచి చూస్తున్నాను. మళ్ళీ ఎక్కడో ఏదో అయ్యింది. ముసలమ్మని చాలా గట్టిగా తిడుతున్నారు ఎవరో. ఆత్రంగా బయటికొచ్చి చూశాను. మాధవరావు గారు ముసలమ్మమీద చాలా కోపంగా ఉన్నట్టు న్నారు. స్పష్టంగా వినబడకపోయినా దేనిగురించి తిడుతున్నారో ఊహించుకోగలను నేను. ముసలమ్మ మాత్రం మాటామంతీ లేకుండా తలొంచుకుని నెమ్మదిగా నడుచుకుంటూ పోతోంది అక్కడ్నించి.

మళ్ళీ ఎందుకో నాలో ఏదో ఆవేశం వచ్చింది. ఎలాగైనా ముసలమ్మకి ఈ సాయంత్రం నా మనసులోని మాట చెప్పెయ్యాలి అనుకున్నాను. దాని మనసులో బాధ తలుచుకుంటే ఆదేదో అఘాయిత్యం తలపెడుతుందనిపించింది.

శుభ్రంగా స్నానం చేసి సాయంత్రం షికారుకి బయల్దేరాను — రోజూలాగే. ఇవాళ మాత్రం మనసెంతో తేలిగ్గా ఉంది. ఒక మంచి పని చేస్తున్నాను — ఒక మనిషి మానసిక వేదన తగ్గిస్తున్నాను అనే గర్వంవల్ల కాబోలు.

నెమ్మదిగా మా వీధిలో నడుస్తూ ఆలోచిస్తున్నాను. ఎప్పటికైనా మనుషులు తోటి మనిషికూడా తనలాంటి వాడేనని గుర్తిస్తారా! ఎదుటి మనిషిని అంత చిత్రహింసకు గురిచేస్తే ఒరిగేదేమిటి ?

నా ఆలోచనల్లో పడి ఎంతదూరం నడిచానో గుర్తులేదు. చీకటి పూర్తిగా పడలేదు. కాని వెలుగు మాత్రం లేదు. అంతలో ఏవో మాటలు వినబడి గబుక్కున ఆగిపోయాను. ఆ కంఠం ఎవరిదో! ఎప్పుడూ విన్న గొంతులా కూడా లేదే! ఎవరిదో ఏడుపు. ఎవరివో అరుపులు.

''ఛీ పాపిష్టిదానా! గుడిసిలో తగలడక నాకెందుక్కనిపిస్తవే! ఎదవ సచ్చిందానా! నువ్వెదురొచ్చినావు—ఏ ఇంట్లో ఒక్క పైసా కూడా తగన్లేదు. ఛీ! ఇయ్యాల అన్ని చోట్లా తిట్లేనే''. ఎవర్నో కొడుతున్న చప్పుడు.

నాకు విషయం అర్థం అవ్వడానికి ఒక నిమిషం పట్టింది.

ముసలమ్మ తన దగ్గరుంటున్న చిన్నపిల్లని దారుణంగా కొడుతోంది. తరువాత మాటలు నాకు వినబడ్డం మానేశాయి. ★

సీరియల్

కర్మయోగి

డా॥ కె.వి. కృష్ణకుమారి

జరిగిన కథ — 14 : తులశమ్మగారు గత జీవితాన్ని శ్రీహరిగారితో చెప్పి హృదయభారాన్ని తగ్గించుకొంటారు. కృష్ణారావు తల్లి ఆవేదనని చూసి చలిస్తాడు. తల్లి కోరిక ప్రకారం పెళ్లి చేసుకొనుటకు అంగీకరిస్తాడు కృష్ణ. కృష్ణ పెళ్లి పద్మినితో నిశ్చయమవుతుంది. కృష్ణారావు, పద్మినిల వివాహం జరిగిన కొద్దిగంటలకే పద్మిని తల్లి యశోదమ్మ మరణిస్తుంది. యశోదమ్మ కర్మకాండ అనంతరం పద్మినితో కూడ కృష్ణప్రియను తమ దగ్గరకే పంపమని రామచంద్ర రావుకి చెప్పి తులశమ్మ కృష్ణారావుతో కలిసి తమ ఊరు వెళ్లిపోతారు. పద్మిని, కృష్ణప్రియల రాకతో తులశమ్మగారి ఇంట్లో చైతన్యం వస్తుంది. కృష్ణారావు చర్చలకు అందరూ ఆకర్షితు లవుతారు. శోభనం నాటి రాత్రి మూర్ఛవచ్చి పడిపోయిన పద్మినికి సేవలు చేసి అనునయిస్తాడు కృష్ణ. గుండె నొప్పితో బాధపడుతున్న పద్మినిని మనస్సుకు ఉల్లాసం కలిగించే మాటలతో వూరడిస్తాడు కృష్ణ. మనువడి కోసం తాపత్రయ పడే తులశమ్మను చూసి పద్మిని కృంగి పోతుంది. కృష్ణారావుని గోష్టిలో అల్లరిపాలు చేయాలనుకున్న నారాయణ ప్లాను తలక్రిందు లవుతుంది తులశమ్మకు మనువడిని ఎత్తుకోవాలనే కోరిక రోజు రోజుకు బలపడుతోంది. కాని ఆమెకు కృష్ణ వైఖరి ఆందోళన కలిగిస్తుంది. పద్మిని ఆరోగ్యం ఇంకొంచం క్షీణించింది.

(గత సంచిక తరువాయి)

"ఏమిటా కోరిక పద్మినీ..."

విస్మయంగా చూశాడు కృష్ణారావు.

మొదటి రోజును గుర్తుకు తెస్తుంది పద్మిని రూపం.

తన గుండెలమీద తల ఆన్చుకుని—ఎప్పుడూ లేనంత సన్నిహితంగా పెనవేసుకు పడుకున్న—పద్మిని మొహంలోకి ఆశ్చర్యంగా చూస్తూ మళ్ళీ మళ్ళీ అడిగాడు కృష్ణారావు.

"... ... ..."

"నీలో ఆ కోరిక మిగిలివుందా పద్మినీ—"

"భార్యగా నా ధర్మాలు నేనూ చెయ్యాలి... అన్నివిధాలా మిమ్మల్ని సంతృప్తి పరచాలి..."

అయోమయంగా చూశాడు కృష్ణారావు.

"నీ ఆరోగ్యం బావుళ్ళేదు...ఏం మాట్లాడు తున్నావో నీకే అర్థం కావటం లేదు. నా సంతృప్తికి ఇప్పుడు తక్కువేమైంది ? ఇంతకు మించిన సంతృప్తి నా కింకేముంటుంది ?"

"అది నా ద్వారానే అందిదన్న తృప్తి నాకు వుండాలి కదా..."

"... ఈ సంతృప్తి నీ వల్లనే కదా... నీ సహకారం వల్లనేగా అందుకుందీ" పద్మిని కళ్ళలో నీళ్ళు తిరిగాయి.

"సహకారం కాదు... నా జబ్బువల్ల... గత్యంతరం లేక... ఏమండీ అత్తయ్యకి ఇద్దరం ద్రోహం చేస్తున్నాం— మభ్యపెడుతున్నాం... వివాహానికి అభ్యంతరం చెప్పనివ్వని మీ నియమం మీ లక్ష్యం, పిల్లలకి అడ్డు చెప్పవని నాకుతెల్సు— ఏ విధంగా— ఎప్పుడూ— మీ ఆశయానికి ఏదీ అడ్డు రాదని కూడా తెల్సు... కేవలం నా జబ్బు వల్లే— నా జబ్బువల్లే— ఈ ఇంటికి అన్యాయం జరిగిపోతోంది..."

తనతో— ఏనాడూ— ఇంత చనువుగా మాట్లాడి ఎరుగని పద్మిని—ఎంతో—సన్నిహితత్వం వున్నట్టు— ఏదేదో చెప్పుకుంటోంది—

పిచ్చిదాన్లా తన్లో తనే ఏడుస్తోంది—

"ఏమండీ— చనిపోయినవాళ్ళు— కలలో కన్పించి తన దగ్గరకు రమ్మని పిలుస్తుంటే మంచిది కాదంటారు కదూ..."

"... ... ..."

"అదే నిజమైతే నేనేమి మీకు మిగల్ప కుండానే పోతానేమో..."

"...ఏమండీ—"

కృష్ణారావు మొహం గంభీరంగా వుంది.

శూన్యంలోకి చూస్తున్న అతని కళ్ళల్లో ఎప్పటి తేజస్సే వెలుగుతోంది.

ఎప్పటి వైరాగ్యమే తొంగి చూస్తోంది.

ఆ అసాధారణ వ్యక్తిత్వం ముందు—తను చాలా సామాన్యురాల్లా కళ్ళనీళ్ళు పెట్టు కుంటోంది.

ఆ అనుభూతి తన గుండె బరువును తగ్గించివేస్తోంది—సర్వజ్ఞుడి ముందు పసిపాపలా.

జ్ఞానిముందు అజ్ఞానిలా.

తపస్విముందు కళ్ళనీళ్ళతో అల్పురాలిలా.

వోదార్పును కోరటం—ఆయన వోదార్పును అందుకోటం ఎంత అదృష్టం. తనెంత అదృష్ట వంతురాలు.

పసిపాపలా తనని పెనవేసుకున్న పద్మినిని కన్నతండ్రిలా గుండెల్లో దాచుకున్నాడు కృష్ణారావు.

ఒక అర్ధరాత్రి కొట్టినట్టు మెలకువ వచ్చింది పద్మినికి.

ముచ్చెమటల్తో వొణికిపోతూ—కృష్ణారావుని చూసింది.

నిశ్చింతగా నిద్రపోతున్నాడతను.

"... ఐతే – కలా !!! – ఇది నిజంగా కలేనా ???—"

ఎంత భయంకరమైన కల !!!

ప్రేతాకారంలో—తన తల్లి—రెండుచేతులూ జాపి—ఆర్తితో తనని పిలుస్తోంది.

విడిచి వుండలేనని కన్నీళ్ళు పెట్టు కుంటోంది.

ప్రేతానికి ప్రేమా ? – కన్నీళ్లా !!!

ఈ భావన తనలో రాగానే ఆ ఆకారం కీచుమని ఎగిరిపడి తన కంఠాన్ని పట్టుకుని...

గుర్తు చేసుకుంటూ ఒక్క ఉదుటున లేచి నిలబడింది పద్మిని.

తెల్లవారబోతోంది...

పద్మిని గుండె చిక్కబట్టింది.

భయంతో నరనరం బిగుసుకుపోతోంది.

'ఈ కలకి అర్థం...అర్థమేమిటి???'

మరోసారి కృష్ణారావుని చూసింది.

చీకట్లో అతని తేజస్సు వింతగా మెరుస్తోంది.

'కలే ఇది—'

నిర్ధారణ కోసం ఇల్లంతా తిరిగింది—ఒక నిర్ణయానికి వచ్చి ఊపిరి పీల్చుకుంది. ఇంకొంత సేపట్లో ఇంట్లో అందరూ లేస్తారు.

ఇంటికోడలిగా తన బాధ్యత గుర్తుకువచ్చి పెరట్లోకి నడిచింది.

* * *

"ప్రియా, ఇవాళ నా స్నానంకదూ... కాగు క్రింద మంట వెయ్యాలమ్మా."

బద్ధకంగా లేచింది కృష్ణప్రియ.



"అప్పుడే తెల్లారబోతోందా ?..." బలవంతంగా లేస్తున్న ప్రియను నొచ్చుకుంటున్నట్టు చూసింది లక్ష్మి.

"ఇవాళ పనిమనిషి రావని చెప్పిందికదూ... కాస్త...కాసేపు కష్టపడమ్మా...స్నానమయ్యాక పనులన్నీ నేనే చేసుకుంటాగా..." బ్రతిమాలుతోంది లక్ష్మి.

"అదేమి టక్కయ్యా, ఇంతమాత్రానికే అరిగిపోతేమటుకేం...నేనేమన్నా పరాయిదాన్నా—"

ఇల్లంతా నిశ్శబ్దంగా — చీకటి ముసుగు కప్పుకున్నట్టుంది. లక్ష్మి ఇంట్లో ఉంటే ఈ సమయం ఇలావుండదు. కనీసం పద్మనికి ఒంట్లో బావున్నా — ఇల్లు మేలుకునే ఉండేది. కోడళ్ళందరూ కల్పి అత్తగారికి ఆజ్ఞలు జారీచేశారు, తెల్లవారితేగాని లేవద్దని.

"అక్కయ్య కెలావుందో ఏమో..." బావగదివంక చూస్తూ తన్లోతనే అనుంది కృష్ణప్రియ.

పెరటివైపు రాబోయి ఆశ్చర్యంతో తెల్లబోయింది. "ఇదేమిటి...తలుపు తీసివుందీ ?" హడావుడిగా వెళ్ళి, నిశ్చేష్టురాలై పోయింది.

పెరట్లో పెద్దపొయ్యి మండుతోంది.

పొయ్యిమీద కాగులేదు. మరి??...ఏమిటిది? ఏమిటీ వాసన ??

పరీక్షగా చూసి భయంకరంగా ఆర్తనాదం చేసింది. నిల్చున్నపళంగా విరుచుకు పడిపోయింది కృష్ణప్రియ.

*   *   *

తెల్లగా తెల్లవారి పోయింది.

పద్మని మంటలోపడి దారుణంగా కాలి పోయిందన్న విషయం నిముషాలమీద కార్చిచ్చులా ఊరంతా పాకిపోయింది.

వింతరంగుల్ని పులుముకుని వికృతంగా మండిపోతోందది.

ఇల్లంతా ఇసుకేస్తే రాలకుండా వున్నారు జనం.

కళ్ళు సీలిపోయి — మాంసం కాలిపోయి — చాలా భాగం పుత్తి కన్పిస్తూ — చాలా భయంకరంగా వుంది పద్మని మొహం. చీరెతోబాటు వొళ్ళంతా కాలి, కమిలిన భాగాలు వికృతంగా వున్నాయి.

అతి ప్రయత్నంమీద హాల్లోకి తీసుకువచ్చి-- పడుకోపెట్టారు.

కృష్ణప్రియ స్పృహలోలేదు.

తులశమ్మను పట్టుకోటం కష్టమై పోతోంది.

లక్ష్మిని వోదార్చటం ఎవరికీ సాధ్యం కావటం లేదు. శూన్యంలోకి విరాసక్తంగా చూస్తున్న కృష్ణారావు మటుకు ప్రాణంలేని కట్టెలా కూరుండిపోయాడు.

అందర్లా అతను గుండెలు బాదుకుని ఏడుస్తాడనుకోకపోయినా — కనీసం కళ్ళనీళ్ళు కూడా పెట్టుకోకపోవటం — బంధువులలో — వచ్చినవాళ్ళలో — కనీసం జరిగింది చెప్పుకుని బాధపడకపోవటం చాలామందికి ఆశాభంగాన్ని కలిగించింది.

తులశమ్మ శోషవచ్చి పడిపోయింది.

లక్ష్మి గుడ్లనీరు కుక్కుకుంటోంది.

ఆ నిశ్శబ్దవాతావరణం గురించి ఆపోహలూ అపభ్రంశపు ఆలోచన్లూ అప్పుడే మొదలయ్యాయి.

"బాబూ కృష్ణా ! ముందర జరగాల్సింది చూడాలికదా ..."

సోమయాజులుగారి వంక అయోమయంగా చూశాడు కృష్ణారావు.

"ఇన్‌స్పెక్టర్ మనవాడే ... ప్రమాదవశాత్తూనే జరిగిందని వ్రాసుకువెళ్ళాడు. జరగాల్సిన తతంగాలన్నీ ఐపోయాయికదా ... ఇంక అసలైన ..."

సోమయాజులు చేతులు పట్టుకున్న కృష్ణారావు గొంతు అదోలా వొణికింది.

"చేద్దాం బాబాయ్ చేద్దాం ... చెయ్యవల్సిందంతా చేద్దాం" ఆ సమయంలో పసివాడిలా కన్పిస్తున్న కృష్ణారావుని చూసి కన్నీళ్ళు ఆపుకోలేకపోయారు సోమయాజులు.

''నకు రావల్సిన కష్టాలుకావు తండ్రి...''

సోమయాజులు చేతులు పట్టుకుని కర్తవ్యాన్ని కుప్రక్రమించాడు కృష్ణారావు.

జనంలో అక్కడక్కడ సర్దుకున్న నారాయణ బృందానికి—తగిన సమయం దొరికింది.

కాకులకి మేతవెయ్యటం మొదలుపెట్టారు. తంతు పూర్తవుతోంది — 'కృష్ణా కృష్ణా.. కృష్ణా ...' శవం పైకి లేస్తుంటే — అందరూ ఆహాకారాలు చేశారు—పూనకం వచ్చినట్టు లేచిన కృష్ణప్రియ దారికడ్డంగా పడిపోయింది.

''అక్కయ్యా... నేను తప్పుచేసుంటే... నన్ను క్షమించక్కయ్యా... ఆరిందాలా నీతో మాట్లాడాను... నువ్వొక్కమాటా అనలేదు... అమ్మెలాగూ అన్యాయం చేసింది... నువ్వూ అన్యాయం చేసిపోయావా అక్కయ్యా...''

నారాయణ బృందం కళ్ళొగరేశారు.

ఏదో అర్థమైనట్టు సంతృప్తిపడారు.

అర్థం చేసుకున్న దాన్ని ఆచరణలో పెట్టాలా అన్న ఆలోచనలో పడిపోయారు.

''ప్రియా... లేమ్మా — అక్కను వెళ్ళనియ్యమ్మా —''

కృష్ణప్రియను బలవంతంగా లేవదియ్యబోయి — ఆ వడిలోనే తల దాచుకుని చిన్నపిల్లలా వెక్కిళ్ళు పెట్టింది లక్ష్మి.

వాతావరణం ఆర్ద్రంగా వుంది.

పద్మిని వెంట విరాగిలా నడుస్తున్న కృష్ణారావువైపు సానుభూతే ఎక్కువ భాగం అనుసరించింది.

* * *

పద్మిని మరణంతో ఆ ఇంటి వాతావరణంలో మళ్ళా పూర్తి మార్పు వచ్చింది — తులశమ్మ—లక్ష్మి — కృష్ణ మందిరంలో దీపారాధన చెయ్యటం పూర్తిగా మానేశారు.

కృష్ణప్రియ గదిదాటి బయటకు రావటం లేదు.

తల్లి మరణానికి తట్టుకోగలిగిన ఆ లేత మనసు - అక్క మరణంతో — ఛిన్నాభిన్నమైపోయింది. నిబ్రదొక్కుకోవచ్చునుకున్న నిర్ణయం—బ్రతుకుమీద ఆశా — పూర్తిగా తుడిచిపెట్టుకుపోయింది.

తెల్లవారుతుందంటేనే ఆ భయంకర దృశ్యాలు గుర్తుకువచ్చి — ఉన్మతిని పోగొడుతోంది.

ఇటు తులశమ్మనూ — అటు కృష్ణప్రియనూ కాపాడుకోటంతోనే లక్ష్మికి రోజులు గడిచిపోతున్నాయి.

ఆ ఇంట్లో ఎవ్వరూ పట్టించుకోని వ్యక్తి—పట్టించుకోవల్సిన అవసరం లేనట్టు కన్పించే వ్యక్తి ఒక్క కృష్ణారావే.

సానుభూతి పేరిట వచ్చిన ఉత్తరాల్లో రెండు ముఖ్యమైనవిగా కన్పించాయి. ఒకటి

కర్మయోగి

శ్రీహరిగారు రాసింది. రెండోది శంకరశాస్త్రిగారు వ్రాసింది.

చిరంజీవి కృష్ణను బాబాయి ఆశీర్వదించి వ్రాయునది—

కృష్ణా ! విషయం తెల్సింది. ఎంత ఘోరం జరిగిపోయింది నాయనా — పసుపు బట్టలతో పెళ్ళికొడుకును చేసిన ఈ చేతులో మైల శోకి—మలినమైపోయిన నిన్ను ముట్టుకునే ధైర్యం కూడా లేని నేను రాలేకపోయాను. మీ ఇంటిదీపం వెలిగించానని ఇన్నాళ్ళూ గర్వంగా చెప్పుకున్నాను నాయనా. కన్పించిన ప్రతివాడితోటీ చెప్పుకున్నాను. ఒక పవిత్రదేవాలయంలో దీపం వెలిగించగలగటం ఎంత పవిత్ర కార్యం ! అంత అదృష్టం అందరికీ వుంటుందా ?

అందుకేనేమో...భగవంతుడు నా గర్వాన్ని సమూలంగా నాశనం చేశాడు — సర్వనాశనం చేశాడు.

నేనెవర్నసలు ? నాకేం అర్థమైంది ? ఎంత అల్పుడ్ని నేను — కృష్ణా విన్నాను నాయనా—నేనూహించిన నీ గొప్పదనం చాలామంది ద్వారా విన్నాను — ఇంత— అవాంతరాన్ని కూడా చలనం లేకుండా తట్టుకున్నావుట. నిర్వికారంగా కర్మకాండనంతా జరిపించావుట — నీ స్థితిని ఎవరందుకో గలరు ?—నీ స్థాయికి ఎవరు రాగలరు?

ఐనా కృష్ణా ఈ సంఘటనను ఆ మ్మ తట్టుకోలేదు కృష్ణప్రియ వంటరిగా బ్రతకనూ లేదు. లక్ష్మి విషయం నాకంతగా తెలియదు. నీలో వైరాగ్యాన్ని పెంచుకోటమే కాదు నాయనా దుఃఖంలోవున్న నీ వాళ్ళలో ఇప్పటికే వైరాగ్య బీజాలు పడివుంటాయి. వాటిని మహావృక్షాలుగా చేసి — మనశ్శాంతిని కలిగించు.

...అది ఎలాగో — నీకు చెప్పవల్సిన వాడ్ని కాదు. కాలమే పరిష్కారం చూపిస్తుంది. ఆ పరిష్కారం సత్ఫలితాల నివ్వాలి. వీలు చూసుకు వస్తాను. నీ

శ్రీహరి బాబాయి

గాఢంగా నిట్టూర్చి మరో ఉత్తరం అందుకున్నాడు. అది శంకరశాస్త్రిగారు వ్రాసింది.

కో (కా) కి "లా"

ప్రతిపక్షవర్గం సభ్యుని 'లా'

సంతలో గొంతు చించుకునేది కాకి

అధికార పక్షం అల్లుని 'లా'

వసంతంలో గొంతు సవరించుకునేది

కోకిల —

— ఆయల సోమయాజులగోపాలరావు

చిరంజీవి కృష్ణా—

ఆశీస్సులు. చి॥ సౌభాగ్యవతి దారుణ మరణాన్ని నమ్మలేక పోయాము. నీలాంటి వాడికి రావల్సిన కష్టంకాదిది. రాదన్న కష్టంకూడా ఇదే అన్పిస్తోంది. ఎందుకంటే శ్రీకృష్ణభక్తులే అష్టకష్టాల పాలయ్యేది— దారుణమైన కష్టాలన్నీ వాళ్ళనే వరించివస్తాయి. భక్తులకుసుఖమనేది వుండకూడదు. అదే వుంటే తమ లక్ష్యానికి దూరమై— ఐహిక సుఖాల మీద మనసు పెరిగి వాటికి దాసులై— తనమీద మనసు నిలపలేరు. తనవారు మానసికంగా తనకి దూరం కావటం ఏ పరిస్థితుల్లోనూ సహించే స్థితిలో వుండడు భగవంతుడు. అందుకే కష్టాలను పెంచుతాడు— భవబంధాలమీద విరక్తిని పెంచి తద్వారా తనమీద మమకారాన్ని పెంచుకోజూస్తాడు. పెంచుకుంటాడు. జీవితం అంధకారమైనప్పుడు, సర్వం చీకటిమయమైనప్పుడు— అప్పుడు జ్యోతిలా మనలో వెలిగేదేమిటి ? వెలిగేదెవరు ? వెలిగేదెందుకు ?

కృష్ణా !—సర్వం నీకు తెల్సు— వయసులో పెద్దవాడ్ని కనుక— చెప్పాలన్పించి చెపుతున్నానంతే—

కృష్ణా !— మరోమాట— ఇది సలహాగా అనుకున్నా నా కభ్యంతరం లేదు. నీ మంచితనం నీచేత అంగీకరింపజెయ్యదు. నాకు తెల్సు— ఐనా నిజం. నీలో భగవంతుడు కాపురం వున్నాడు. అందర్లోనూ వున్నాడు. ఐతే— అధికారంచాటున అజ్ఞానం మరుగున కప్పబడిపోయి వున్నాడు. వాటిని నువ్వు ఛేదించాలి. అందర్లోనూ నెలకొని వున్న భగవంతుడ్ని ఎవరికి వారు గుర్తించే స్థితిలో వుండే ప్రయత్నాలు నువ్వు చెయ్యాలి. అందర్లా సామాన్యంగా సామాన్యుడిలా నువ్వు వుండటానికి వీలులేదు, అది భగవంతుని ఉద్దేశ్యంకూడా కాదు. కానీ ఆ ప్రయత్నాలు సఫలీకృతం అవాల్సిన పద్ధతుల్ని సక్రమంగా ఆచరణలో పెట్టటం లేదేమో అన్పిస్తోంది. ఎందుచేతనంటావా నేను ప్రత్యక్షంగా చూశాను కదా నాయనా. నీ తపనా, ఆదర్శమూ, దానం అంతా అపాత్రమైపోతుంది. కొంతవరకూమంచి కూడా నీ ఉద్దేశ్యం ద్వారా నెరవేరుతోంది— కాదనను. కానీ ఆ మాత్రం సరిపోదు. ప్రస్తుత కాలపరిస్థితుల్లో నీలాంటి వ్యక్తి అరుదు. అందుకే మరీ మరీ చెపుతున్నాను. నీ బోధలూ— నీ తృష్ణా— నీ తపనా - కేవలం ఒకే ఊరికీ, ఒకే వర్గానికీ, ఒక పరిధికి అంకితమైపోకూడదు. అందుకోసం నువ్వు పడుతున్న తపనా కృషీ నిష్ఫలం అవుతున్నాయి. నేను చూశాను కదా— మన గొంతుకు విన్పించేది కొద్ది దూరం. మన భావాలు చొచ్చుకుపోయేది కొన్ని హృదయాలలోనే కానీ అది సరిపోదు. అందుకే కలం పట్టు. కృష్ణతత్వాలను రచించు. గీతకు భాష్యాలు వ్రాయి. నిత్య జీవితంలో కర్మయోగాన్ని అన్వయిస్తూ బోధించు. వాటిద్వారా చెప్పలేని

ఎన్నిటినో మనం వ్రాతలద్వారా బహిర్గతం చెయ్యొచ్చు. దేశదేశాల ప్రచార పద్ధతిలో మన లక్ష్యాన్ని సాధింపవచ్చు. ఆ తృప్తి మన కుంటుంది.

ఇది దైవసేవే కాదు నాయనా ప్రజా సేవ కూడా. రెండూ ఒకటేనని తెల్సిన నీకు వివరించే పాటివాడిని కాను.

ఈ పరిస్థితుల్లో ఏ విధంగా చూసినా ఇంతకు మించిన సత్కార్యం లేదు.

ఆ శ్రీకృష్ణ పరమాత్మ నీ సంకల్పాన్ని సిద్ధింపజేయును గాక.

ఆశీస్సులతో
శంకరశాస్త్రి

దీర్ఘంగా నిట్టూర్చాడు కృష్ణారావు.

కృష్ణారావు వైఖరీ, పంథా మరో మలుపు తిరిగింది.

లైబ్రరీ వైపుకు వెళ్ళటం పూర్తిగా తగ్గించివేశాడు. తనకు తానుగా గోష్టుల్లో పాల్గొంటం — ఆ రకంగా ఎవరితో ఏదో చెయ్యాలనుకోటం—ఆ భావనా తనకు మిగిల్చేది ఆత్మవంచనేనని అర్ధం చేసుకున్నాడు. శంకర శాస్త్రిగారి ఉత్తరం నీడలా తనని వెన్నాడింది. చివరకి తనలో స్థానాన్ని సుస్థిరం చేసుకుంది.

'శ్రీకృష్ణ తత్వం' రచన మొదలైంది.

ఇంట్లో వాతావరణంలో కూడా పూర్తి మార్పు వచ్చింది. తులశమ్మ పైకి బింకంగా వున్నట్టు కన్పించినా — లోలోపల ఏదో వ్యాధి తోడేస్తున్నట్టు కృశించిపోతోంది. మధ్యకాలంలో తెచ్చుకున్న ధైర్యం, సంతోషం మచ్చుక్కూడా కన్పించటం లేదు. గాలిపోయిన బెలూన్లా ఐపోయింది. కృష్ణప్రియ తనగది దాటి బైటకు రావటమే మానుకుంది. ఇది వరకటి చురుకు దనమూ—ఆసక్తి — చూద్దామన్నా కన్పించటం లేదు. తనమీద తనకే ఆసక్తి పూర్తిగా చచ్చిపోయింది. తనకంటూ వున్న అమ్మా, అక్కయ్యా కళ్ళముందే వెళ్ళిపోయారు. దిక్కులేని తను వంటరిదైపోయింది. భయంకరమైన మృత్యువు కళ్ళముందే ఇద్దర్ని మాయంచేసింది. తనకంటూ ఎవ్వరూ లేకపోయినా—ఆ మృత్యువు పిలువందే దాకా బ్రతకాలి.

కృష్ణప్రియ జీవచ్ఛవంలా ఐపోయింది.

అక్కయ్య పోయాక ఈ ఇంట్లో ఏ అర్హతతో ఏ స్థానంలో వుండాలో అర్థంకావటం లేదు. కోడలు చెల్లెలిగా అడుగుపెట్టినా—కోడలే పోయాక ఈ ఇంటితో తన బంధం ఇంకేం మిగిలివుంది ?

అలాగని ఎక్కడకు వెళ్ళగలదు తను ?

తనపన్లు తనే చేసుకుంటున్నా ఈ ఇంట్లో తనకేం స్వాతంత్ర్యం వుంది ?

ఈ భావం రోజురోజుకీ పెరిగిపోతోంది.

తనని తనే ఒక అవాంఛనీయ వ్యక్తిగా ఊహించుకుని బాధపడటం మొదలుపెట్టింది.

లక్ష్మి ఆప్యాయంగా చూస్తోందంటే — అది ఆవిడ మంచితనం.

తులశమ్మగారూ ప్రేమగా పలకరిస్తూ ఎప్పటిలా చూస్తున్నారంటే — అది ఆవిడ సహృదయత.

అక్కయ్య పోయిన దగ్గర్నుంచీ కృష్ణారావు తనని కన్నెత్తికూడా చూడటం లేదు. అతని ధోరణి పూర్తిగా మారిపోయింది. ఎప్పుడూ ఏదో ఆలోచిస్తూ దేని కోసమో అన్వేషిస్తున్నట్టు చాలా కాలం మౌనంలోనే గడిపి వేస్తున్నాడు. మడీ ఆచారం—పూజా పునస్కారాలకు దాదాపు స్వస్తి చెప్పినట్టు, ఇంట్లో వాళ్ళతో కూడా అంటీ అంటునట్టు ప్రవర్తిస్తున్నాడు.

అవును మరి అలా వుండక ఇంకెలా వుంటారు ?

లక్ష్మితో మాట్లాడాల్సిన అవసరమూ-- తనని పలకరించాల్సిన అవసరము లేదు. తులశమ్మ కోలుకోకపోయినా — ఆవిడ తన మాటలు వింటుందనే ధైర్యం లేకపోయినా— ప్రయత్నం చెయ్యాలనే సంకల్పం వున్నా, అంతకు మించిన సంకల్పం తన హృదయాన్ని ఆవరించి వుండటం వల్ల—చాలా భాగం ఆ ఆలోచనల్లోనే గడిపి వేస్తున్నాడు.

''అత్తయ్యకి ధైర్యం చెప్తే మంచిదేమో.''

నెయ్యి వడ్డిస్తూ చిన్నగా అంది లక్ష్మి.

చాలాకాలం తరువాత మాట్లాడింది.

''మరీ దిగులు పెట్టుకున్నారు ... నువ్వు పూర్వంలా వుండటంలేదు...''

''... ... ...''

''కృష్ణా... అమ్మని ఓదార్చ కూడదా ?''

వదిన వంక చూసి తల దించుకున్నాడు కృష్ణారావు.

''అన్నీ తెల్సిన అమ్మని ఏమని ఓదార్చగలను ?— ఇప్పుడేది చెప్పినా వినేస్థితిలో లేదు కదా—నేనూ సమయం కోసమే ఎదురు చూస్తున్నాను.''

అదోలా నవ్వింది లక్ష్మి.

''నీ ప్రయత్నం నువ్వు చెయ్యకపోతే అమ్మ స్థితి ఇలాగే వుంటుందేమో — వాళ్ళని వాళ్ళు మార్చుకోగలిగే స్థితిలో లేనప్పుడు అటువంటి స్థితిలో వున్న మనమే ప్రయత్నించాలి కదా మరి — ప్రియ మరీ దిగులుపడి పోయింది. ఇంట్లో పరిస్థితులు మొదటికి రావటంతో అత్తయ్య పరిస్థితి అలా వుంది ... ఈ ఇంట్లో కాస్త తిరుగుతూ నేనే కన్పిస్తున్నాను...ఇలా ఎంతకాలం సాగుతుంది ?''

కృష్ణారావు మౌనంగా వుండిపోయాడు.

వదిన చెప్పింది నిజమే. ఇటువంటి పరిస్థితుల్లో ఆవిడ ఆరోగ్యం మటుకు ఎంత కాలం నిలుస్తుంది ?

ఇంట్లో ఏమాత్రం సంతోషంలేదు.

భవిష్యత్‌ను గురించిన ఆశ కొద్దిగా కూడా లేదు.

ఈ వాతావరణం వదిన మీద ఎటువంటి ప్రభావాన్ని కల్గించగలదో అర్థమైంది. కావాలని పనిగట్టుకుని తనతో ఇంతసేపు మాట్లాడుతూందంటే—తన వల్ల ఈ ఇంట్లో తానాసించిన మార్పు రావాలని—

ఆ ఆశ వుండటంలో తప్పులేదు.

''కృష్ణతత్వం వ్రాయటం నీ బాధ్యతని ఎలా అనుకున్నావో...''

''— నా బాధ్యతలన్నీ నేను నెరవేరుస్తాను వదినా.''


కృష్ణ మాటల్లో స్థిరత్వం—

లక్ష్మి కళ్ళల్లో వెలుగును నింపింది.

(ఇంకా వుంది)

గురుదక్షిణ

అవధానుల జగన్నాధరావు & మల్లంపల్లి గాంధీరామారావు



"వరండాలో కాస్త లైటు వేసి వెళ్ళమ్మా" అన్నారు ధర్మారావుగారు నెమ్మదిగా.

వంటింట్లో వంట ప్రయత్నాలు చేస్తున్న శాంత నెమ్మదిగా వచ్చి లైటువేసి...గ్లాసుతో మంచినీళ్ళందించింది.

గత పదేళ్ళుగా ఈ తండ్రీ కూతుళ్ళకది అలవాటే—

చీకటిపడే వేళ ఆయన లైటు వేయమని చెప్పడం, శాంత లైటు వేయడంతో బాటు గ్లాసుతో మంచినీళ్ళు అందించడం.

ఆప్యాయంగా కూతురి ముఖంలోకి చూశారు ధర్మారావుగారు. తలదించుకొని వంటింట్లోకి వెళ్ళిపోయింది శాంత.

"శాంతకి పెళ్ళి చేసి...తక్షణం పంపించేయాలి" అనుకున్నారు ధర్మారావుగారు బాధగా.

పదేళ్ళుగా తను శాంతని కన్నతల్లిలేని లోటు లేకుండా పెంచాడో, శాంతమ్మే తనకన్నీ అయి పెంచిందో అర్థంగాదు ఆయనకి. తండ్రిగా తన బాధ్యత—శాంతనో యింటిదాన్ని చేసి పంపేయడం.

కాని పంపించడం ఎలా ?

ఓ మంచి యింట్లో పడేయడానికి కావలసిన వేలకి వేలు కట్నాలు తాను తీసుకురాగలడా ?

ఉన్న యిల్లు కాస్తా తెగనమ్మి...పెళ్ళి చేసి పంపించినా శేష జీవితంలో తనని చూసుకునే దిక్కెవరు ?

తనని ఆదరించే విశాల హృదయుడైన అల్లుడు దొరకడం సంభవమేనా ?

సమాధానంలేని ఈ ప్రశ్నలు – పదేపదే సతమతం చేస్తుంటే అలాగే కుర్చీ వెనక్కు జేరబడి కనులు మూసుకొని నిద్రలో కొరిగారు ధర్మారావుగారు.

* * *

రిటైరైన దగ్గర్నుండి తన పెళ్ళి ప్రయత్నాలు ముమ్మరంగా చేస్తున్న తండ్రిని చూస్తుంటే—దిగులు వేస్తోంది శాంతకి.

"ధర్మారావు మాస్టారు నిజంగా ధర్మరాజే." అన్నపేరు తప్ప మరేమీ మిగుల్చుకోలేకపోయారు జీవితాన్ని విద్యార్థుల కంకితం చేసిన ధర్మారావు గారు.

రాత్రనక, పగలనక విద్యార్థులకి శ్రమించి పాఠాలు చెప్పడం తప్పించి ప్రతిఫలం ఆపేక్షించని త్యాగమయ జీవితం ఆయనది.

ఇరవై అయిదేళ్ళు ఆయనతోబాటు కష్టసుఖాలు పంచుకున్న అమ్మ జీవితంలో ఆలస్యంగా మాతృమూర్తిగా మారి, ఆ మాతృత్వంలోని మాధుర్యాన్ని పూర్తిగా గ్రోలకుండానే ఆ పరమేశ్వరునిలో ఐక్యమయింది – తనని నాన్న కందించి.

అనుక్షణం తనమీద ఆధారపడే నాన్న...

తన అండలేని నాన్న ఒంటరి జీవితాన్ని, ఊహించలేకపోతోంది శాంత.

"వీధి అరుగుమీద దంత ధావనంకోసం నీళ్ళు పెట్టడం మొదలు, రాత్రి పడుక్కోబోయే ముందు "భగవద్గీత"లోని కొన్ని శ్లోకాలు చదవడంవరకూ, అన్ని పనులూ నాన్నకి క్రమం తప్పకుండా ఎవరు చేసిపెడతారు ?"

"చిన్న ప్రాణినికూడా హింసించని ఆయన సుకుమారమైన మనస్తత్వాన్ని అర్థం చేసికొని ఆదరించేదెవరు ?"

జవాబులేని ప్రశ్నలు... మనస్సును ఆందోళనాభరితం చేస్తున్నాయి.

"ఎవరైనా యోగ్యుడు ఇల్లరికానికి యింటికివస్తే" – తన ఆలోచనకి తనకే నవ్వు వచ్చింది శాంతకి.

"కట్నంలేకుండా కట్టుకోవడమే కాకుండా మామగారి బాధ్యతనికూడా తీసుకునేందుకు ఎవరు సిద్ధపడతారు ?"

ఆలోచనల మధ్యలోనే "అమ్మా" అని పిలిచిన నాన్న పిలుపుకు "వస్తున్నా నాన్నా!" అంటూ భగవద్గీతని చేతిలోకి తీసుకొంది శాంత.

* * *

పసిపిల్లల మొహంలోని నైర్మల్యం, యోగుల మొహంలోని కాంతి కలబోసుకొని, చిన్న చిరునవ్వుగా మారి తండ్రి మొహంలో నిలిచినట్లు అనిపించింది శాంతకి – భగవద్గీత వింటూ నిద్రలో కొరిగిన తండ్రిని చూస్తుంటే.

ఈ సమస్యకి త్వరలోనే పరిష్కారం ఆలోచించవలసిందే అనుకుంది శాంత తండ్రికి దుప్పటి కప్పుతూ.

తండ్రి తర్వాత, తన జీవితంలో ప్రవేశించి,

అప్పుడప్పుడు తన ఆలోచనల్లో చోటు చేసుకునేది విశ్వం మాత్రమే.

ఏదో ఆలోచన మెరుపులా మెరిసింది. వెంటనే కలం అందుకుంది.

విశ్వానికి,

అశాంతితో అలమటించిపోతున్న ఈ శాంతకి శాంతి నిచ్చేది... నీ ఓదార్పు తప్ప మరేదీ లేదని తెలిసి... ధైర్యంచేసి నీకు ఈ ఉత్తరం వ్రాస్తున్నా, అన్యధా భావించవుకదూ ?

సరస్వతీ కటాక్షంవల్ల, నాన్న ప్రేమకు పాత్రుడివై వింతగా మాజీవితాలలో ప్రవేశించావు. ఇంతవరకు మాలో ఒకడిలా కలిసిపోయావు. ఉద్యోగాన్వేషణ ప్రారంభించిన వెంటనే చక్కని ఉద్యోగం దొరికిన...ఇక నీవు మమ్మల్ని మరచిపోయినా అది తప్పుగా భావించను. ఎందుకో తెలుసా ? నవ్వులాగే, మరపుకూడా, దేముడు మనిషి కిచ్చిన వరం కాబట్టి ! కాని ఉద్యోగం దొరికి సంవత్సరమైనా మరచిపోని, నీ మంచి తనపు మర్రిచెట్టు నీడన కాస్త విశ్రాంతి తీసుకుందామనిపించింది విశ్వం !

అందరు తండ్రుల్లాగే నాన్న కూడా, నా పెళ్లి ప్రయత్నాలు ముమ్మరంగా చేస్తున్నాడు, గాని పిచ్చినాన్న. నన్నొదిలి బ్రతగ్గలడా ? నాన్న సంగతి నాకు బాగా తెలుసు. మరణానికైనా సిద్ధమవగలడు గాని నన్ను తన జీవితాంతం అవివాహితగా చూడగలడా ?

అసలే ఆరోగ్యం అంతంత మాత్రంగా ఉన్న నాన్న... నా ఎడబాటు వల్ల వచ్చే దిగులుతోనా, ఏ పనులూ చేసుకోలేని అశక్తత వల్లా...ఎన్నాళ్లు జీవిస్తాడో చెప్పలేను విశ్వం !

ఇలాంటి తలా తోకా లేని సమస్యలతో సతమత మౌతున్న నాకు నీ సలహాలు, సానుభూతి ఎంతో అవసరం విశ్వం !

నీ ఉత్తరం కోసం ... ఎదురుచూస్తూ

నీ

శాంత.

* * *

ఎగిరెగిరి గంతు వేయాలనిపించింది విశ్వానికి—మాస్టారిమండి, శాంత నుండి—ఒకేసారి వచ్చిన ఉత్తరాలు చూసి.

ఎప్పుడూ, ఎదురుగా కూర్చొని గంటల తరబడి కాలం గడిపినా నోరెత్తి మాట్లాడని శాంత నుండి ఉత్తరం చూసి ఆత్రుతగా చింపాడు విశ్వం.

ఉత్తరంలో విషయాలన్నీ చదివి ... మనసంతా ఆదోళ అయిపోయింది. రెండో ఉత్తరం చించడానికి ధైర్యం చాలలేదు.

"ధర్మారావు మాస్టారు."

తల్లిదండ్రులు ముందుగానే ఆయన ప్రవర్తనని ఊహించి ఆ పేరు పెట్టారా అనిపిస్తుంది — ఆయన్ని తలచుకొన్నప్పుడల్లా. ఉదయం ఎనిమిదినుండి, రాత్రి ఎనిమిదివరకూ

ఎలాగైనా జీవితంలో పైకి రావాలన్న ఆలోచన తనని ధర్మారావు మాస్టారి పాదాల వద్దకు చేర్చింది.

పాదాలవద్ద నున్న తనని అక్కునజేర్చుకొని ఆదరించిన ధర్మారావు మాస్టార్ని తను మరచి పోవడం ? ... జీవించి ఉండగా జరగనిపని అది.

శెట్టి కొట్లో పనులు ముగించుకొని, రాత్రి పది అయేసరికల్లా మాస్టారి యింటికి చేరుకునే వాడు తను.

మగతనిద్రలో ఉన్న మాస్టారు నిద్రలేచి... పాఠాలు చెప్పడానికి ఉపక్రమించేవారు — తన ఆరోగ్యాన్ని కూడా లక్ష్యపెట్టకుండా.

చదువులో తన చురుకుదనం చూసి ఎంతో సంబరపడి పోయేవారు మాస్టారు.

అంతగా ఆస్తిపాస్తులు లేని మాస్టారి జీవితంలో...ఆరేసినెలలు వరసగా జీతాలందక పోవడం మామూల్లే.

అలాంటి ఆర్థిక పరిస్థితుల్లో...వారి బడుగు జీవితాల్లో భాగం పంచియిచ్చారు. కష్టాల కాలకూటాల్ని సర్వేశ్వరుడిలా భరిస్తూ, ఆనందాల్ని వెన్నెల వెలుగుల్లా పంచియిచ్చే తత్వం మాస్టారుది. భోజనానికి, నిద్రకి విశ్వం పరుగులు చూసిన మాస్టారిమనసు కరిగిపోయింది. ఫలితంగా వారి వీధిగదిలోకి మకాం మారిపోయింది. తిండీ, బట్టా, పుస్తకాలు...అన్నీ ఖర్చులు ఆయనవే. జీతం పందరూపాయలూ ఏమూలకూ రావని తెలిసినా వేణీళ్లకీ చన్నీళ్ళు తోడుగా ఉంటాయని మాస్టారికే యిచ్చేసేవాడు విశ్వం.

మాస్టారి దీవెనలూ, విశ్వం పరిశ్రమా ఫలించాయి. ఫలితంగా ఆంధ్రా మెట్రిక్‌లో స్టేట్‌ఫస్ట్‌లో పాసయ్యాడు విశ్వం.

ఆ శుభవార్త మాస్టారికి చెపుదామని పరుగు పరుగున వెళ్ళాడు విశ్వం. "చాలా సంతోషం విశ్వం" అని "రేపు కాలేజీలో జాయినవు !" అన్నారు ఆజ్ఞాపిస్తున్నట్లుగా.

"మరి ఉద్యోగం ?" అన్నాడు విశ్వం ఆశ్చర్యంగా.

"మానేసేయ్" అన్నారు అంతేకాకుండా "విశ్వం ! ఐదేళ్ళ నీ కష్టార్జితం వడ్డీతో కలిపి మొత్తం ఎనిమిది వేలయింది. దానిలో ఒక్క పైసా ఖర్చు పెట్టకుండా దాచి ఉంచాను. నీ పేర బాంక్‌లో వేసుకో. ఇంజనీరింగ్ చదవడానికి పనికొస్తుంది" అన్నారు శాంతంగా.

ఆయన మహోన్నతమైన వ్యక్తిత్వం ముందు, విశ్వం మనస్సులోని ఉద్వేగం మంచులో కరగి, కన్నీరుగా మారి మాస్టారి పాదాభిషేకం చేసింది.

"చూడు విశ్వం ! 'కష్టే ఫలే' అన్న నానుడి మీద ఎంతో నమ్మకమున్న వాడ్ని నేను. నీవు బాగా చదవగలవనే నమ్మకం నాకున్నా, శ్రమజీవితంలోని విలువ తెలియాలని, ఇంత

చదువు నిరాటంకంగా సాగనాగాలంటే ఇలాంటి ఉద్యోగాలతో కుదరదు" అన్నారు మాస్టారు.

"మాస్టారూ ! అంటే పూర్తిగా మీకు భారంగా మారి..." — హిమాలయంలాంటి మాస్టారి వ్యక్తిత్వం ముందు...విశ్వానికి మాటలు పెగల్లేదు.

"చూడు విశ్వం ! నాకొచ్చిన నాలుగు ముక్కలు చెప్పడానికి, మాతోబాటు కలోగంజో మరో విద్యార్థికి పంచడానికి, నీలాంటి పేద విద్యార్థినుండి డబ్బు తీసుకొని... ఆ చదువుల తల్లికి అవమానం చేయలేను" అని విశ్వాన్ని తృప్తిగా కౌగిలించుకున్నారు మాష్టారు.

ఆయన సలహామేరకు యింటర్‌లో జాయిన వడం, తర్వాత ఇంజనీరింగ్ పూర్తి చేయడం... కలలో సంఘటనల్లా జరిగిపోయాయి.

అప్పుడు జ్ఞాపకం వచ్చింది విశ్వానికి. ధర్మారావు మాష్టారు వ్రాసిన ఉత్తరం సంగతి... వణుకుతున్న చేతుల్తో ఉత్తరాన్ని చించాడు.

* * *

నిశ్శబ్దంగా మాష్టారి లెటరు మడచి జేబులో పెట్టుకున్నాడు విశ్వం. తన సర్వస్వం.. తనకి ధారపోయమని మాష్టారు అన్నా... తను సిద్ధమే. అమూల్యమైన మాష్టారి, ప్రేమాభిమానానికి ఋణం తీర్చుకోవాలనుకుంటే ఈ జన్మ చాలదు.

గాని... గాని... మాష్టారు కోరిన ఒకే ఒక్క కోరిక... చిన్న కోరికవి నెరవేర్చలేని తన అశక్తతని, తననీ పరిస్థితులకి గురిచేసిన పరిస్థితుల్ని ఎలా తిట్టుకోవాలో అర్థంకాలేదు విశ్వానికి.

ఆరేడు సముద్రాల్లోని, అల్లకల్లోలాల్ని కలబోసి తన మెదడులో జొప్పించినట్లు అనిపించింది.

అల్లకల్లోలమైన ఆ సముద్ర కెరటాల్ని... వాటి ధాటిని తట్టుకునే శక్తి తనకుందా ? మాష్టారి మనస్సులోని కోర్కెని నెరవేర్చలేని తన నిస్సహాయతని ఆయన స్వార్థంగా భావిస్తే?

కోరక కోరక కోరిన ఆయన కోర్కెను మన్నించి తనను తమ మోసం చేసుకోలేడు. గాని ఆయనను కాదని, మనసుని నొప్పించి తమ మన లేడు. తలాతోక లేని ఈ సమస్యను పరిష్కరించే నాథుడెవరు ?

ఇరవై నాలుగేళ్ళ. . తన జీవితంలో ఎన్నో సమస్యల్ని సులభంగా పరిష్కరించింది—ధర్మారావు మాష్టారు.

ఈ సమస్యకు కూడా పరిష్కారం లభించేది మాష్టారి వద్దే అనిపించింది. వెంటనే విజరం వెళ్ళే బస్సెక్కాడు విశ్వం.

* * *

"దీర్ఘాయుష్మాన్ భవ" అన్నారు ధర్మారావుగారు. కాళ్ళకు నమస్కరిస్తున్న

గురుదక్షిణ

విశ్వాన్ని ఆప్యాయంగా రెండు చేతుల్తో లేవ నెత్తుతూ.

ఒకప్పుడు మాసిపోయిన బట్టల్తో, అమాయకమైన మొహంతో, నలభైవాట్ల బల్బు వెలుగులో దీక్షగా చదివే విశ్వం, ఈనాడు ఇస్త్రీ చేసిన బట్టల్తో, ప్రపంచాన్ని జయించే ఆత్మవిశ్వాసంతో వెలిగిపోతుంటే — మాష్టారి కళ్ళు గర్వంతో మెరిశాయి.

దారిపక్క, ఏ పశువుకో ఆహారంగా మార వలసిన పిచ్చిమొక్క... ఈనాడు నిండుగా పెరిగి, సుగంధాలు విరజిమ్మే చక్కని పూలు పూసే మొక్కగా మారినందుకు, ఆ మారడంలో తన పాత్ర ఉన్నందుకు ... ఓ విధమైన తృప్తి ఆయన పెదవులపై చిరుదరహాసమై నిలిచింది.

''బాగున్నావా విశ్వం! నిన్నిలా చూస్తుంటే నా కెంత గర్వంగా ఉందో తెలుసా'' అన్నారు తృప్తిగా.

''అంతా మీ చలువ మాష్టారూ! మీ ఆదరణా, అభిమానంలేని ఈ విశ్వం బ్రతుకెలా మారేదోకూడా ఊహకందనంత ఆప్యాయతతో పెంచిన మీ ఋణం తీర్చగలిగే శక్తి నాకెక్కడిది మాష్టారూ'' అన్నాడు విశ్వం.

''మంచినీళ్ళు తీసుకో విశ్వం'' అంది శాంత.

''బాగున్నావా శాంతా ?'' అన్నాడు విశ్వం నవ్వుతూ.

చిరునవ్వే సమాధానంగా చెప్పింది శాంత.

''మాష్టారూ! వయస్సు మీమీద, నామీద, నాకు తెలిసిన అందరిమీదా తన ప్రభావాన్ని చూపించి ... ఒకే ఒక్కచోట ఓడిపోయింది. నేను పదేళ్ళప్పుడు చూచినప్పటి మాట్లాడని మల్లెమొగ్గ, అప్పటికీ యిప్పటికీ అలాగే ఉంది'' అన్నాడు విశ్వం శాంతవైపు ఆప్యాయంగా చూస్తూ.

''ఏమిటో విశ్వం ! ఈ బీదబడిపంతులు కూతురుగా పుట్టడమే నా శాంతమ్మ తల్లి చేసుకున్న పాపమేమో'' అన్నారు ధర్మారావుగారు బాధగా.

ఆ మాటలు వినడం ఇష్టంలేని శాంత వంటింట్లోకి వెళ్ళిపోయింది.

''మాష్టారూ ! ఇంతవరకూ మీ విశ్వం మీ రడిగిన ప్రతిప్రశ్నకూ సమాధానం చెప్పే వాడు. ఈసారి ''ప్రశ్న...సమాధానం'' కూడా మీదే'' అనుకున్నాడు విశ్వం మనసులో.

* * *

వేపచెట్టు మీదనుండి వీచే చల్లగాలి విశ్వం మనసుకు కాస్త ఊరట కలిగించింది. పాతబడిన పెంకుటింటి కప్పుమీద కూర్చొన్న కాకి కావు కావుమని అరుస్తోంది. చెట్టుమీద పిచికలు చేసే గోల మనసుకు ఆహ్లాదం కలిగిస్తోంది.

''విశ్వం తనమాట కాదంటే?'' —ఏం చేయాలో అర్థంకాలేదు మాష్టారుకి. ఆలోచనలు సతమతం చేస్తుంటే, చేసేదిలేక పడక్కుర్చీలో వెనక్కువాలి కళ్ళుమూసుకున్నారు మాష్టారు.

పెను తుఫానుకు లోనవుతానని తెలిసినా ధైర్యంగా వలలు వేసుకొని చేపలు పట్టడానికి పోయే బెస్తవాని మనసులా ఉంది...'' ఎదురుగా స్టూలుపై కూర్చొన్న విశ్వం మనసు.

పది నిముషాలపాటు ఇరువురిమధ్యా నిశ్శబ్దం రాజ్యమేలింది.

మాష్టారే ముందుగా ప్రారంభించారు. ''చూడు విశ్వం ! ఉత్తరంలో నేను కోరినకోర్కె సామాన్యమైనది కాదని నాకు పూర్తిగా తెలుసు. నా ప్రశ్నకు, నీ సమాధానమేదైనా నీవు నా విశ్వానివే. నిస్సంకోచంగా నీ అభిప్రాయం చెప్పు. నీవు తీసుకునే నిర్ణయంలో పొరపాటు ఏమాత్రం జరిగినా బాధపడేది నీ వొక్కడవేకాదు. నేను కూడా !''

ఈనాడూ,ఏనాడూ మాష్టారి తత్వమే అది. ఆదరించడమే గాని ఆశించడం ఎరగనిది ఆయన వ్యక్తిత్వం.

విశ్వం కనులలో నీళ్ళు నిలిచాయి. ''వరాలిచ్చిన దేముడు కోరిన... ఒకే ఒక్క కోరికను...'' విశ్వం మనసులో సుళ్ళు తిరుగు తున్న మాట గొంతుదాటి రాలేకపోతున్నట్టు గ్రహించారు మాష్టారు.

''తీర్చలేకపోతున్నానని బాధపడుతున్నావా విశ్వం ! నా జీవితంలో మొదటిసారి యాచించింది నిన్నే. ఎందుకో తెలుసా ? నీవద్ద ఆ చనువు, నీమీద ఆ అధికారం ఉన్నాయన్న భావన. నా కోర్కె తీర్చలేదని నీవెంత బాధపడు తున్నావో... తీర్చలేని కోర్కె కోరినందుకు నేనంతగా... బాధపడుతున్నా. నీవూ వ్యక్తుడ వయ్యావు. శాంత అందచందాలు నీకు నచ్చక పోవచ్చు. ఇంజనీరువైన నీవు ఇంకా చదువుకున్న అమ్మాయిని నీ సహధర్మచారిణిగా కోరుకో వచ్చు... నీ హోదా... !''

''మాష్టారూ ! మీ దయాదాక్షిణ్యాలమీద పెరిగిన నేను మిమ్మల్ని ఏనాడూ మిమ్మల్ని దైవం కన్నా తక్కువగా అంచనా వేయలేదు...వేయలేను కూడా. నాకు నచ్చనిది శాంత అందచందాలూ... చదువు సంధ్యలూ... కావు మాష్టారూ ? శాంత మీ కుమార్తే కావొచ్చు. కాని నాకెవరో తెలుసా. ఆకలికి అన్నం పెట్టిన అమ్మ. అభిమానం పంచిపెట్టిన చెల్లి. నా అల్లర్లకి ఆదలించిన అక్క. నా ఉన్నతిని కాంక్షించిన దేవత. అలాంటి శాంతను దైవంలా ఆరాధించ గలనుగాని భార్యగా ఊహించలేను మాష్టారూ...'' బావురుమన్నాడు విశ్వం.

''నీ మనసును గ్రహించకుండా నిన్ను యిబ్బంది పెట్టినందుకు నన్ను మన్నించు విశ్వం ! నన్నింత గౌరవంగా చూసుకునే నీవు, నా శాంతమ్మను ప్రాణప్రదంగా ఏలుకుంటావని అనుకున్నానుగాని... నీకు శాంతపై ఎలాటి అభిప్రాయం ఉందో ఊహించలేని నా మూర్ఖత్వాన్ని మన్నించు విశ్వం'' అన్నారు మాష్టారు.

''మాష్టారూ ! అనాధనైన నాకు మీరిద్దరూ... రెండు నేత్రాలై దారి చూపారు. ఊరూ పేరూ, కులమూ గోత్రమూ, అమ్మా నాన్నల పేర్లు కూడా తెలియని నాలాంటి అనాధని సాకడమే కాకుండా... మీ కుటుంబంలో స్థానమిచ్చి ఆదరిద్దామనుకున్న మీ ఔన్నత్యానికి విలువకట్టే శక్తి నాకులేదు. మీ మాట కాదని... మిమ్మల్ని నా నిర్ణయానికి... అంగీకరించమని అర్థిస్తున్నా...నా కోర్కెను మన్నిస్తారు కదూ మాష్టారూ !''

''చెప్పు విశ్వం ! కేవలం విద్యలోనే కాకుండా, మానవత్వపు విలువల్లో ఎంతగానో ఎదిగిపోయిన నిన్ను చూస్తుంటే నాకెంత సంబరంగా ఉందో తెలుసా ''

''అమ్మా నాన్నలంటే తెలియని నేను మీలో ఆ యిద్దర్నీ చూసుకున్నా. కాని నన్ను కని, ఈ జనారణ్యంలో నిర్దాక్షిణ్యంగా వదిలి, వారిదారి చూసుకొన్న ఆ స్వార్థపరుల్తో మిమ్మల్ని పోల్చి, కించపరచ దలచుకోలేదు. ఈనాటినుండి మీ బాధ్యతలన్నీ నావే. శాంతకు చక్కని వరుడ్ని చూసే బాధ్యత, అన్నగా ఆదరించే అదృష్టం, వృద్ధాప్యంలో మీకు సేవ చేసుకునే భాగ్యం నాకు ప్రసాదించండి ... కాదన...''

''విశ్వం ! చదువుల తల్లిని నమ్మిన వాడెప్పుడూ చెడిపోలేదు. ఆనాడు పోతన పరువు నిలిపిన తల్లి, ఈనాడు నడిసముద్రంలో నావలా, దిక్కుతోచని నాకు దారి చూపింది నీ ద్వారా...!'' అంటూ కాళ్ల వద్ద నున్న విశ్వాన్ని లేపి అక్కున జేర్చుకున్నారు.

వెచ్చని రెండు కన్నీటిబొట్లు విశ్వం తలను తాకాయి. మరి రెండు కన్నీటి చుక్కలు ... మాష్టారి పాదాల్ని అభిషేకం చేశాయి. ★

హైదరాబాద్ నోట్‌బుక్

తిరుమల రామచంద్ర

ఈనాటికీ కావ్యావిష్కరణ :

ఈనాటికీ
ఈ మాతృదేశపు ఒడిలో
ఆకలిచిచ్చుకు తాళలేక
కరెంటు వైర్లకు వేలాడి
మాడిపోతున్న మన సోదరులు
ఈనాటికీ
నిజం చెప్పినవాణ్ని
మానవ హక్కులకోసం
మనిషి మనుగడకోసం ప్రశ్నిస్తే
ఎదురు కాల్పులపేర
హత్యలు చేస్తున్న పోలీసులు

ఇవి ఈ నాటికీ అనే కవితా ఖండికలోని కొన్ని పంక్తులు. ఈ ఖండికే నిఖిలేశ్వర్ రచించిన కవితా సంకలనానికి పేరు. నిఖిలేశ్వర్ నల్లగొండజిల్లా వీరవల్లి గ్రామంలో జనించిన వీర కవి -- కొంతకాలం దిగంబర కవులలో ఒకరు. మరికొంతకాలం విప్లవ కవి. ప్రస్తుతం ప్రజాకవి; ప్రజాస్వామిక పౌర స్వపరిరక్షణోద్యమంలో క్రియాశీల కవి. సంవత్సరంపాటు ప్రజాసాహితి మాసపత్రిక సంపాదకులు. వృత్తి కేశవ మెమోరియల్ స్కూలులో చదువు చెప్పడం, కొంతకాలం ఎయిర్ ఫోర్స్‌లోనూ పనిచేశారు. ఇదివరకు దిగంబర కవులు, మండుతున్న తరం, గోడల వెనుక (జైలు జ్ఞాపకాలు) – అనే కవితా సంపుటాలు వెలువరించారు. పన్నెండేళ్ల తర్వాత 'ఈనాటికీ' కవితా సంకలనం నవతా పబ్లికేషన్స్ ద్వారా ఈనాడు వెలువరించారు. 54 ఖండికలున్న ఈ సంపుటి కోట్ల విత్తనాలు చల్లిన మహాజనులారా – అనే ఖండికతో ఆరంభమయి, ఈ నాటికీతో సమాప్తమవుతుంది. నిఖిలేశ్వర్ వాస్తవికత పేరుతో కవితా కమనీయతను వార్తల భాషా స్థాయికి దిగజార్చడు :

నిన్న మొన్ననే వోటు విత్తనాలు
చల్లిన ఓ మహాజనులారా ?
రాబోయే ఐదు సంవత్సరాలలో
మీ కలల పంటలన్నీ
ఏపుగా పెరుగుతాయవి
ప్రజాస్వామికమైన ఆశల్ని పెంచుకొన్న
ఓ నిరుపేద అక్కతమ్ముళ్లారా !

తన సిద్ధాంతాన్ని నినాదాలతో కేకలతో కాక సున్నితంగా భాంగ్యంతరంగా చెప్పడం నిఖిలేశ్వర్ కవి హృదయానికి తార్కాణ :

సుస్థిర ప్రభుత్వం సజావుగా మళ్లీ
మొలకెత్తి పైకి లేస్తోంది
బుల్‌డోజర్ మెజారిటీ సిద్ధంగావుంది.
రోడ్ రోలర్ ప్రజాసామ్యం
ఎదురుగా నిలుచుంది
కష్టాల చరిత్ర తిరిగి
తనను తానే రాసుకుంటున్నది
పోరాటాల విత్తనానే చల్లాలని
మిమ్మల్ని పిలుస్తున్నది.

దీవిలోని పరుష సరళాలు అనే ఖండిక ప్రఖ్యాత భాషాశాస్త్రజ్ఞులు డాక్టర్ భద్రిరాజు కృష్ణమూర్తికీ, కట్టుబానిసలున్న దేశంలో అనే ఖండిక కట్టుబానిసల విముక్తి కోసం పోరాడుతున్న స్వామీ అగ్నివేశ్‌కూ అంకితాలు. ఈ కవితా సంకలనం ఆవిష్కరణ మే 5వ తేదీ సాయంకాలం చిక్కడపల్లి సిటీ సెంట్రల్ లైబ్రరీలో ఆంధ్ర సారస్వత పరిషత్తు ప్రాచ్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె. కె. రంగనాథాచార్యుల అధ్యక్షతన జరిగింది. డాక్టర్ భద్రిరాజు కృష్ణమూర్తి ఆవిష్కరించారు. అధ్యక్షులు ఆవిష్కర్తలు, కవితా సంకలనాన్ని సమీక్షించిన శ్రీ జ్వాలాముఖి, శ్రీ కె. శివారెడ్డి నిఖిలేశ్వర్ కవితావేశాన్ని, పద ప్రయోగ ప్రయోజనాన్ని, ఆవేశ తీవ్రతను, సమసమాజ స్థాపన లక్ష్య శుద్ధిని వివరించారు. చీకటి గదిలో ఒక్క లైటు వెలిగిస్తే గదంతా కాంతిమయమయినట్టు, ఒక ఖండికలో ఒక పంక్తి బాగున్నా తక్కినదానినంతా రసమయం చేస్తుందని శ్రీ శివారెడ్డి అన్నారు. క = కష్టాలను వి = విముక్తి చేసేవాడే కవి అని, నిఖిలేశ్వర్ అలాటి కవి అని, బుల్ డోజర్ ప్రజాస్వామ్యం, రూపాయి బజారు పాలయింది వంటి ప్రయోగాలు సార్థక మయినవని శ్రీ జ్వాలాముఖి అన్నారు. శ్రీ నిఖిలేశ్వర్ సమాధానం చెబుతూ, ''ముప్పై ఏళ్లపాటు యంత్రాల మధ్య కర్మాగారంలో కష్టజీవిగా బతికిన నాకు శ్రమ విలువ నేర్పి నిలుచోబెట్టిన మా అమ్మ కుంభం నర్సమ్మకు ఆప్యాయంగా ఈ సంకలనాన్ని అంకిత మిచ్చాన''ని అన్నారు. ప్రారంభంలో నవతా పబ్లికేషన్స్, (నల్లకుంట) పక్షాన శ్రీ ప్రభాకరరావు స్వాగతం చెబుతూ, ఈ నాటి ప్రచురణ కర్తలు నవలలకు, నాటికలకు ఇస్తున్న ప్రాముఖ్యం కవిత్వానికి ఇవ్వడం లేదని, అయినా ధైర్యం చేసి ఈ సంకలనం ప్రచురించామని అన్నారు.

ఉపశ్రుతి :

ఏం కవిగారూ ! పూర్వంలాగ రిక్షావాడితోనో, మరొకడితోనో కావ్యావిష్కరణం చేయించక పాత సంప్రదాయం అనుసరించారేమిటి ? – అనడిగాను శ్రీ నిఖిలేశ్వరును. పక్కనున్న ఒక పెద్దమనిషి ఎప్పటికెయ్యది ప్రస్తుత మప్పటికా మాటలాడి యన్యుల మనముల్ నొప్పింపక తానొవ్వక తప్పించుక తిరుగువాడు ధన్యుడు సుమతీ! – అని సుమతి శతకం పద్యం చదివారు. ★

అవీ ఇవీ అన్నీ

కళానిలయం నృత్య పోటీలు

చిలకలూరిపేట 'కళా నిలయం' వారు ఇటీవల నిర్వహించిన అఖిల భారత స్థాయి నృత్య పోటీల ప్రారంభ సమావేశానికి డా. ఎన్. దేవమణి అధ్యక్షత వహించారు. శ్రీమతి రాజ్యలక్ష్మి శాస్త్రి ప్రార్థనాగీతం ఆలపించారు. నటరాజ పూజ శ్రీమతి మద్ది ఉదయలక్ష్మి సత్యనారాయణ చేశారు. శ్రీమతి ఊటుకూరి లక్ష్మి కాంతమ్మ ముఖ్య అతిధిగా విచ్చేశారు. డా. ఎ. విజయలక్ష్మి ఉపన్యసించారు.

ముగింపు సభకి డా. గట్టు రంగారావు అధ్యక్షులుగా, శ్రీమతి నాగళ్ల హనుమాయమ్మ ముఖ్య అతిధిగా విచ్చేశారు. శ్రీయుతులు గంజి రామారావు, కె. రాధాకృష్ణమూర్తి, కె. నారాయణమూర్తి, సి. ఆర్. మోహనరావు, కె. వి. హనుమంతరావు, జంపని భాస్కరరావు, తడికమళ్ల మోహనరావు, ఎం. రాఘవాచార్యులు ప్రసంగించారు.

కళా నిలయం చిహ్నం రూపొందించిన శ్రీ రాజు (చిత్రకారుడు)ని శ్రీ సి. ఆర్. మోహనరావు సన్మానించారు.

పోటీల ఫలితాలు :

కూచిపూడి నృత్యంలో మొదటి బహుమతి బోడపాటి శ్రీ లక్ష్మి సువర్చల, రెండవ బహుమతి అనిసింగరాజు నీహారిక, మూడవ



నెల్లూరుజిల్లా రాపూరులోని యంగ్‌బాయిస్ అసోసియేషన్ వారు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాల ముగింపు సమావేశంలో ప్రసంగిస్తున్న శ్రీ బత్తిన పట్టాభిరామిరెడ్డి (కళాశాల కమిటీ అధ్యక్షులు), విజేతలకి బహుమతి ప్రదానం చేసిన ప్రభుత్వ సివిల్ సర్జన్ డాక్టర్ జి. నిర్మలాదేవిగార్లని చిత్రంలో చూడవచ్చు.

బహుమతి శోభిరాల శ్రీవిద్య, ప్రత్యేక బహుమతి ఎం. అనసూయ, కన్సొలేషన్ బహుమతి ఎన్. భానురేఖలకి లభించాయి.

భరతనాట్యంలో మొదటి బహుమతి ఎం. అనసూయ, రెండవ బహుమతి అనిసింగ రాజు నీహారిక, మూడవ బహుమతి వేమూరి నిర్మల, ప్రత్యేక బహుమతి శోభిరాల శ్రీవిద్య, కన్సొలేషన్ బహుమతి కె. జ్వాలాముఖిలకు లభించాయి.

జానపద నృత్యంలో మొదటి బహుమతి బి. రోహిణి, రెండవ బహుమతి ఎం. అనసూయ, మూడవ బహుమతి బి. దేవవ్రత, ప్రత్యేక బహుమతి టి. ఉషశ్రీ, కన్సొలేషన్ బహుమతి వి. త్రిపురసుందరి గెల్చుకున్నారు.


జానపద గేయాలలో మొదటి బహుమతి కె. శంకరరావు, రెండవ బహుమతి యు. సునీత, మూడవ బహుమతి డి. సారంగపాణి, కన్సొలేషన్ బహుమతి డి. శ్రీవల్లి పొందారు.

నెఫ్జా సంగీత నృత్య కళాపరిషత్

నెల్లూరు ఫిలిం జర్నలిస్టుల ఆధ్వర్యాన జూలై 7, 8 తేదీలలో అఖిలభారత స్థాయిలో కూచిపూడి, భరతనాట్యం రికార్డు డాన్సులలోను, లలిత సంగీతం, తెలుగు సినిమా పాటలు, హిందీ సినిమా పాటలు పోటీలు నెల్లూరు టౌన్ హాలులో నిర్వహిస్తారు. ఈ పోటీలకు న్యాయ నిర్ణేతలుగా సినీ నృత్య దర్శకులు, సినీ సంగీత దర్శకులు వ్యవహరిస్తారు. వివరములకు సెక్రెటరీ, నెఫ్జా నాటక కళాపరిషత్, నియర్ అనితా హాల్, నెల్లూరు—524003 కి రాయవచ్చు.

Printed and Published by S. Nageswara Rao at the Andhra Patrika Press, Mallikarjuna Rao Street, Gandhinagar, Vijayawada-3, Editor : S. Radhakrish


ప్రేమ్ సబ్బుతో స్నానం
రోజంతా ఉల్లాసం
మీ శరీరమునకు మృదుత్వమునిచ్చి సహజ
సౌందర్యమును పెంపొందించు సబ్బు ప్రేమ్.
దీని స్వచ్ఛమైన నురగ, పరిమళము
మీ మనసును పులకింపజేయును.
PREM
Prem
REFRESHING SOAP
గులాబి మరియు ఆకుపచ్చ
రంగులలో లభించును
జయలక్ష్మి
గుంటూరు వారి తయారీ


ఆప్కో - సాంప్రదాయానికి
ఉత్సాహానికి ప్రతీక
ఆప్కో వస్త్రాల విస్తృత శ్రేణి-
• షర్టింగులు • డ్రస్ మెటీరియల్స్
• చీరలు • తయారీ వస్త్రాలు
• గృహోపకరణ వస్త్రాలు
ఆప్కో
చేనేతలు
APSHWCSL
దీ ఆంధ్రప్రదేశ్
స్టేట్ హేండ్లూం వీవర్సు
కోఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్
హైదరాబాద్-500 029